నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

నమ్మలేని నిజాలు

వలపురోగం
హుషారంత హుళిక్కి
గులాబీ మొక్క

ఆకురాలదు
చింతాకంత చింతలు
పేదల ఆస్తి.

కోయిల లేదు
సంతోషాల వసంతం
జీవనభ్రాంతి

విశ్వనాశనం
మతాల ఆదిపత్యం
దూతరావాలి

హిమబిందువు
సర్వజన బంధువు
తరగ నీకు

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాలు

కార్లకింద చావులంటె
కష్టపడ్డ ఫలితాలా ?
లఖీంపూర్ ఖేరీ ఘటన
నేతల యమ జ్వలితాలా ?

నిరసనతో ఉద్యమిస్తె
సంఘ విద్రోహమా ?
తుపాకితో రైతుమీద
ఇంతటి ఆగ్రహమా ?

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ | గురువారం 7-10-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 61 | పేజీలు:8 | వెల: రూ.1/-

లోయలో పడిన ఆర్టీసీ బస్సు..

ఒకరు మృతి, 11 మందికి గాయాలు

పెద్దపల్లి, అక్టోబర్ 6:: జిల్లాలోని మంథని సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.

మంథని మండలంలోని ఎక్లాస్‌పూర్ గాడిదులగండిగుట్ట వద్ద ఆర్టీసీ బస్సు రోడ్డుపక్కన లోయలో పడింది. దీంతో ఒకరు మరణించగా, 11 మంది గాయపడ్డారు. పరకాల డిపోకు చెందిన బస్సు బెల్లపల్లి నుంచి హన్మకొండ వెళుతున్నది.

ఈ క్రమంలో గాడిదుల గండి వద్ద ఓ కారును ఢీకొట్టింది. అదుపుతప్పి పక్కనే ఉన్న లోయలోకి దూసుకెళ్లి బోల్తాపడింది.

దీంతో కారులో ఉన్న వ్యక్తి మరణించగా, బస్సులో ఉన్న ముగ్గురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. మృతిచెందిన వ్యక్తిని ఖాన్‌సాయిపేటకు చెందిన వినీత్‌గా గుర్తించారు. ప్రమాదానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉన్నది.

అంగన్‌వాడీలకు కొవిడ్ వారియర్‌లుగా గుర్తింపులో తెలంగాణ ప్రభుత్వ కృషి

హైదరాబాద్ , అక్టోబర్ 6: తెలంగాణ రాష్ట్రం ఈ దేశానికి అనేక రంగాల్లో రోల్ మోడల్‌గా నిలుస్తూ, మరెన్నో రంగాల్లో దిక్సూచిగా ఉంటోందని రాష్ట్ర గిరిజన, స్త్రీ?శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. తాజాగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను కేంద్ర ప్రభుత్వం కొవిడ్ ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా గుర్తించి, వారికి రూ.50 లక్షల బీమా సదుపాయం కల్పించడంలో కూడా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కృషి ప్రధానమైనదని ఆమె చెప్పారు.

కొవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారిని ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా గుర్తించి, వారికి రూ.50 లక్షల బీమా సదుపాయం కల్పించిందని, అంగన్‌వాడీలకు మాత్రం ఈ బీమా సదుపాయం కల్పించలేదని మంత్రి సత్యవతి తెలిపారు. దాంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు కూడా ఈ రూ.50 లక్షల బీమా వసతి కల్పించాలని కోరుతూ 2021 జూన్ 23న కేంద్రానికి లేఖ రాసినట్లు తెలిపారు.

అనంతరం సెప్టెంబర్ 3న కూడా కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీని ప్రత్యేకంగా కలిసి అంగన్‌వాడీలకు రూ.50 లక్షల బీమా సదుపాయం కల్పించాలని కోరినట్లు మంత్రి సత్యవతి రాథోడ్ చెప్పారు. గత నాలుగు నెలలుగా తాము చేస్తున్న కృషి ఫలితంగానే కేంద్రం అంగన్‌వాడీలకు రూ.50 లక్షల బీమా సదుపాయం కల్పించింది, ఇది సంతోషదాయకమైన విషయమని అన్నారు. ఇందుకు కేంద్రానికి, ముఖ్యంగా కేంద్రమంత్రి శ్రీమతి స్మృతి ఇరానీకి కృతజ్ఞతలు తెలిపారు.

లఖింపూర్ ఖేరి హింస : 11న మహారాష్ట్ర బంద్‌కు శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ పిలుపు

ముంబై, అక్టోబర్ 6:: యూపీలోని లఖింపూర్ ఖేరిలో రైతులపై జరిగిన హింసాకాండకు నిరసనగా శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ పార్టీలు ఈనెల 11న మహారాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. ఆందోళన చేపట్టిన రైతులపై కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడి కారు దూసుకెళ్లిన ఘటనలో నలుగురు రైతులు మరణించడం, అనంతరం జరిగిన అల్లర్లలో మరో నలుగురు మరణించిన ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే.

ఇక ఈ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. బాధిత రైతు కుటుంబాలను కలిసేందుకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లక్నో నుంచి సీతాపూర్‌కు బయలుదేరారు. సాగు చట్టాలను వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగిన రైతులపై మోదీ సర్కార్ పథకం ప్రకారం దాడులకు పాల్పడుతోందని రాహుల్ ఆరోపించారు.

ఈ నెల 16 నుంచి 14 రోజులు పూణే విమానాశ్రయం మూసివేత

ముంబై, అక్టోబర్ 6:: మహారాష్ట్రలోని పూణే విమానాశ్రయాన్ని ఈ నెల 16 నుంచి 14 రోజులపాటు మూసివేయనున్నారు. విమానాశ్రయంలోని రన్ వే అక్టోబర్ 15 రాత్రి 8 గంటల నుంచి అక్టోబర్ 29 వరకు మూసి ఉంటుందని, 30వ తేదీ ఉదయం 8 గంటల నుంచి విమాన సర్వీసులను పునరుద్ధిస్తామని పూణే ఎయిర్ పోర్ట్ అధికారులు ప్రకటించారు. రన్ వే రీ సర్వీసింగ్ పనులను ఎయిర్ ఫోర్స్ చేపడుతుందని, ఈ నేపథ్యంలో 14 రోజుల పాటు రన్ వే మూసి ఉంటుందని తెలిపారు.

మరోవైపు దసరా, దీపావళి వంటి ముఖ్యమైన పండగల సమయంలో వాణిజ్యపరంగా కీలకమైన పూణే ఎయిర్ పోర్ట్ మూసివేతపై విమానయాన సంస్థలు తీవ్ర అంసతృప్తి వ్యక్తం చేశాయి. ఈ నిర్ణయాన్ని సమీక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి.

కాగా, ఐఏఎఫ్ శిక్షణ కేంద్రంలోనే పూణే ఎయిర్‌పోర్టును నిర్వహిస్తున్నారు. భూసేకరణ సమస్యల నేపథ్యంలో పురందర్‌లో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

పూలసోయగముల పులకించు నీ తల్లి
విరుల రాగములకు మురిసియాడు
రంగురంగు పూల రంగాడు బతుకమ్మ
నిన్నుగాను భువిని నన్నుగాను!

– డా॥ అమరాచింతం నటేశ్వరశర్మ
9440468557.

చరిత్రలో నేటినిజం

కం॥ సిక్కుల పతియవ గురువై
శిక్కుల పోరాటాల యనుల శ్రేయము జేగానుచున
యుక్తులగా మానవమున
కెక్కిన గోవిందసింగు నెంతును సతమున్ !!

(అక్టోబర్ 7 సిక్కుల వదో గురువు గోవిందసింగ్ వర్ధంతి...)

–రాధశ్రీ
సెల్: 9494481210

కృష్ణా ట్రిబ్యునల్‌పై తెలంగాణ పిటిషన్ ఉపసంహరణకు అనుమతి

న్యూఢిల్లీ, అక్టోబర్ 6: కృష్ణా ట్రిబ్యునల్ నియామకంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ ఉపసంహరణకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. కృష్ణా జలాల పంపకంపై కొత్త ట్రిబ్యునల్ కోరుతూ గతంలో తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. అయితే ఈ పిటిషన్ ఉపసంహరణపై ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి.

ట్రిబ్యునల్ ఏర్పాటుపై ప్రస్తుతం ఆదేశాలు ఇవ్వట్లేదని సుప్రీంకోర్టు తెలిపింది. అభ్యంతరాల దాఖలుకు ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు అవకాశం కోరాయి. దీంతో అభ్యంతరాల దాఖలుకు ఆ రెండు రాష్ట్రాలకు కోర్టు అనుమతి ఇచ్చింది. పిటిషన్ ఉపసంహరించుకుంటే కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటును పరిశీలిస్తామని కేంద్రం తెలిపింది. కేంద్రం సూచనతో పిటిషన్ ఉపసంహరణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కోరింది. దీంతో త్రిసభ్య ధర్మాసనం పిటిషన్ ఉపసంహరణకు అనుమతి ఇచ్చింది.

బాణాసంచాపై సుప్రీం కోర్టు విచారణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 6: బాణాసంచా తయారీదారుల తీరును సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. గ్రీన్ క్రాకర్ల ముసుగులో నిషేధిత వస్తువులను పటాకుల తయారీలో వినియోగిస్తున్నారని పేర్కొంది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘిస్తూ పటాకుల తయారీదారులో నిషేధిత రసాయనాలను వినియోగిస్తున్నారంటూ దాఖలైన పిటిషన్లపై అత్యున్నత న్యాయస్థానం బుధవారం విచారణ జరిపింది. జస్టిస్ ఎంఆర్ షా, ఏఎస్ బోపన్న ధర్మాసనం పిటిషన్‌ను స్పందిస్తూ.. గతంలో ఇచ్చిన ఆదేశాలను ప్రతి రాష్ట్రం తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది.

'జాయింట్ క్రాకర్స్‌ను నిషేధించాం. కానీ, ఏ వేడుకకు వెళ్లినా అవే కనిపిస్తాయి. మార్కెట్లో అందుబాటులో ఉంటాయి' అని ధర్మాసనం పేర్కొంది. తయారీదారులు బేరియం ఉప్పు నిర్వహిస్తూనే ఉన్నారని వెల్లడించిన ఇటీవలి సీబీఐ నివేదికను ఉదహరించిన కోర్టు.. 'వేడుకల పట్ల మేం విముఖంగా లేము. కానీ, ఇతరుల ప్రాణాలను పణంగా పెట్టి మనం సంబురాలు చేసుకోలేం' అని పేర్కొంది. పటాకుల తయారీదారుల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే.. ప్రభుత్వం జారీ చేసిన ప్రోటోకాల్ ప్రకారమే చేస్తున్నట్లు వాదించారు.

పరిశ్రమపై దాదాపు ఐదు లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, ఇప్పటివరకు శివకాశికి సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ 'తాము జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయడం ప్రధాన సమస్య' అని పేర్కొంది. ఈ సందర్భంగా సీబీఐ నివేదికకు ప్రతిస్పందనగా దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ల కాపీలను మార్పిడి చేసుకోవాలని ఆదేశిస్తూ కేసును ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసింది.

తెలుగు అకాడమీ కేసులో పదిమంది అరెస్ట్ : సీపీ

హైదరాబాద్ , అక్టోబర్ 6:తెలుగు అకాడమీకి సంబంధించిన నిధుల గోల్‌మాల్ కేసులో ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేస్తున్నామని, ఇప్పటి వరకు కేసుల్లో పదిమందిని అరెస్టు చేసినట్లు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ వెల్లడించారు.

సెప్టెంబర్ 27న యూని యన్? బ్యాంకు అధికారుల ఫిర్యాదుతో మొదటి ఎఫ్ఐఆర్ నమోదైందని, ఈ స్కామ్ లో మూడు ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సుమారు రూ.64.50కోట్లు ఎఫ్‌డీ నిధులను విత్‌డ్రా చేసినట్లు విచారణలో గుర్తించినట్లు తెలిపారు. యూబీఐ కార్వాన్ శాఖ నుంచి రూ.26కోట్లు, యూబీఐ సంతోష్‌నగర్ శాఖ నుంచి రూ.11కోట్లు, చందానగర్ కెనరా బ్యాంక్‌లో రూ.6కోట్లు ఎఫ్‌డీలు స్వాహా చేసినట్లు గుర్తించామని సీపీ చెప్పారు.

గతేడాది డిసెంబర్ నుంచి సెప్టెంబర్ 21 వరకు ఎఫ్‌డీల సొమ్ము కాజేశారన్నారు. స్కామ్‌లో కీలక నిందితుడు సాయికుమార్‌పై గతంలో మూడు కేసులున్నాయని, ఈ కేసులో మొత్తం ఎనిమిదిపై అనుమానాలున్నాయని పేర్కొన్నారు. నిందితుల్లో ఎక్కువ మంది ఏపీకి చెందిన వారున్నారన్నారు. సంయుక్త సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ ఎఫ్‌డీఐల సొమ్ము అగ్రసేన్ కోఆపరేటివ్ సొసైటీ ఖాతాలోకి వెళ్లిందని పేర్కొన్నారు. ఏపీ మర్కంటైల్ బ్యాంకు పది శాతం కమిషన్ చేరినట్లు గుర్తించనట్లు చెప్పారు. అధిక శాతం నిధులను సాయికుమార్ తీసుకున్నాడని, మిగిలిన వారంతా ఒప్పందం ప్రకారం వాటాలు తీసుకున్నారని వివరించారు. వాటితో నిందితులు ఆస్తులు కొన్నారని చెప్పారు.

లక్నో ఎయిర్‌పోర్ట్‌లోనే రాహుల్‌గాంధీని అడ్డుకున్న పోలీసులు

లక్నో, అక్టోబర్ 6:: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి లఖీంపూర్ ఖేరీ వెళ్లడానికి యూపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా ఆయనను లక్నో ఎయిర్‌పోర్ట్‌లోనే ఆపేశారు పోలీసులు. ఆయనతోపాటు పంజాబ్ సీఎం చరణ్‌జీత్ సింగ్ చన్నీ కూడా ఉన్నారు. దీనిపై ఎయిర్‌పోర్ట్‌లోనే రాహుల్ మీడియాతో మాట్లాడారు. అసలు నాకు ఎలాంటి అనుమతి ఇచ్చారు. వీళ్లు నన్ను ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వెళ్లనీయడం లేదు అని రాహుల్ అన్నారు.

రాహుల్, ప్రియాంకాలతోపాటు మరో ముగ్గురికి లఖీంపూర్ వెళ్లడానికి బుధవారం ఉదయం యూపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో ఢిల్లీ నుంచి విమానంలో లక్నో చేరుకున్నారు రాహుల్ గాంధీ. అయితే తనను ఎయిర్‌పోర్ట్‌లోనే ఆపేయడంతో.. ఇదీ బీజేపీ ప్రభుత్వ అనుమతి. వాళ్లు ఎందుకు ఇంతలా భయపడుతున్నారు? అని ట్వీట్ చేశారు.

పిఎమ్ కేర్స్‌లో భాగంగా ఏర్పాటు చేసిన పిఎస్ఎ ఆక్సిజన్ ప్లాంటులను ప్రజలకు అంకితం చేయనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 6:పిఎమ్ కేర్స్ లో భాగం గా 35 రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాల లో ఏర్పాటైన 35 ప్రెశర్ స్వింగ్ అడ్ సార్ప్ శన్ (పిఎస్ఎ) ఆక్సీజన్ ప్లాంటుల ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2021 అక్టోబర్ 7న ఉదయం 11 గంటల కు ఉత్తరాఖండ్ లోని ఎఐఐఎమ్ఎస్ రుషీకేశ్ లో జరుగనున్న ఒక కార్యక్రమం లో దేశ ప్రజల కు అంకితం చేయనున్నారు. దీనితో, దేశం లోని అన్ని జిల్లాలు ఇక పిఎస్ఎ ఆక్సీజన్ ప్లాంటులను కలిగివున్నట్లు అవుతుంది. ఈ సందర్భం లో ప్రధాన మంత్రి సభికుల ను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

ఇంతవరకు, పిఎం కేర్స్ ద్వారా దేశవ్యాప్తం గా మొత్తం 1224 పిఎస్ఎ ఆక్సీజన్ ప్లాంటుల కు ఆర్థిక సహాయాన్ని అందించడమైంది. వీటిలో 1100లకు పైగా ప్లాంటులు ఇప్పటికే పని చేస్తున్నాయి. వీటి ద్వారా ప్రతి రోజు 1750 ఎమ్ టి కి పైగా ఆక్సీజన్ ఉత్పత్తి అవుతోంది. ఇది కోవిడ్-19 విశ్వమారి తలెత్తినప్పటి నుంచి భారతదేశం లో చికిత్స కు వినియోగించే ఆక్సీజన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం కోసం ప్రభుత్వం ముందుచూపు తో చేపట్టిన చర్యల కు ఒక నిదర్శనం గా ఉంది.

దేశం లో ప్రతి ఒక్క జిల్లా లో ఒక పిఎస్ఎ ఆక్సీజన్ ప్లాంటు ను ఏర్పాటు చేయడం కోసం తలపెట్టిన ఒక ప్రాజెక్టు ను కార్యాచరణ లోకి తీసుకు రావడం లో భాగం గా పర్వత ప్రాంతాలు, ద్వీపాలు, దుర్గమమైన ప్రదేశాలు కలిగిన భూ భాగాల వంటి క్లిష్ట సవాళ్ళ ను కూడా అధిగమించడం జరిగింది. 7,000 కు పైగా సిబ్బంది కి శిక్షణ ను ఇవ్వడం ద్వారా ఈ ప్లాంటుల కార్యకలాపాలకు, నిర్వహణ కు పూచీ పడడం జరిగింది. సిబ్బంది పనితీరు ను వాస్తవ కాల ప్రాతిపదిక న పర్యవేక్షించడం కోసం ఒక ఎంబెడెడ్ ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి) ఉపకరణాన్ని, అలాగే ఒక ఏకీకృత వెబ్ పోర్టల్ ను ఉపయోగించడం జరుగుతున్నది.

ఈ కార్యక్రమం లో కేంద్ర ఆరోగ్య మంత్రి తో పాటు, ఉత్తరాఖండ్ గవర్నర్, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి లు కూడా పాల్గొంటారు.

ఈ నెల 11న సింగరేణి కార్మికులకు లాభాల బోనస్ చెల్లింపు

హైదరాబాద్ , అక్టోబర్ 6:ఈ నెల 11న సింగరేణి కార్మికులకు బోనస్ చెల్లించనున్నట్లు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. ఈ నెల 8న అడ్వాన్స్ చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 1న దీపావళి బోనస్ ఇవ్వనున్నట్లు చెప్పారు. సగటున ఒక్కో కార్మికుడికి రూ.1.15లక్షల వరకు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. లాభాల వాటా బోనస్ రూ.79.07కోట్లు, దీపావళి బోనస్‌గా చెల్లింపునకు రూ.300కోట్లు సంస్థ చెల్లిస్తుందని సీఎండీ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. నిన్న సింగరేణి సంస్థలపై సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సంస్థ ఆర్జించిన లాభాల్లో కార్మికులకు 29శాతం వాటా ఇవ్వాలని నిర్ణయించారు. గతేడాది కంటే ఈసారి ఒక శాతం వాటాను అధికంగా పెంచారు. దసరా కంటే ముందే కార్మికులకు వాటాను చెల్లించాలని సీఎండీని ఆదేశించారు.

కళలకు పుట్టినిల్లు వనపర్తి : మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, అక్టోబర్ 6:: వనపర్తి ప్రాంత సాంస్కృతిక వైభవాన్ని కాపాడుకుందామని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. వనపర్తిలో బాల భవన్ ఏర్పాటు కోసం మంత్రి నిరంజన్ రెడ్డిని పలువురు కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కవులు, కళలకు, కళాకారులకు పుట్టినిల్లు వనపర్తి అన్నారు.

ఆ ప్రయత్నంలో భాగంగానే వనపర్తి తొలి శాసనసభ్యుడు సురవరం ప్రతాపరెడ్డి పేరు మీద పార్క్ ఏర్పాటు చేసి, వారి విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. వారి పేరుతో రెండు సంకలనాలు తీసుకొచ్చామని తెలిపారు. సాహిత్య శిఖరం సినారె 88వ జయంతి వేడుకలు వనపర్తిలో అత్యంత వైభవంగా నిర్వహించిన విషయానని గుర్తు చేశారు.

2018లో మే 6న నిర్వహించిన జల కవితోత్సవం సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. ఎడ్యుకేషన్ హబ్‌గా పేరొందిన వనపర్తిలో కళలకు మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు. జిల్లాగా ఏర్పాటు కావడంతో మరింత ప్రాధాన్యత పెరిగింది. బాల కేంద్రాన్ని బాలభవన్‌గా అభివృద్ధి చేసుకుందామన్నారు. లలిత కళలకు మరింత ప్రోత్సాహం అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

గిరిజన వైద్య విద్యార్థినికి మంత్రి కేటీఆర్ ఆర్థిక సాయం

హైదరాబాద్ , అక్టోబర్ 6:రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ మరోసారి తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. ఎంబీబీఎస్ విద్యను అభ్యసిస్తున్న పేద గిరిజన విద్యార్థినికి మంత్రి కేటీఆర్ ఆర్థిక సాయం చేశారు. హైదరాబాద్ బోరబండ ప్రాంతానికి చెందిన తిరుపతి అనూష కిర్గిజిస్తాన్‌లో ఎంబీబీఎస్ చదువుతున్న ఆమెకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో ఆర్థిక కష్టాలను అధిగమించేందుకు అనూష తన తల్లితో కలిసి కూరగాయలు అమ్ముతుంది. అనూష పరిస్థితిని తెలుసుకున్న మంత్రి కేటీఆర్.. ఆమెకు ఆర్థికసాయం అందించారు. బోరబండలో నివాసముంటున్న అనూష.. ఎంబీబీఎస్‌లో మూడేండ్లలో 95 శాతం మార్కులు సాధించింది.

ఈ నేపథ్యంలో ఆమె తన వైద్య విద్యను కొనసాగించేందుకు అవసరమైన ఆర్థిక సహాయం చేశారు కేటీఆర్. అనూష ఎంబీబీఎస్ ఫీజుల బాధ్యత తాను చూసుకుంటానని కేటీఆర్ భరోసానిచ్చారు. ఈ సందర్భంగా అనూషకు కేటీఆర్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. అనూష వైద్య విద్యకు అండగా నిలిచిన మంత్రి కేటీఆర్‌కు అనూషతో పాటు ఆమె కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ ఏడాది ఇద్దరికి రసాయనశాస్త్ర నోబెల్

స్టాక్‌హోమ్, అక్టోబర్ 6:: ఈ ఏడాది రసాయన శాస్త్ర నోబెల్(జెనీఎవ్రీ ఖతీతిళివ) ఇద్దరిని వరించింది. జర్మనీకి చెందిన బెంజమిన్ లిస్ట్, అమెరికాకు చెందిన డేవిడ్ డబ్ల్యూసీ మెక్‌మిలన్‌లకు కెమిస్ట్రీ నోబెల్ ఇస్తున్నట్లు అకాడమీ ప్రకటించింది. అణువులను నిర్మించడానికి అసిమెట్రిక్ ఆర్గానోకాటలిసిస్ అనే కొత్త మార్గాన్ని అభివృద్ధి చేసినందుకుగాను ఈ ప్రతిష్టాత్మక అవార్డు లిస్ట్, మెక్‌మిలన్‌లకు దక్కింది. లిస్ట్, మెక్‌మిలన్‌ల ఆవిష్కరణ ఫార్మాసూటికల్ పరిశోధనలపై గొప్ప ప్రభావం చూపిందని అకాడమీ చెప్పింది. విజేతలకు 11 లక్షల డాలర్ల ప్రైజ్‌మనీని సమానంగా పంచుతారు.

బెంజమిన్ లిస్ట్ 1968లో జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో జన్మించారు. 1997లో గోతె యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రస్తుతం మ్యాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్‌కు డైరెక్టర్‌గా ఉన్నారు. ఇక మెక్‌మిలన్ 1968లో యూకేలోని బెల్‌షిల్‌లో జన్మించారు. 1996లో యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా నుంచి పీహెచ్‌డీ చేశారు. ప్రస్తుతం ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా ఉన్నారు. విజేతలను బుధవారం రాయల్ స్వీడిష్ అకాడమీ సెక్రటరీ జనరల్ గొరాన్ హాన్సన్ ప్రకటించారు. ఇప్పటికే సోమ, మంగళవారాల్లో మెడిసిన్, ఫిజిక్స్‌లలో నోబెల్ బహుమతులు ప్రకటించిన విషయం తెలిసిందే.

కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసిన అజయ్ మిశ్రా

న్యూఢిల్లీ, అక్టోబర్ 6: కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఆ శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా బుధవారం కలిశారు. ఉత్తర ప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీలో ఆయన కుమారుడు ప్రయాణించిన కారు రైతులపై దూసుకెళ్లినట్లు రైతు సంఘాలు ఆరోపించాయి. కేంద్ర మంత్రి అజయ్ మిశ్రాను ఆ పదవి నుంచి తొలగించాలని, ఆయన కుమారుడ్ని అరెస్ట్ చేయాలని రైతులు, ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా బుధవారం ఉదయం ఢిల్లీ నార్త్ బ్లాక్‌లోని కేంద్ర హోంశాఖ కార్యాలయానికి వెళ్లారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసి జరిగిన ఘటనపై వివరించారు. రైతులపైకి దూసుకెళ్లి ఇద్దరి మరణానికి కారణమైన వాహనంలో తన కుమారుడు లేడని ఇప్పటికే పలు మార్లు ఆయన తెలిపారు. ఇదే విషయాన్ని అమిత్ షాకు ఆయన చెప్పినట్లు తెలుస్తున్నది.

తన రాజీనామా కోసం ఎలాంటి ఒత్తిడి లేదని అజయ్ మిశ్రా మీడియాతో మంగళవారం అన్నారు. నేనెందుకు రాజీనామా చేయాలి? అని ఆయన ప్రశ్నించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా, ఆదివారం లఖింపూర్ ఖేరీలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న అజయ్ మిశ్రా కాన్వాయ్‌లోని వాహనం రైతులపై దూసుకెళ్లిన ఘటనతోపాటు అనంతరం జరిగిన అల్లర్లలో 8 మంది మరణించారు. మృతుల్లో నలుగురు రైతులున్నారు. ఈ ఘటన నేపథ్యంలో లఖింపూర్ ఖేరీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

బతుకమ్మ సంబురాలను ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్ , అక్టోబర్ 6: తెలంగాణ ఆడబిడ్డలు ఎంతో వైభవంగా జరుపుకునే పూల పండుగ బతుకమ్మ. ఈ పూల పండుగను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ రవీంద్ర భారతిలో రాష్ట్ర ప్రభుత్వం ? భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బతుకమ్మ పండుగ సంబురాలను ఘనంగా ప్రారంభించారు. రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ పండుగలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ మనోహర్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, కళాకారులు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

మానవత్వం!

దయాగుణం–దానగుణం
మానవతా మహిత గుణం
నిండుగున్న హృదయాలు,
నిజదైవం నిలయాలు!

ఒడలు గగుర్పొడిచేలా
జడలు విప్పి జగమంతా
'కరోనా' కరాళ నృత్య–
మాడుతోంది విలయంగా!...
ఆపన్నుల ఆదుకొనుము
కారుణ్యపు నిలయంగా!

ఎంతగ సంపాదించిన
చింతాకుయు వెంటరాదు!
దిక్కులేక పడివుంటే
బుక్కెడు బువ్వసుపెట్టే
భూతదయను కలిగుంటే
భువిలో దైవం నువ్వే!

– డా॥వడ్డేపల్లి కృష్ణ
సెల్: 9246541699

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 7-10-2021

నేటికవిత-కవిత్వ విశ్లేషణ

-శ్రీదాస్యం లక్ష్మయ్య
అడ్మిన్, నేటికవిత
9440155240

నేటికవితలో ఈ వారం: **'అప్పుడప్పుడు'**
అనే అంశంపై వచ్చిన కవితల్లోంచి ఓ మూడు ఎంపికచేసిన కవితలపై విశ్లేషణ

-దాస్యం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544

పునరావలోకనం

సరదాలకోసం కాదు కానీ
సాటిమనిషి సహకారం కోసం
వినియోగించే సమయమేపాటిదో?
ఆప్యాయతానురాగాల ఒరవడి కోసం
పదునుపెట్టే క్రమంలో..
ఉచిత సలహాలు యోగక్షేమాలూ
ప్రేమాప్యాయతలు
రంగరించిన పలకరింపులూ
సుదీర్ఘకాలంగా వాయిదా వేయబడిన
పనులపై ధ్యాసలూ..
ఊకదంపుడు ఉపన్యాసాల పర్యాపసానాలూ..
నోటి దురుసుతో ఏర్పడిన
అంతరాలు ఆంతర్యాలు అగాథాలూ
యువతలో స్ఫూర్తి నింపే భాషణాలూ
వృద్ధులపై కురిపించే కరుణాకటాక్షాలూ
పర్యావరణంపై మమకారాలూ
భూతదయపై వివేచనలూ,
సత్కార్యాల సత్పాపక్షేపాలూ
సమకాలీన పరిస్థితులపై సదావగాహనలూ
స్వీయ మూల్యాంకనాలు ఆత్మావలోకనంపై
అప్పుడప్పుడు దృష్టిని కేంద్రీకరించాలి
సమయం దొరికినప్పుడల్లా పున: సమీక్షించుకోవాలి
ఉత్తమ జీవన సోపానాలేవో
పునరావలోకనం చేసుకోవాలి
అదే ఉత్తమ జీవన విజయపథ మార్గం
పరమోన్నత జీవన సౌరభం

-పరాంకుశం రఘునారాయణ
9949749987

మహబూబాబాద్‌కు చెందిన కవి పరాంకుశం రఘునారాయణ గారు అప్పుడప్పుడు అంశంపై పునరావలోకనం శీర్షికతో రాసిన కవితలో ఉత్తమ జీవన సోపానాలేవో అప్పుడప్పుడు పునరావలోకనం చేసుకోవాలని హితవుపలికారు. సమకాలీన పరిస్థితులపై అవగాహన పెంపొందించుకుని స్వీయ మూల్యాంకనం చేసుకోవాలని సూచించారు.

ఉత్తమ జీవన పథాన్ని అన్వేషిస్తూ.. ముందుకు సాగినప్పుడే వర్తమాన కాల పరిస్థితులను తట్టుకునేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. ఒకే మూసలో జీవనం కొనసాగించకుండా అప్పుడప్పుడు మనలో మనం మన వ్యవహారశైలిని నడకను నడతను సమీక్షించుకోవాలన్న అర్థం ధ్వనించేలా కవి రఘునారాయణ గారు తమ కవితను కొనసాగించారు.

సరదాలకోసం కాదు గానీ సాటిమనిషి సహకారం కోసం వినియోగించే సమయమేపాటిదో అని ప్రశ్నించుకోవాలనీ.. ఆప్యాయతానురాగాల ఒరవడి కోసం పదునుపెట్టే క్రమంలో లోటుపాట్లను సమీక్షించుకోవాలని.. అవసరమైన మార్పులు చేసుకుంటూ జీవనం సాగించాలని సూచించారు.

అప్పుడప్పుడు మన వ్యవహారం వల్ల ఒనగూరుతున్న ఫలితాలను బేరీజు వేసుకోవాలని కోరారు. తోటివారి యోగక్షేమాలు కనుక్కోవడం.. ప్రేమాప్యాయతలను ప్రదర్శించడం.. కుశల పలకరింపులు వంటి సదలవాట్లను అలవరచుకోవాలని హితవు పలికారు. సుదీర్ఘకాలంగా వాయిదా పడుతున్న పనులపై అప్పుడప్పుడు దృష్టిసారించాలని కోరారు. నోటి దురుసుతనం.. ఊకదంపుడు ఉపన్యాసాల పర్యవసానంతో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసుకోవాలని హితవుపలికారు.

యువతలో స్ఫూర్తినింపే ప్రయత్నం చేయాలనీ.. వృద్ధులను ఆదరించాలని... పర్యావరణంపై మమకారం పెంచుకోవాలని పేర్కొన్నారు. సత్కార్యాలపై దృష్టిసారించి స్వీయ మూల్యాంకనంతో ముందుకుసాగి జీవితాన్ని ఆనందమయంగా మలచుకోవాలని హితవుపలికారు.

వీరి కవిత్వంలో కవిత్వాంశ పెద్దగా లేకపోయినప్పటికీ.. వచనం దామినేట్ చేసినప్పటికీ.. వీరి యొక్క ఉత్తమ ఆలోచనలను స్వాగతించి తీరుతాం. అధ్యయనం ద్వారా కవి రఘునారాయణ గారు తమ కలానికి మరింత పదును పెట్టుకోవాలని కోరుకుందాం. కవిత్వ ప్రమాణాలు మరింత సమర్థంగా పాటిస్తూ కవిత్వం పండిస్తారని ఆశిద్దాం.

పిట్ట జాడేది

దేహపు వీధిలో ఉంది చిరుసందొకటి
ఎప్పుడూ చిద్విలాసపు చివుర్లేసి
హృదయ తరువు అక్కడిదే..
అప్పుడప్పుడు ఓ జ్ఞాపకాల
పిట్టవాలి విడిది చేస్తుంది
మోయలేని గతపు శల్యములను తెచ్చి
తరువు బరువు పెంచుతూనే
ఎప్పుడో ఎండగట్టిన
ఆహ్లాదపు పుల్లలను ఏరుకొస్తుంది
మర్మాలను తనలో నింపుకుంటూ
కాలంతో మమేకమై
వలస వస్తూ వలపును తెచ్చేది
గ్రహాంతరాలను చుట్టి
ఆగ్రహానికి ఆహార్యం పట్టేది.
ఇప్పుడా పిట్ట జాడేది?
బహుశా ఆశ్రయమిచ్చిన చెట్టు
తటాలున నేలకొరిగిందేమో...!

-స్వాతికృష్ణ సన్నిధి
9177828877

విశాఖ జిల్లా భీమబోయిన పాలెంకు చెందిన కవయిత్రి స్వాతికృష్ణ సన్నిధి గారు అప్పుడప్పుడు అంశంపై పిట్టజాడేది శీర్షికతో తమ భావాలను అక్షరాలలో నిక్షిప్తం చేశారు. ఆద్యంతం ఆలోచనాత్మకంగా పలిచిన ఈ కవితలో మనకబారుతున్న బంధాలు..అనుబంధాలను గురించి ఆవేదనను ప్రకటించారు.

నర్మగర్భంగా రాయబడిన ఈ కవితలో దేహపువీధిలో ఉంది చిరుసందొకటి. ఎప్పుడూ చిద్విలాసపు చివుర్లేసే హృదయతరువు అక్కడిదే.. అంటూ కవితను ఎత్తుకున్న తీరు బాగుంది. హృదయతరువు పద ప్రయోగం చేసి.. హృదయాంతరాల్లో వృద్ధులు పడుతున్న వ్యథలకు అద్దం పట్టారు. జీవనసంధ్యలో తమను ఆదరిస్తారనుకున్న తమ పిల్లలు ఉపాధి వేటలో రెక్కలొచ్చిన పక్షుల వోలె దేశం కాని దేశాలకు ఎగిరిపోయినట్లు అర్థం ధ్వనించేలా రాసి మెప్పించారు.

అప్పుడప్పుడు ఓ జ్ఞాపకాల పిట్టవాలి విడిది చేస్తుందని ప్రకటించడంలో కవయిత్రి యొక్క ప్రతిభను ప్రశంసించి తీరుతాం. నిజమే కదా పిల్లలు అప్పుడప్పుడు చుట్టపుచూపువోలె వచ్చి వెళ్లడాన్ని నర్మగర్భంగా తెలియజెప్పారు. మోయలేని గతపు శల్యములను తెచ్చి తరువు బరువు పెంచుతూనే ఎప్పుడో ఎండగట్టిన ఆహ్లాదపు పుల్లలను ఏరుకొస్తుందని వ్యాఖ్యానించారు.

మర్మాలను తనలో నింపుకుంటూ కాలంతో మమేకమై వలసవస్తూ వలపును తెచ్చేది.. గ్రహాంతరాలను చుట్టి అగ్రారానికి ఆహార్యం పట్టేది అని కొనసాగించిన పంక్తులు కవితకు పుష్టినిచ్చాయి. ఇప్పుడు పిట్టజాడేది! బహుశా ఆశ్రయమిచ్చిన చెట్టు తటాలను నేలకొరిగిందేమోనన్న సందేహాన్ని వ్యక్తపరిచారు.

పిట్టను తమ సంతానంగా పరిగణిస్తూ.. చదువుసంధ్యలు పూర్తయ్యాక ఉపాధి కోసం కన్న వారిని వదిలి వెళ్లిపోయాక.. కాటికి కాళ్లుజాపి వున్న పండుటాకుల మనోవేదనను చాలా కవితాత్మకంగా ప్రకటించడంలో కవయిత్రి స్వాతి కృష్ణ సన్నిధి గారు సఫలీకృతులైనారు. పిట్టజాడేది అంటూ ప్రశ్నిస్తూ పైకి రాసినప్పటికీ.. కనుమరుగవుతున్న పిట్టల గురించి ప్రస్తావించినప్పటికీ.. మానవ అనుబంధాలను అన్వయిస్తూ విశ్లేషించుకోవడానికి అవకాశం కల్పించిన కవయిత్రికి అభినందనలు తెలియజేద్దాం.

ఆటవిడుపు

అలసి సొలసిన మనసులకు
అప్పుడప్పుడు కావాలి ఆటవిడుపు
జీవితమనే పరుగుపందెములో
అలసట తీర్చుకొనుటకు
మనలోని కళకు..
సృజనాత్మకతను జోడించి
పదుగురికి ఉపయోగపడేలా
అందించగలిగితే ఆటవిడుపుకదా...
మమతల పందిరిలో అనురాగాల తీగలనల్లుకుని
చేదు, తీపి లాంటి సుఖ దు:ఖాలను పంచుకుని
పాలపొంగు లాంటి నూతనోత్తేజములో
ముందుకు సాగితే కష్టాల కడలిని
అలవోకగా దాటమా...
కోరికల కొలనులో ఈదక
తృప్తి అనే కంచెతో అడ్డుకట్టవేసి
ఉన్నంతలో సర్దుబాటు చేసుకుంటూ
లాహిరి పాటల లాలిత్యంలో
సాగించాలి బతుకు పయనం.
అశాశ్వతమైన కాయముపై
మాయామోహమును వీడి
కాలంతోపాటు సాగి
సాధ్యమైన మేరకు ఆనందంగా
గడిపితేనే మోక్షపదము

-మద్దెల ప్రభాకర్
9491596878

జగిత్యాలకు చెందిన కవి మద్దెల ప్రభాకర్ గారు అప్పుడప్పుడు అంశంపై ఆటవిడుపు శీర్షికతో రాసిన కవితలో యాంత్రికమయమైన జీవనంలో అప్పుడప్పుడు ఆటవిడుపు అవసరమని తెలిపారు.

జీవితమనే పరుగుపందెంలో మనదైన ముద్రతో ముందుకు సాగాలని.. అలసిన సొలసిన మనసులకు అప్పుడప్పుడు సాంత్వన నిచ్చేందుకు.. మనలోని కళలకు పనిపెట్టాలని సూచించారు. మన సృజనాత్మక ప్రతిభను జోడించి పదిమందికి ఉపయోగపడేలా చూడాలని కోరారు. ఫలితంగా మనకు ఆటవిడుపుతో పాటు పదిమందిని అలరించిన వారమవుతామని పేర్కొన్నారు.

జీవితమన్నాక కష్టసుఖాలుంటాయి కనుక సుఖాలను అనుభవిస్తూ.. కష్టాల కడలిని దాటేందుకు మమతల పందిరిలో అనురాగాల తీగలనల్లుకుని చేదు తీపి లాంటి సుఖ దు:ఖాలను పంచుకుని నూతనోత్తేజంతో ముందుకు పయనించాలని హితవు పలికారు. స్వార్థం గొడుగునీడలో సద సేదదీరకుండా అప్పుడప్పుడు పదిమంది హితం కోసం పాటుపడాలన్న అర్థం ధ్వనించేలా కవి ప్రభాకర్ గారు తమ భావాలను ప్రకటించారు.

ఎప్పుడూ కోరికల కొలనులో ఈదక తృప్తి అనే కంచెతో అప్పుడప్పుడు అడ్డుకట్టవేయాలని సూచించారు. ఉన్నంతలో సర్దుబాటు చేసుకోవాలనీ.. లాహిరి పాటల లాలిత్యంతోనే బతుకు పయనాన్ని కొనసాగించాలని పేర్కొన్నారు. అశాశ్వతమైన కాయముపై మాయా మోహమును వీడి కాలంతో పాటు సాగి సాధ్యమైనంత మేరకు ప్రతీక్షణాన్ని సద్వినియోగపరచుకోవాలని కోరారు.

కవి ప్రభాకర్ గారి కవిత్వంలో కవిత్వాంశ లేకపోయినప్పటికీ .. చక్కని సందేశాలతో కూడిన తమ భావాలను అక్షరాల్లో ప్రకటించడాన్ని మెచ్చుకుంటాం. అభివ్యక్తి శిల్పం.. ఔచిత్య పదబంధ ప్రయోగం వంటి అంశాలను తెలుసుకుని మున్ముందు కనీస కవిత్వ ప్రమాణాలు పాటించాలని కోరుకుందాం. అధ్యయనంపై దృష్టిసారించి.. తమ కలానికి మరింత పదును పెట్టుకుంటారని విశ్వసిద్దాం.

ఘంటారవం

అంతర్వాణిని ఆలకించటమంటే
అంతర్యామిని అవలోకించటమే
నిన్ను నీవు తెలుసుకోవటమంటే
నిజ నేత్రం తెరచుకోవటమే
అందచందాల ఆధిక్యం
వార్ధక్యం వచ్చేవరకే
భోగభాగ్యాల వైభోగం
ఆరోగ్యం ఉండేవరకే

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

సైకత శిల

నేను మాలిగా పాలించిన
అక్షర పూదోటలో
రంగురంగుల్లో ఒరుసుకుపోయిన
భావాల అలజడులు
మది ఆకసంలో
మిలమిలా మెరిసిన తారకలు.

మనసు రేపిన
గుబులు మేఘాలు
ఉరుముల మెరుపుల ఫెళఫెళలతో
విరుచుకుపడినప్పుడు
ఇంకా రెక్కలు రాని పక్షిలా
గిలగిలాడిపోయేది.

ఇటుకపై ఇటుక పేర్చి
తీరైన గోడ కట్టడమెలాగో
పూడిక తీసి
ఒడ్డును తీర్చిదిద్దడమెట్లానో
గొంతులో పడ్డ అన్నం ముద్దను
మింగడం రాక
బయటకు తీయడం రాక
తల్లడమల్లడమైన రోజులు ఇంకా గుర్తే.

నేను
కవిత్వమయ్యే దాకా తెలియదు
ఎగసిపడే కెరటాల కదలికి
దరి కట్టొద్దని
గుండె గది కిటికీ రెక్కలు
ఎప్పుడూ తెరిచే ఉంచాలని
పంచేంద్రియాలు సిద్ధంగా ఉన్నప్పుడే
జ్ఞాన ప్రకాశికలు ఒడిసిపట్టగలమని.

ఇప్పుడు
నిద్దురంటని కళ్ళను
మిణుగురులు చేసి
చిక్కటి నిశీధులు నిండిన
కవితా వీధుల్లో తారట్లాడుతుంటాను.

మంచి కాగడాను తయారు చేసేందుకు
నాతో నాకే
విరామమెరుగని పోరాటమని
సైకత శిలనై రాలిపడేదాకా
నాకే తెలియదు
కావ్య సంద్రంలో నేనూ నాయికనేనని.

-నస్రీన్ ఖాన్
మొబైల్: 9652432981

వడ్నాల వెంకటేశ్- మనసు కవితల సంపుటి

సిరిసిల్ల సాహితీ సమితి ప్రచురించిన 'నా.. మనసు కవితలు' యువకవి, చేనేత కార్మికకవి వడ్నాల వెంకటేశ్, రచించిన 52 కవితలు పొందుపరచబడిన కవితా సంపుటిగా కవి హృదయాన్ని ఆవిష్కరిస్తోంది. 'నేతన్న' కవితలో రాత్రింబగళ్లు కష్టపడినా కడుపు నిండని చేనేత కార్మికుని కుటుంబ జీవన వేదనను కళ్ళకు కట్టించారు. చేనేత కళాకారులకు పెట్టిన పేరు అయిన నేత కార్మికుల ఖిల్లా సిరిసిల్ల నేతన్న కలలు ఫలించాలని, వడ్నాల వెంకటేశ్ సామాజిక ప్రయోజ ఆకాంక్షతో కవితాక్షరాలను పదును పెట్టారు. సిరిసిల్ల సాహితీ సమితి సమాజహితం కోసం శ్రమిస్తున్న శ్రామిక కవిగా వడ్నాల వెంకటేశ్‌ను ప్రోత్సహించటం అభినందనీయం. తొలి కవిత 'అందం' నుంచి ఆఖరి కవిత 'పెద్దనోటు' వరకు వైవిధ్యభరి తమైన ఇతివృత్తాల కవితలను వెంకటేష్ రచించారు. సృష్టిలో తియ్యనిది అమ్మ



అంటూ అమ్మను అనురాగంతో గుండెలకు హత్తుకొన్నారు. ప్రేమ కోసం ఆత్మహత్యలకు పాల్పడిన యువతను 'ఓటమి' కవితలో ప్రేమ పిశాచికి బలికావటం వల్ల స్పందించి, యువతను ఆశయం కొరకు జీవించి, ఓటమిని ఎదిరించమని హెచ్చరిస్తాడు. 'నులక మంచం దుప్పటి' కవితలో వండువెన్నెలలో ఆరుబయట నిద్రించటంతో, ఏసి గదిలో గోళీల నిద్రతో పోల్చటం వెంకటేశ్ కవి హృదయానికే చెల్లింది. 'వాస్తు' అనేది అందరినీ గందరగోళంలో ముంచే అవాస్తవ మోసం అని రాస్తూ, గాలిలో దీపం పెట్టి మ్రొక్కిట్టుగా వాస్తును నమ్మవద్దని కవి హెచ్చరిస్తాడు. 'కులం' కవితలో కులమతాల సంకుచిత భావాన్ని నిరసిస్తూ కవి వెంకటేశ్ అన్నదమ్ములా ఆప్యాయతలు, అనురాగాలు పెంచుకొని అందరూ కలిసి బ్రతకాలని ఆకాంక్షిస్తాడు. 'విద్యార్థి' కవితలో దేశసంపదను దోచేవారిని ధర్మ తేజమే తరిమేస్తుందని, సత్యమనే ఆభరణం ధరించమని హితవు వ్యక్తం చేస్తాడు. 'గుట్టలు మాయమయితే', ప్రకృతి నాశనమవుతుందని పర్యావరణాన్ని రక్షించుకోవాలని వడ్నాల వెంకటేశ్ నా... మనసు కవిగా కవితా సంపుటిలో హెచ్చరిస్తారు. సంపుటిలోని కవితలన్నీ సామాజిక ప్రయోజనాన్ని, సంక్షేమాన్ని ఆశిస్తున్నవే.

ప్రతులకు: వడ్నాల వెంకటేశ్
6-5-122, విద్యానగర్ కాలనీ, సిరిసిల్ల,
రాజన్న సిరిసిల్ల జిల్లా
సెల్: 960364 3034

-జయసూర్య
సెల్: 9440664610

పుస్తక సమీక్షలు

చిందం సునీత కవితా సుమాలు

నా కవితలు "ఆలోచనల భావాలతో ఉప్పొంగే కెరటాలు - మనసు లోతుల్లోంచి పెల్లుబికే ఉత్కంఠ భరితాలు- గుండె మంటల్లో రగిలే నిప్పు రవ్వలు" అంటూ చిందం సునీత 'కానరాని వసంతం' కవితా సంపుటి వెలువరించింది. దాస్యం లక్ష్మయ్య ఆధ్వర్యంలోని 'నేటి కవిత' వాట్సాప్ గ్రూపులో ప్రతిరోజూ కవితాపుష్పాలు పూయిస్తూ - ఆ సంపుటికి 'కానరాని వసంతం' అని పేరు పెట్టడం ఔచిత్యంగా లేదు. 'నేటి కవితా పుష్పాలు' అనడమే సమంజసం.

చిందం సునీత అనుబంధాలకు విలువనిస్తుంది. ఈ గ్రంథంలో - ఊపిరిలో ఊపిరై, సహధర్మచారిణై, సుఖదుఃఖాలలో తోడై, ధైర్యాన్ని అందించి, నా ఉన్నతికి మార్గదర్శివైన సహచరీ వందనం... నీ నవ్వుల ముత్యాల ముగ్గుతో నీలోకి స్వాగతించావు - నీ చూపుతో చల్లని వెన్నెలలు కురిపించావు - గుప్పెడంత గుండెలో ప్రేమదీపం వెలిగించావు అని భర్త అంటే, సత్యమై నిత్యమై పరిమళమై వెలుగునై తోడునై నీడనై ఉంటానని భార్య అంటుంది.

అమ్మ ఒడే అందమైన ప్రపంచం. ఆమె - దైవాన్ని మించిన బంధం. అత్తకోడళ్లు తల్లీకూతుళ్ళై అనురాగాలతో అల్లుకుపోతే వాళ్ళే కుటుంబాన్ని వెలిగించే దేవతలు అని రచయిత్రి భావన. అయితే కొందరు స్త్రీ పురుషులు ప్రేమ మోహం తేడాలు గమనించక ఊబిలో మునిగిపోతున్నారని ఆమె ఆవేదన. తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో వేసే వాళ్ళకు 'మీకూ ఓ రోజొస్తుంద'ని ఆమె హెచ్చరిక. ఇంట్లో ఎవరిమీద ఏరకంగా కక్ష సాధిం చాలో కవ్వింపుగా నేర్పిస్తున్నాయని, కుటుంబ వ్యవస్థను కూలదోయడానికి ఇవి పదునైన వజ్రాయుధాలని టీవీ సీరియళ్లపై సునీత విరుచుకుపడుతుంది.

ఇందులో సామాజికాంశాలకు కొదువలేదు. పూర్వం చెరువున్న స్థానంలో ఇప్పుడు భవనాలు లేస్తుంటే కవయిత్రికి 'కానరాని ఆత్మ కదిలిపోయినట్టైంది.' **"బండ కొట్టే చేతులకు / బొబ్బలు వచ్చాయి కాని / డబ్బులు దొరుకలే / కడుపు నిండా తిండి దొరకలే."** ఆకలిచావుల చితిమంటల నార్పే ఎర్ర సూరీడుదయిం చాలని కోరుకుంటుంది. పత్రిక "నిజాన్ని నిగ్గు తేల్చే నిప్పురవ్వ, సమాజాన్ని నిద్రలేపి ఉవ్వెత్తున ఎగసే అల." అటువంటి పత్రికే నేడు అపవిత్రమై, రాజకీయ బంధువుగా రాజిల్లు తున్నదని వాపోతుంది.



షాపింగ్ మాల్స్ జనాల్ని నిట్టనిలువునా మోసం చేస్తున్నాయని, మాయ సుడిగుండం లోకి నెట్టివేస్తున్నాయని తెలియజేస్తుంది. సమాజంలో జరుగుతున్న చెడు సంఘటన లకు స్పందిస్తూ **"మేక వన్నెపులులు అన్ని వైపులా / మాటేసి కూర్చుంటాయి / ఆదమ రిచావో / ఆనవాళ్లు లేకుండా చేస్తాయి"** అని అప్రమత్తంగా ఉండవలసిన అవసరాన్ని నొక్కి చెప్తుంది. అవినీతి రాక్షసులు ఎవరు తీసుకున్న గోతిలో వారే పడతారని, వ్యక్తిత్వమే ప్రధాన మని, నడుమంత్రపు సిరికి తలొగ్గవద్దని బోధిస్తు ంది. అద్భుతమైన జీవితగమనంలో / కష్టాలకు, కన్నీళ్లకు, నష్టాలకు, సమస్యలకు ఎదురీదలేక / ఆత్మను హత్యచేసి / పిరికితనంలో మునిగావో / జీవితాని కర్థం లేనేలేదు" అని ఉద్బోధిస్తుంది. మన స్వేచ్ఛ మరొకరి స్వేచ్ఛను హరించకూడదు. మానవత్వంతో వ్యవహరించాలి. అందుకే సునీత "స్వేచ్ఛా జెండాను చేతపట్టి మానవత్వం నిలుపుదాం" అంటుంది.

సమస్త జీవరాశులన్నీ, పచ్చని చెట్లన్నీ మట్టి పరిమళానికి ప్రణమిల్లుతాయని, హద్దుల్లేని ఆకాశం అనంతమైన భావాలకు అక్షరరూపాన్నిచ్చే సుందర దృశ్యమని, నవ్వు - మనసు మబ్బుల్లో దాగిన బాధను తగ్గిస్తుందని, ఆరోగ్యానికి ఔషధమని అమృతఫలమని, స్నేహ పొదరిల్లు కమ్మని బంధమై కలకాలం పదిమందికి నిలువ నీడ నియ్యాలని - ఇలా ఈ గ్రంథంలో పలు అంశాలున్నాయి.

పుస్తకం సునీత ఆత్మీయనేస్తం. సమస్యల సుడిగుండాలు చుట్టుముట్టినా... తోడుగా నేనున్నానని ఆమెను తీయగా పలకరిస్తుంది. "నా దేశమందిరం సమతా ప్రపంచానికి కీర్తి పతాక" అని సునీత గర్విస్తుంది. "వందే మాతర గీత నాదంతో... స్వాతంత్ర్య యోధుల శాంతి నిర్మాణ కలల సౌధం ఎల్లవేళలా వికసించాలని" కాంక్షిస్తుంది.

మనసు పూసిన పువ్వులా - పాపాయి నవ్వులా - పాల మీగడలా - పరుగెత్తే లేడిలా - ప్రవహించే నదిలా - ఉదయంలో కిరణంలా - స్వచ్ఛంగా ఉండాలి. మంచి మనసుకు మాట తీపి తోడైతే మానసిక ప్రశాంతత వెన్నంటే ఉంటుంది. మనిషి మనసు నిర్మలంగా సదాచార పరిమళాల్ని వ్యాపింపజేస్తే అనురాగపు పూదోటలు ప్రతి ఇంటా విరబూస్తాయి. ఇలా మంచిని పెంచే సూక్తులు సునీత కవిత్వంలో ఉంటాయి. 'నిజంగా నేను నిజాన్ని ప్రేమించాను' అని సునీత చెప్పడం గొప్ప విషయం. ఇన్ని విషయాలు చెప్పిన సునీత - అక్షర (ముద్రణ) దోషాలు లేకుండా చూసుకోవాల్సింది. వాక్యాలలో మరింత స్పష్టత పెరగాలి. కవిత్వంలో మరింత సాధనచేయాలి. చిందం సునీత కవిత్వం కళాకాంతులు చిందాలని అభిలషిస్తూ - శుభాకాంక్షలు.

ప్రతులకు : చిందం సునీత
సెల్ నెం. : 9701075502

- ఎ. గజేందర్‌రెడ్డి
సెల్: 9848894086

పొగడటం ఒక పూజ!.

సముద్రం అలల సంగీతంతో
ఆకాశాన్ని పొగడటం వల్లనే వానలు కురుస్తున్నాయి!

వాగులు వంకలు గలగలమనినవ్వుతూ
నదిని పొగడటం వల్లనే ....
పొలం తల్లి పచ్చని చీరకట్టుకుని మురిసిపోతుంది!

గుడిలో పూజారి విశ్వాన్ని శంఖంచేసి ఊదుతూ..
మంత్రపుష్పాలను
పెదవులకొమ్మపై నుండి
గర్భగుడిలో రాల్చడం వల్లనే
దేవుడు పొంగిపోయి
నీగుండెగూటిలో ఊపిరిదీపమైనాడు!
కళ్ళలో కాంతిమండలాన్ని వెలిగిస్తున్నాడు!
ఓంకారం కూడా ఒక పొగడ్తే
అందుకే వేదాలు ఉపనిషత్తులు పుట్టుకొచ్చాయి!
అల్లా ఏసు రాముళ్ళను పొగుడుతుంటేనే దేవిస్తారు!
రాజులను పొగిడి కవులునాడు అగ్రహారాలు పొందారు
ఏలికలను పొగిడి
నేడు పదవులు పొందుతున్నారు!

తరగతిగదుల్లో విద్యార్థులను పొగడండి!
వేయిపూలవిజ్ఞాన వనాలైపోతారు!
వేదికలపై పొగడ్తలసాం బ్రాణిధూపాలైపోండి!
ప్రేక్షకుల మనసులు కేరింతలపక్షులై ఆనందలోకాల్లో విహరిస్తాయి!
అంతెందుకు ఇంట్లో పెళ్ళాంపై
పొగడ్తలతలంబ్రాలు రోజూ చల్లండి!
ఆమె నూనెళ్ళ వలపుపంటైపోతుంది!
భర్తదెయ్యంలా నిన్ను పీడిస్తుంటే...
పొగడ్తలమంత్రదండాన్ని జడిపించండి!
మీ చుట్టూ బొంగరంలా తిరుగుతూ బానిసైపోయాడు!
పొగడటం వల్ల బంధాలు బలబడతాయి!
అందాలు ఆనందాలు మీసొంతమవుతాయి!
యోగులకు పొగడ్తల అవసరం లేకపోవచ్చు!
భోగులకుమాత్రం పొగడ్త ఒక ఆక్సిజన్ మాత్ర!
ఎప్పుడు ఎక్కడ వాలిపోతుందో తెలియని
కలలరంగుల గాలిపటం కదా జీవితం!
పొగిడితే పోయేదిలేదునీ అహంకారపుసర్పం చావడంతప్ప!
పొగడటం ఒక యోగంపొగిడించుకోవడం
ఒక భోగంపొగడక పోవడం పెద్ద రోగం!
పొగడటమంటే ప్రతివ్యక్తిలోదైవాన్ని దర్శించి...
ప్రేమను వ్యక్తం చేస్తూ చేసే ఒక పూజ!
అది మానసి వికాసస్వర్గానికి దర్వాజ!

-బిక్కికృష్ణ
సెల్:8374439053

భల్లం భాష్యం

అకవిత్వాన్ని అందలమెక్కిస్తున్న దెవరు..!?!

మంచి కవిత్వాన్ని మనసారా చదివినప్పుడు- ఒక కొత్త స్నేహితుడు దొరికినంత ఆనందం కలుగుతుంది. ఆ కవిత్వాన్ని మళ్ళీ మళ్ళీ చదివినప్పుడు- చిరకాల మిత్రుణ్ని హఠాత్తుగా కలిసి, బాల్య స్మృతులు పంచుకున్నప్పటి రెట్టింపు ఆనందం అణువణువూ వ్యాపించిన అనుభూతి కలుగుతుంది. గాలి, నీరు, నిప్పు, వెలుగు వెన్నెలవలె కవిత్వం కూడా అందరికీ అందుబాటులో ఉంటే అంతకు మించిన ఆనందం అవనిలో మరోటి ఉండదేమో..!

కవిత్వం సామాజిక వాస్తవికతను సుస్పష్టంగా ప్రతిఫలిస్తుంది. అంటే యథాతథంగా ప్రతిబింబిస్తుంది అని అర్థం కాదు. కవిత్వం ఖచ్చితంగా అద్దం చేసే పనిని చేయదు. అందుకు భిన్నంగా పని చేస్తుంది. కవులు సమాజంలో భాగస్వాములు కదా. సమిష్టి జీవితంలో వాళ్ళ అనుభవాలుంటాయి. వాళ్ళ వాళ్ళ జీవితాల్నిగానీ, వాళ్ళకు పరిచయమైన జీవితాల్ని గానీ, తమ కవిత్వానికి వస్తువులు స్వీకరించి కవులు అక్షరీకరిస్తుంటారు.

కవి స్వరంలో కొలువై లీలగా వినిపించే ఆర్తి, కవిత్వాన్ని ఒక మంద్రమైన సంగీతంలా మలచబడుతుంది. అప్పుడు ఆ కవిత్వంలో కెరటంలా తాకే భావాలు కనిపించవు. మెల మెల్లగా తాకి ఏవేవో స్మృతులలోకి పాఠక మహనీయుల్ని మోసుకొని పోతాయి. అలా ఆ స్మృతుల కాంతినే నింపుకుంటూ మంచి కవిత్వం ప్రయాణం సాగిస్తుంటుంది.

కవిత్వం- జీవితంలో ఒక భాగం కాదు. జీవితానికి సమాంతర సంజీవనం. నిజమైన కవిత్వం- మనిషి జీవించాలి. వ్యాపించాలి. వికసిస్తూ ఉండాలి. కాబట్టి కవిత్వం సామాజికయానం. కవి తాను అనుకొన్నది స్వేచ్ఛగా రాస్తాడు. రూప సారాల సంకెళ్లలో బంధీ కావడానికి మాత్రం ఇష్టపడడు. కవిత్వంలోని వివిధ దశల్లో కవులు రూపపరమైన సంకెళ్ళ నుండి విముక్తం కావడానికి విశేష ప్రయత్నం చేస్తుంటాడు.

> కవిత్వం- జీవితంలో ఒక భాగం కాదు. జీవితానికి సమాంతర సంజీవనం. నిజమైన కవిత్వం- మనిషి జీవించాలి. వ్యాపించాలి. వికసిస్తూ ఉండాలి.

కవిత్వానికి వస్తువెంత ముఖ్యమో, భావం కూడా అంతే ముఖ్యం. వీటికంటే ముఖ్యమైంది అభివ్యక్తి. ఎంత మంచి వస్తువైనా ఎంత మంచి భావమైనా సరిగా వ్యక్తం చేయలేకపోతే ఆ కవిత్వం సాదాసీదా కవిత్వమే అవుతుంది. అభివ్యక్తి శిల్పం అంటే కవితా గమనం వంటిది. ఇది పాఠకుణ్ని ఉత్తేజపరచి, పదాల వెంట పరుగులు తీయిస్తూ ప్రశంసా పాత్రుడిగా మారుస్తుంది. కవిత్వంలో ఏం చెప్పాం అన్నది ఎంత ముఖ్యమో ఎలా చెప్పాం అన్నది కూడా దానికంటే ముఖ్యమైంది. అందుకు కవిత్వంలో అభివ్యక్తి శిల్పం మించింది ఏదీ లేదు కదా.

మానవ హృదయ స్పందనల్ని కదిలించే కవిత్వం చాలా కాలం జీవిస్తుంది. వేల ఏళ్ళుగా మానవ స్వభావంలోని సార్వ జనీన స్పందనల్ని విలువల్ని, సంస్కృతిని ముఖ్యంగా అందులో పదిలంగా భావి తరాలకు అందించాల్సిన విలువల్ని కవిత్వీకరిస్తే- అది ఎన్నో తరాల జీవితాల్ని ప్రభావితం చేస్తుంది. అది ప్రఖ్యాతమవుతుంది.

కవిత్వం నామవాచకం కాదు. సత్య వ్యక్తక్రియాత్మకమయినది. అది జీవితంలోని అత్యున్నతమయిన విలువలలో గొప్ప సౌందరాత్మ మయినది. కొత్త కొత్త పద బంధాలతో సంయోజనమయ్యేదే గొప్ప కవిత్వం. కవిత్వం అర్థంలేని సన్నివేశాలకి కూడా అపుడపుడూ అర్థం కల్పిస్తుంది. కనిపించే సత్యాల వెనుక దాగి కనిపించని సత్యాలను పరస్పర వైరుధ్యాలలోని మైత్రిని, ఏకత్వంలోని అనేకత్వాన్ని అనేకత్వంలోని ఏకత్వాన్ని కవిత్వం సాక్ష

విశిష్ట వ్యక్తిత్వం

వెలవెలబోతున్న జీవితానికి వెలుతురై
భవిష్యత్తుకు పూలబాటలు వేస్తూ
మానవుని మహనీయుడుగా మార్చే
అద్భుతమైన సాధనమే వ్యక్తిత్వము..!

స్వకీయమైన స్వధర్మంతో
సమయపాలనను పాటిస్తూ
పథకాలు వేసుకుంటూ సాగుతూ
క్రమశిక్షణతో మెలగడమే వ్యక్తిత్వము..!

అందం లేకున్నా అందరినీ ఆకర్షిస్తూ
అందరినీ మెప్పించే వాక్చాతుర్యం ప్రదర్శిస్తూ
వినయవిధేయతలతో తృప్తిని కలిగించే
నడవడిక కలిగి ఉండడమే వ్యక్తిత్వము..!

మనసనే తెల్ల కాగితంపై
సరియైన ప్రవర్తననే అక్షరాలను లిఖించిన
సువాసన అనే పరిమళాలను
విశ్వమానవాళిపై వెదజల్లుతుంది వ్యక్తిత్వము..!

ఆభరణం లాంటి వ్యక్తిత్వంతో
మనసును గెలిస్తే జీవితం మెరుస్తుంది.!
ఇతరులు పొరపాట్లను సహనంతో అంగీకరిస్తే
సమాజం నీకు దాసోహమవుతుంది..!

తాను బాధపడక
ఇతరులను బాధించక ముందుకు సాగితే
విశిష్టమైన వ్యక్తిత్వం వృద్ధి చెంది
జీవితం శోభాయమానమవుతుంది..!

-పిల్లి.హాజరత్తయ్య
9848606573

సోపతి కట్టె !!

కట్టె జాగ్రత్త సుమా !!
పయిలం మెల్లగ నడు
పట్టుకున్న కట్టె జాగ్రత్త
పట్టు జాగ్రత్త

ఇపుడు మనిషి కన్నా
కట్టెనే కరెక్టుగా ఉండాలే సుమా
కట్టె విరిగితే మనిషి విరిగినట్లే

లేస్తే కట్టె తోడు
నడిస్తే కట్టె తోడు
కూచొంగ కట్టె తోడు

కొడుకో మనుమడో ఎవరో
పక్కన ఆసరా ఐనా
పట్టుకున్న కట్టె మాత్రం
జాగ్రత్తగా ఉండాలే సుమా !
కట్టె జారితే లొపలి బొక్కలకు
గ్యారంటీ లేదు !

తాడు జారి బొక్కెన బాయిల పడ్డట్టే
ఫలఫల కట్టెపుల్లల్లా విరుగుడే
అరే ! పెద్దాయనకు
గట్టి కంక కట్టె కొనియ్యండి

ఆయనకు బాకీ ఉన్న
నాల్గు మెతుకులు – చెంచెడు చారు
లోపలికి జారనీ !!
ముసలోల్లు తమకు తాము
అనుకుంటరు చస్తే అందరికీ
మహా మంచిగుంటదని --
అందరికీ బరువైనమని !
బతికిస్తున్నందుకు సహస్ర నామాలుగ దేవున్నీ
దయ్యం పట్టినట్లే తిడుతరు !

కట్టెకు ఆయువు నిండి
పొంగి పొర్లి పొయ్యిల పడేదాక
కట్టెతో పాటు ముసలి కట్టె
దోస్తానాగ ఉండాల్సిందే
కట్టెకు ప్రాణం లేకపోవచ్చు !

ముసలి ప్రాణానికి
ఇరుగు పొరుగు
ఉప్పస ఊరట
కట్టెనే సుమా !

వృద్ధుల సంభాషణలను
శ్రద్ధగా చెవి పెట్టి ఎవరు వింటారు
ఒక్క మొక్కవోని కట్టె తప్ప

గోడకు ఒరిగి ఉన్న కట్టె !

నులక మంచం పై నిద్ర కట్టె !
రెండూ కట్టెలే !!
ఎవరు కాదంటరు
ఒక్కతీగనే కనిపిస్తె
అది చెట్టు కట్టె
ఇది మనిషిగా కట్టె
కట్టెకు కట్టె సోపతి
ఫోటో ఇడువకుండా
కట్టెతోనే దిగుతనంటడు
కట్టె పట్టుకుంటే లేని రాజసం
గాంభీర్యం పెద్దాయనకు
ముసలాయనకు
పట్టుకున్న కట్టె
ప్రాణంగా ఉంచే
సంజీవినీ పుల్లతో
సమానం !

- కందాళై రాఘవాచార్య
8790593638

లోకం పోకడ..

మన తప్పులను కప్పి పుచ్చుకుంటానీ
ఎదుటి వారి తప్పులను వేలెత్తి చూపుతానీ
మన ప్రతిభ ను గొప్పగా చాటుతాం
ఎదుటి వారి ప్రతిభ కు వక్ర భాష్యం చెపుతాం
అసలు రంగు దాచుకొని
ఊసరవెల్లి లా రంగులు మర్చుకొంటూ
రంగుల ప్రపంచంలో వేషాలు మారుస్తున్నాం.
మన బలహీనతలను బట్ట బయలు కాకుండా
మసి పూసి మారేడు కాయ చేస్తాం.
పైన పటారం లోన లోటారం
జీవితం ఒక నాటక రంగం అన్నారో కవి
మన మనసుకు మనం తెలుసు కాని
ఎదుటివారి ముందు డంభాచారం చేస్తాం.
అసలు జీవితానికి ముసుగేసి
నకిలీ జీవితపు నాటకాన్ని నటిస్తున్నానీ
అవినీతి సొమ్ముతో ఆడంబరం
అన్నమెరుగని అయోమయ జీవితం
నిఖార్సైన మనిషి దర్పానికి దర్పణ మియ్యని సమాజం
మన మొకం బాగా లేక అద్దాన్ని పగల గొట్టినట్టుంది మన జీవితం
పైన మెరుగులు లోపల పురుగుల రంగుల రాట్నం మన జీవితం
మన మంతా మంచి తేనే పూసిన కత్తులనీ
ఇంకా చెప్పాలంటే ఐస్ కత్తులం
అంతా గురివింద ఆర్భాటాలే
అందుకే మానవ సంబంధాలన్నీ
ఆర్థిక సంభదాలే కదా.....

-దేశిని శ్రీధర్
9849818284

అమ్మ కోసం....

అమ్మ కోసం
నువ్వు ఆయుధంగా మారి
కొండలే డికొట్టరా
అది ఎంతా కష్టమైనా
ఆశయాల పీఠం
నువు అందుకున్నా నాడు
నిండుగా మురిసేనురా
మీ అమ్మ ఎక్కడున్నా
చేయూకే ఇస్తుంటే
ఓ స్నేహబృందం

చరితల్లే మారాలి
నువ్వెళ్ళు మార్గాం
నీ ప్రతిభే చూలంచే
ఆ రోజు కోసం
ప్రతి అడుగు కావాలి
నీ వెనుక సేన్యం
లేరా అడు గెయ్ రా
ఆ శిఖరం చేరా

-ధరవత్ అఖిల్ స్వేరో
7794934909

జీవిత సమాధానం నీవే...!

జీవితాన్ని వృధా చేయకు
అలా అని తప్పుడు నడకలు నడవకు
ఎన్ని పుణ్యాలు చేస్తే వచ్చిందో ఈ జన్మ
తిరిగి వస్తుందో లేదో పునర్జన్మ
ఈ సృష్టిలో ఏదో ఒక చోట
నీవే ఒక సమాధానమట
చీకటిలోనే ప్రతీ సవాలు ఉంటుంది
నీవే జవాబు నని చెబుతోంది
ఓటమియే నీ బలహీనం
తిరిగి ప్రయత్నించడమే నీ విజయం
నీలో ఉన్న సాహసానికి
పునాదివి నీవే..
భవంతివి నీవే..

-రాగటి మేఘన
99665 40988

వీధి బాలలు

విధి వెక్కిరించగా
వీధుల ఆహ్వానాన్ని అందుకున్నట్టి చేదునవ్వులు
మసిబారిన పువ్వులు
అమాయక వీధి బాలలు

బాధ్యతలను తల్లితండ్రులు వదులుకోగా
ఎండ కొమ్మకు పూచిన చిరుపువ్వులు
మోసానికి గురైన స్త్రీ ఆక్రన్దనకు పుట్టిన శాపగర్భస్థ శిశువులు

వారి నీడ తప్ప నిలువనీడ ఎరుగని కన్నీటి చారికలు
కడుపునింపేందుకు మాటలు తప్ప మెతుకులు దొరకని అణగారిన కెరటాలు
ఆ ఆకలి చూపుల్లో జారిన వేల అశ్రుధారలు ప్రళయాన్ని సృష్టించవా?
లోకాన్ని శపించవా?
ఉసూరుమనే వారి ఉసురు మంచితనాన్ని ఉరితీయదా?

వారే దొంగలుగా మారితే నిజాయితీ నీరసించదా
దేశద్రోహులుగా మారితే చట్టం చతికిలపడదా
విప్లవకారులైతే న్యాయం నడుం విరగదా

వీధి బాలలను విద్యార్థులుగా మార్చేందుకు సహకరిద్దాం
విధి విలాసాన్ని వారి చిరునవ్వులుగా మార్చుదాం
బాధ్యత తీసుకుని బంగారు భవితనిద్దాం
నేటి వీధిబాలలే రేపటి దివ్వెలని చాటుదాం!!

ఆ బాలలే చరిత్రను సృష్టించు కలాములు కావచ్చు
చరితను చిత్రించు కళాకారులు అవ్వొచ్చు
అధికారంతో కలెక్టర్లుగా ఎదగొచ్చు
నేలపాలైన చిరుజీవితాలకు స్ఫూర్తి సందేశమవ్వొచ్చు
ఎగసిపడే చైతన్యదీపాలయి కాంతినింపంచవచ్చు

అందుకే ఆదరించి అక్కునచేర్చుకుందాం!!
వారి అలుపుకు మంచి మలుపు చూపుదాం!!

-జూపూడి. సుధారాణి.
8341524905

గావై గీవై గాదు 'గవాయి'

తొలి పుస్తకం 'తొవ్వతో' మొదలై నేటికి రాస్తూనే వున్నాడు. సాహితీ పరిమళ గందాన్ని పూస్తూనే వున్నాడు. 118 పేజీలతో ముద్దుగా ముస్తాబై మురిపించే 46 కవితల గావై గీవై గాదు. గీవై శ్రీ అన్నవరం దేవేందర్ గారి కలం నుండి జాలు వారిన హవల్దార్య 'గవాయి'. నాకు నీవు గవాయి. నీకు నేను గవాయి. కాని అందరికి గవాయి శ్రీ అన్నవరం దేవేందర్ కవితల వై 'గవాయి'. అచ్చ తెలంగాణ పల్లెల్ని అట్టమీద అద్దవోలె గవాయిగా బొమ్మలేసి చూపాడు అన్నవరం శ్రీనివాస్.

'గవాయి' వైని చదువుతుంటే చిన్నప్పుడు నల్లాలంతో కంటె చేసుకున్న ఆది, బంగారు పురుగాట, వరినాట్లు, మోట రాటు నడిపిన తీరు అన్నీ ఆదికి వస్తవి. వూర్లో వున్నట్టినిపిస్తుంది. నాడు ఇంట్ల తిని బయట మలమూత్రాలు చేసేది. నేడు బయట ఆడీడ తిని ఇంట్ల చేసుడు. ఇదేం పద్దతి! అందుకే ఐన రోగాలు, కాని రోగాలు, అన్ని రోగాలు, ఇన్ని రోగాలు. నాటి పద్దతులే ఆరోగ్యానికి అసలు సిసలైన్ ఆనవాల్లు.

అద్దమై నిలిచి దీపమై వెలిగిన మొదటి గవాయి 'ఒక ప్రయాణం'. కవిత్వమే ఒక ప్రయాణం. ఒక ప్రయాణమైన ఎందరో ఆత్మీయుల్ని అనాథ ల్ని కలుసుకున్న తీరు ఆ ఆత్మీయత మానవత్వాన్ని చూపే మంచి కవిత. 'సిరిసిల్ల ఊరులో రంగురంగుల నూలు పోగులు ఆరేసిన ఇంద్ర దనుస్సులు'.

'మనిషొక కళ' మంచికవిత. కాని నేటి మనిషి ఒక కళా! కలా! కల్లా! అనే సందేహం కలుగుతుంది. 'ఇగం' కవిత లో ఏంజెప్పిండు ''మంగులంలో ఏగుకుంట ఎగురుతున్న మక్క ప్యాలాల పువ్వులు'' ఇది కవిత్వం. బీరిపోయి జూసుడు 'భీమారి'. దగ్గరోడు తెలియడు. దూరపోడు తెలియడు. పక్కోడు పైకప్పోడు ఎవరు తెలియదు. అదే సెల్ ఫోన్ అందరికి సెల్లు. నాడు బస్సులల్ల, ట్రేన్లల వోంగ ఎన్నో ఎతలు, కతలు చెప్కుకునుడు. పిల్లల సంబందాలు ఖాయం చేసుకునుడు కూడా జరిగేది. నేటిలెక్క ఏదుంది!

'కడియాలు' ప్రశ్నలో ప్రశ్నిస్తూ సమాదానాలిస్తూ..... 'నేను' అంటే నేనొక్కన్నే కాదు. చక్కగా చెప్పారు. 'ఓడిబియ్యం' నేటి తరం నేర్చుకోవలిసింది. 'పరినాట్లు' కవిత గతంను ఆదికి తెప్పిస్తుంది. సేద్యం చేసేవారు, వరినాట్లు వేసేవారు ఆకుపచ్చ సైనికులు. 'మంచి చెడు ముచ్చట్ల ప్రసార వేదికలు'.



'మంత్రసాని', 'ఇల్లు', 'కొత్తలోకం' (లాక్ డౌన్ లో) 'ఊరి దిక్కు', కవితలు బాగున్నవి. కాలం బహురూపుల్ది – ఎలా వచ్చావో ఎలా పోతావో! 'పసితనం– దూది పంజం' తన మనవన్ని చూసుకుంటా రాసినట్లుంది. 'రోడ్లు వడ్లు', 'విత్తనం చౌరస్తా',,,, ఎల్లకాలం అన్నం పెట్టినోల్లకు నవ్వుకుంటూనే సున్నంపెట్టుడు ఇదేం జాతీయత. 'తయారవుడు' తమాషాగ అనిపించినా, అందంగా తయారవ్వడం కళా హ్రుదయమేగా!

'వడపోత' అవసరమే. 'వాక్సిన్', 'సుకాసిపానం', 'అల్లిబిల్లి' అన్ని కవితల్లో తెలంగాణ మల్లె మనసు పల్లె పదాలు బాగున్నవి. "గవాయి" సంపుటి 27 జూన్ 2021 న డా. నలిమెల భాస్కర్ గారు ఆవిష్కరించారు. వీడియో ద్వారా ఆవిష్కరణ ఉత్సవం లో వెల్లింగ్టన్ నుండి పాలు పంచుకొని గవాయిగా మాట్లాడే అవకాశం కలగడం తెలంగాణ బిడ్డగా వేరేమి కావాలి!

కవిత్వాన్ని చదివే ప్రతి సాహితీ వేత్త 'గవాయి' ని దాచుకోవాల్సిందే! కానుకగా ఒక కాపీని తన సన్నిహితుడికి ఇవ్వాల్సిందే! ఇంతకన్నా గొప్ప కానుక ఇంకేమి వుంటుంది. ఇదేగా సాహితీ సోపతంటే!

ప్రతులకు: ఈదునూరి రాజేశ్వరం
ఫ్లాట్ నెం. 406,
మారితి హెవెన్స్
భగత్‌నగర్,
కరీంనగర్– 505 001
సెల్: 94407 63479



-డా పెరుక రాజు
7810032847

నివురుగప్పిన నిప్పు

అమ్మ ఓదార్చి చెప్పినప్పుడు,
నాన్న గట్టిగా కోప్పడినప్పుడు,
అన్న ఆర్తిగా అనునయించినప్పుడు,
అక్క చెమ్మగిల్లిన కళ్ళతో దగ్గరికి తీసుకొని వివరించినప్పుడు,
చెల్లెలు ఏడుస్తూ జతకలిసినప్పుడు,
జీవన అంతరార్థం తెలియలేదు.
కాలం కనికరం లేకుండా వెళ్ళిపోతున్నప్పుడు,
గతం గద్దలా తన్నుకుపోయినప్పుడు,
వర్తమానం వర్తులాకారంలో తిరుగుతున్నప్పుడు,
భవిష్యత్తు అగమ్యగోచరమైనప్పుడు,
జీవితపు అంతరార్థం ప్రశ్నార్థకంగానే కనిపించింది.

తాళితో ఆలి ఇంటిలోకి
ప్రవేశించినప్పుడు,
సుఖదుఃఖాల తాకిడి స్పష్టంగా
గుండె నిండినప్పుడు,
రక్తం పంచుకొని పుట్టిన పిల్లలు
పొదివి పట్టుకున్నప్పుడు,
పరిస్థితులు తెల్లముఖం వేసేటట్లు చేసినప్పుడు,
జీవితపు అంతరార్థం అర్థమై
కర్తవ్యం బోధపడింది.

-డా.రామక కృష్ణమూర్తి
99482 85353

అయ్యో ! ఓ రైతన్నా! ఎంతపని చేశావన్నా !

గట్టున గడ్డిమేసే ఆ
గాడిదకేమి తెలుసు
పొలం సేద్యంలో
ఎంత సంతోషం !
ఎంత సంబరం దాగివుందో !
బురదంటే ఎంత సరదో !
ఎంత సంతోషమో !
ఎంత సంబరమో !

విత్తనాలు చల్లడంలో
ఎంత వినోదమో !
పచ్చని పైరును చూస్తుంటే
ఎంత ఆనందమో పరమానందమో !
ఫలితందక్కీ పంట చేతికందితే
ఎంత ఆత్మతృప్తో !
ఎంతటి గర్వమో ఎంతటి గౌరవమో !

ఎంతటి శాంతి సౌభాగ్యమో ! కానీ
కరువు కాటువేసిందని
ఊరంతా అప్పులై ఊపిరాడడంలేదని
తీర్చేదారేలేదని బ్రతుకే ఒక నరకమని
కనిపించని మానసిక వేదనతో వ్యధతో
మదనపడి మదనపడి
నలిగిపోయి నలిగిపోయి
కృంగిపోయి కృంగిపోయి
కుమిలిపోయి కుమిలిపోయి
ఆత్మన్యూనతతో అర్థాంతరంగా
ఆత్మహత్య చేసుకున్న ఓ రైతన్నా !
నీవు స్వర్గానికెళ్లి ఉండొచ్చు
కానీ నీ భార్య బిడ్డలిక్కడ
నరకాన్ని అనుభవిస్తున్నారే... అయ్యో
ఓ రైతన్నా ఆవేశంలో ఎంతపని చేశావన్నా !
నీ భార్యాబిడ్డలకు ఎవరు దిక్కన్నా చెప్పన్నా!

నేడు "ఆరని వారి ఆకలికేకలే" చెబుతున్నాయి
అర్థాంతరంగా ఇలా ఏ రైతుగుండె ఆగిపోరాదని
ఆవేశంతో ఆత్మహత్యలకు పాల్పడి
గుండెల్ని చీల్చి కుటుంబాల్ని కూల్చి
ఆధారపడిన వారిని అనాథల్నిచేసి
ఏ రైతూ వెళ్లిపోరాదని
"ఆగని వారి కన్నీటిధారలే" అరిచి చెబుతున్నాయి
పోరాడి పోరాడి ఓడినా అది గెలుపేనని
"పొలందున్నే రైతు"కూడా
ఒక "పోరాడే యోధుడేనని"...

-పోలయ్య కవి
కూకట్లపల్లి
9110784502

గురువు

గురువు ఇప్పుడు ఎందుకో అందరికీ బరువయ్యాడు
తనని సరిగా అర్థం చేసుకునేవారులేక నిలువునా కన్నీరయ్యాడు
తన జ్ఞానాన్ని చమురుగా చేసి
ఎన్నో వేల దీపాలను నిరంతరం వెలిగిస్తున్నా
తన చుట్టూ అలుముకున్న అనుమానపు చీకట్లను
చెదరగొట్టలేక నీరసంగా చతికిలపడిపోతున్నాడు
తన మాటలతో విద్యార్థుల ఆశలకు రెక్కలు తొడిగి
వినీలాకాశంలో ఎగిరేలా చేస్తున్నా
తను మాత్రం అపవాదుల బండరాళ్లను తలపై మోస్తూ
మానసికంగా పాతాళానికి కుంగిపోతున్నాడు
పిల్లల కోసం నల్లబల్లలా మారి
తెల్లటి అక్షరాలతో జ్ఞానకాంతులను ప్రసరిస్తూ ఉన్నా
నల్లదనాన్నే అంటగడుతున్న లోకాన్ని చూసి తెల్లబోతున్నాడు
అక్షరాలను సృష్టిస్తూ కరిగిపోయే చాక్ పీస్ లా
పిల్లల భవిష్యత్తును సృష్టిస్తూ
నిరంతరం కరిగిపోయే చాక్ పీస్ గురువు

రైళ్లన్నింటిని వాటి గమ్యాలకు చేరుస్తూ
తను మాత్రం ప్లాట్ ఫామ్ మీదే మిగిలిపోయే
స్టేషన్ మాస్టర్ గురువు
తరగతి గది నాలుగు గోడల మధ్య
గురువు నిర్మించిన సమాజమే
ఇప్పుడు బడి గేటు దాటాక గురువుని వేళాకోళం చేస్తోంది
ఆయన చూపుడు వేలితో ప్రపంచాన్ని చూసిన సమాజం
ఇప్పుడు ఆయననే వేలెత్తి ప్రశ్నిస్తోంది
అవతలి ఒడ్డుకు చేర్చిన పడవనే
కనికరం లేకుండా నిర్దాక్షిణ్యంగా కాల్చేస్తోంది
ప్రశ్నిస్తున్న ప్రతివారు ఒక గురువుకు శిష్యులే
గురువు నుండే జీతాన్ని,జీవితాన్ని అందుకున్న వ్యక్తులే
ఎవరు అవునన్నా కాదన్నా
సమాజమనే కాగితంపై గురువు సంతకం లేకపోతే
అది ఎప్పటికీ చెల్లుబాటుకాని
నోటులా మిగిలిపోతుంది
ఏ విలువా లేని కాగితంలా మిగిలిపోతుంది

- డి.క్రాంతి కుమార్
7396721108

పుస్తక సమీక్షలు

రజిత పథము - కావాలి రాచమార్గం

సాహితీ జగత్తులో పద్యానికి ఒక విశిష్ట స్థానమున్నదన్నది అందరికీ తెలిసిన విషయము.అందులో పద్యాలతో కూడిన శతకము విశ్వవ్యాప్తమైనది. శతకము వందల సంవత్సరములనుండి సాహిత్యంలో సుస్థిరస్థానాన్ని సంపాదించుకున్నది.భారతీయ భాషలలొ ఎందులో లేని ప్రక్రియ శతక ప్రక్రియ.సజీవ స్రవంతి వలె అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ వస్తున్నది శతక ప్రక్రియనే.కొన్ని వేల శతకములు నేడు మనకు అందుబాటులో ఉన్నవి.ప్రాచీన సాహిత్యంలో సంఖ్యా పరంగా చూస్తే శతకాలదే ప్రథమ స్థానం. శతకములలో నీతి శతకములు,వ్యంగ్య శతకములు,హాస్య శతకములు,భక్తి శతకములు తదితరములు ఎన్ని ఉన్నూ నీతి శతకములే మనుషులలో నైతికవిలువలు పెంపొందించుటలో ప్రధాన భూమికను పోషిస్తున్నాయి.అలాంటి నీతి శతకాలూ నేడు కవులనుండి కవయిత్రులనుండి ఆశించదగ్గ సంఖ్యలో వస్తున్నవి.నేటి వర్ధమాన రచయిత్రి చింతలతాడెం రజిత రచించిన శతకము కూడా అదే కోవకు చెందినది.

ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా కరీంనగర్ లో ఉదయసాహితి సంస్థ నిర్వహించిన మహిళా కవయిత్రుల సమ్మేళనంలో మొదటిసారి కవితాగానం చేశారు.ఆలా మొదలైన వారి రచనాశక్తి,తర్వాత తెలుగుదళం గ్రూపులో చేరి పద్య రచనలోని మెళకువలు నేర్చుకోవడంతో కొనసాగి నేడు శతకాన్ని మనముందుంచుతున్నారు. అందుకు వారికి అభినందనలు.

నాలుగు పాదాలతో నడచిన పద్యాలలో మూడవ పాదం ఒక మంచి సందేశాన్ని అందించేలా కూర్చారు కవయిత్రి రజితగారు.మానవీయ విలువలు మృగ్యమౌతున్న ఈ రోజులలో ఇలాంటి మంచి మాటలతో కూడిన సందేశాత్మక శతకం అవసరం ఎంతైనా ఉందన్నది సత్యము.

మానవసేవే మాధవ సేవ అన్న నానుడిని విశదపరుస్తూ
"ప్రతిమ పెట్టి కొలిచి పదివేల దండాలు
పెట్టుతున్న నరుడ గుట్టు వీడు
దైవ కొలుపు కన్న సేవ గుణము మిన్న" అంటారు.అందరినీ సమానంగా చూడాలంటూ ''ఎదుటి వారియందు హేళన వలదురా'' అని చక్కని సూచననందించారు.

సత్యమేవజయతే అనే మాటను బలపరుస్తూ
"జంకుతనము తోను బొంకబోకు యెపుడు
నిజము తెలిపి మనిషి నేస్తమవ్వు" మని హృద్యంగా తెలిపారు.
"తల్లి పంచే ప్రేమ తనువునిచ్చి మనకు
తండ్రి నీడ నిచ్చు తరువు వోలె
త్యాగ గుణము తెల్పు తలిదండ్రి దేవుళ్ళు" అంటూ జన్మనిచ్చిన తల్లిదండ్రులను తలచుకోవడం తల్లిదండ్రులపట్ల కవయిత్రి గల ప్రేమను తెలియపరుస్తుంది.జన్మనిచ్చిన తల్లిదండ్రులను వారి అవసానదశలో తల్లిలా చూసుకోవాలనే అంతరార్థము దాగి ఉంది.

వీరి పద్యాలలో ..



"బాట మంచిదైనా భగవంతుడే మెచ్చు"
మాతృభాష యొకటి మహనీయుడిగా నిల్పు"
"మగువలేని సృష్టి మిగుల్చు శూన్యమే"
"పగటి నిదుర వీడి పనులు చక్కగాజేయు"
"దాత కన్నగొప్ప ధాత్రియందు కలదా"
"బాధ మరచి సాగ భవితయంత వెలుగు"
కష్టమెంట వచ్చు స్పష్టమైన వెలుగు"
"సాయమిచ్చు గుణము సౌధమై వెలుగొందు"
"కులము కన్నా యిలన గుణమెంతో మిన్న" లాంటి మంచి మార్గాన్ని చూపు సందేశాత్మక వాక్యాలు కన్పిస్తాయి.

సంఘంలో నివసిస్తూ చెడు పనులు చేయకుండా బ్రతుకుమని బోధిస్తూ "మంచి మార్గమేరిగి మహీసందు నిలవరా"యని తేటపరచారు.ధనాశ చివరికి చేటును తెస్తుందని ఒక పద్యంలో,అధిక కోపము మంచిది కాదని మరొక పద్యంలో ...

రచయిత్రి రజిత రాసిన ప్రతి పద్యంలో ఒక నీతి,ఒక సూక్తి,ఓ మంచి మార్గాన్ని చూపు వాక్యము,దారి చూపు దీపములా ఉన్నాయి.చక్కని పద్యాలతో,నిక్కమైన విషయాలను నిక్కచ్చిగా మన ముందుంచిన కవయిత్రి రజిత మున్ముందు మరిన్ని చక్కని రచనలు చేయ గలదని ఆశిద్దాం.

ప్రతులకు : చింతలతాడెం రజిత
2-45,అచంపల్లి గ్రామం ,గంగాధర మండలం
కరీంనగర్ ,8187831667

-డా వైరాగ్యం ప్రభాకర్
9014559059

స్నేహమేరా జీవితం!!

త్యాగాన్ని అవసరమైతే శరీరాన్ని
కూడా తృణప్రాయంగా
అర్పించగల శక్తి మంత్రమే స్నేహం

వైషమ్యాలకు తావివ్వనిది
ఆధిపత్య పోరు లేనిది
అంతరం కొరనిది
విభేదాలు కలుగకుండా
సమన్వయంతో కోరుకునేది

ఆపదలో ఆదుకునేది
ప్రేమను కురిపించేది
హర్షాన్ని వర్షింపజేసేది
సంతృప్తిని కలిగించేది
అసంతృప్తిని తొలగించేది
స్వార్థాన్ని సమూలంగా నశింపజేసేది.

హద్దులను చెరిపివేసేది
అభివృద్ధిని చేకూర్చేది
సన్మార్గంలో పయనించే జేసేది
ఎల్లలు లేవని నిరూపించేది.

పరిమితులు లేనీ మధుర స్మృతి
స్నేహం ఒక మహా ప్రవాహం.
లోతుకు వెళుతున్న కొద్దీ
అనిర్వచనీయమైన
అనుభూతిని స్నేహం
చిరస్మరణీయమైన
మధుర జ్ఞాపకం స్నేహం.

అందుకే స్నేహమేరా జీవితం,
స్నేహమేరా శాశ్వతం,

-అనిత దావాత్
9394221927

ఎంతేదిగిన మూలాలు మరువకు

గొప్ప గొప్ప చదువులు చదివి.
ప్రభుత్వ కొలువును పోందినను.
కష్టంబు చేసి చదివించిన.
కన్నోల్లనెపుడు మరువ కుండెను..

ఎంత పైస్థాయికి ఎదిగినను..
నీ మూలాలను మరువబోకు..
ఈ స్థాయికి రావడానికి..
తోడందించినోళ్ళ విడువకు..

ఊరు కానీ ఊరికెళ్ళి..
ఉపవాసం ఉండద్దుకొనిరి..
నా అన్నవాల్లు లేనికాడ..
నరకయాతన పడద్దునుకొనిరి.

తానెంత కష్టపడుతున్న..
తనయుల బాధపెట్టకుండెను..
ఆప్పో,సప్పో చేసి వాళ్లకు..
అన్ని విధాలుగా పంపించెను..

ఉన్నతస్థాయిలుండాలని..
కన్నొల్లెప్పుడు కోరుకొనును..
ఉన్నతంగా ఎదిగినాక..
కష్టపెట్టకు తల్లిదండ్రులను..

-పసుల.శంకర్
9542181301

బతుకు పాట

ఆశల పిట్టోకటి నా భుజంపై వాలింది.
తిరిగి చూసేలోపు తన రెక్కల చప్పుడును
నా చెవిని చేర్చి అందనంత
ఎత్తుకు ఎగిరిపోయింది.

చిరునవ్వులా...సీతాకోకచిలుక
ఆనందం అనే అందమైన వర్ణాలతో
ఎగిరొచ్చి మోముపై వాలింది.
చేయితో తాకేలోపు చేజారిపోయింది.

పావురాల గుంపోకటి...శాంతి కపోతాలై
వానమబ్బుల్లాంటి...
స్నేహ బంధాలనుఅల్లుతుంది.
వానై కురిసేలోపు...బలమైన గాలి తాకుళ్లకు
బందాలన్ని కనుమరుగై పోయాయి

కోకిలమ్మ వినిస్తున్న కమ్మనైన రాగాలకంటే
కష్టాల కడలిలో చిక్కుకున్న బతుకు పాటలే
వినసొంపైన సరాగాలై వినిపిస్తున్నాయి.

ఒక్కో క్షణం ...
ఒక్కో బాధ నా గుమ్మం
ముందువాలిపోతుంది.
ఇల్లంతా పరుచుకొని
నాతో పాటే జీవిస్తున్నాయి.
అవి నా స్నేహితులు...
నా దగ్గరకే వస్తాయి.
వాటికి నేనంటే చాలా ఇష్టం...
ఎందుకంటే నేను పేదోన్ని కదా....

-అశోక్ గోనె
9441317361

బలిపీఠికలు

అగ్రరాజ్యాల ఆగర్భశత్రువులు
ఉగ్రరాగాల ఆపన్నహస్తాలు
పెద్ద దేశాల పెడధోరణులు
పేదమేషాలే బలిపీఠికలు!

పెచ్చరిల్లిన పెనువ్యసనాలు
విచ్చలవిడి వినిమయ విహంగాలు
పేదవారికి పెరటి మొక్కలు
పెద్దరికాలకు పొటుకు హుక్కాలు!

ఆదామగా తేడాల్లేవ్
పెద్దా చిన్నా చితుకుల్లేవ్
కులమూ మతమూ భేదాల్లేవ్
సమానత్వానికి సరిహద్దుల్లేనేలేవ్!

కొకైన్ కొనే యోగం
హెరాయిన్ వినియోగం
మార్ఫిన్ మాయాజాలం
దినదిన ప్రవర్ధమానం!

నేరక చేసిన కసరత్తు
నిండా ముంచేసే మత్తు

ఆధునిక యుగపు గమ్మత్తు
దేశభవిష్యత్తు చిత్తు చిత్తు!

మాదకద్రవ్యాల జమాబంది
అరికట్టేందుకు ఇబ్బంది
అతితక్కువ సిబ్బంది
దర్యాప్తు సంస్థల జుగల్ బంది!

ఇనుప కండరాలు
ఉక్కు సంకల్పాలు
ఉజ్వల భవిష్యత్తుకు
ఉడుకు నెత్తురులు!

రుజాగ్రస్త నిర్వీర్య వ్యవస్థ!
జరగాలి అత్యవసర శస్త్ర చికిత్స!!

-కరిపె రాజ్ కుమార్
8125144729

పర్యావరణ పరిరక్షణ

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు
కరువుల పీడ తొలగాలంటె
వరాల వర్షం కురువాలంటే
కాలుష్యం తొలగాలంటే
పచ్చని చెట్లను పెంచండి!

జీవజాతులు బతుకాలంటే
పసిడి పంటలు పండాలంటే
ఓజోన్ పొర నిలువాలంటే
పర్యావరణం నిలువాలంటే
పచ్చని చెట్లను పెంచండి!

ధరనిమాత మురువాలంటే
పాడిపశువు బతుకాలంటే
అవనికిఅందం తేవాలంటే
ఆరోగ్య లోకం రావాలంటే
పచ్చని చెట్లను పెంచండి!

మనిషులకు ఆహారం కావాలంటే
అడవి జంతువులు బతుకాలంటే
క్షామం తొలగి క్షేమంగా
ఉండాలంటే
చెరువులు కుంటలు నిండాలంటే
పచ్చని చెట్లను పెంచండి!

ప్రాణవాయువు దొరకాలంటే
భానుడి ప్రతాపం తగ్గాలంటే
మానవాళికి మంచి జరగాలంటే
భావితరాలకు భవిష్యత్తు
మిగలాలంటే
వ్యాధుల పీడలు తొలగాలంటే
పచ్చని చెట్లను పెంచండి!

-కోణం పర్శరాములు
9959524585

పూల విలాసం "బతుకమ్మ" అర్చనం



-శారద శృంగేరి
94902 61119

పూలతో అలరారే బతుకమ్మ

సప్తవర్ణశోభితంగా రకరకాల పువ్వులతో ప్రతినిత్యం భగవంతుడిని పూజించటం జరుగుతూ ఉంటుంది. అలాంటి పువ్వులనే దేవతగా ఆరాధించడం ఒక్క బతుకమ్మ పండుగలో కనిపించే గొప్ప విశేషం. అదొక పూల జాతర రంగుల హరివిల్లు, పాటల పల్లకీ, సప్త వర్ణాల తీరొక్క పూలతో అలంకారం. ఒక్కసారిగా పూల వనం నగరానికి వచ్చిన సంబురం. చప్పట్లే వాయిద్యాలై మహిళలంతా బతుకమ్మ చుట్టూ రౌండుగా తిరుగుతూ, లయబద్ధంగా నృత్యం చేస్తూ, పాటలు పాడుతుంటే ఆపాటల్లో అంతర్లీనంగా ఏదో ఒక కథ ఇమిడి ఉంటుంది. మనిషి పుట్టకముందే దేముడు ప్రకృతిని సృష్టించాడనీ, ఆ ప్రకృతి వల్లనే పీల్చేగాలి, త్రాగేనీరు, ఆహారం, ఆరోగ్యం... మానవుడికి సమకురాయి. అలాంటప్పుడు ప్రకృతి నుండి లభించే పూలకు మరింత ప్రత్యేకత ఇచ్చేందుకు "బతుకమ్మ పండుగ". బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే పండుగగా తెలంగాణ ప్రాంతమంతా బతుకమ్మ పండుగను జరుపుకుంటారు. ఈ తొమ్మిది రోజులూ, ఈ పాటలన్నీ అర్ధరాత్రి వరకూ వీధులలో మారు మ్రోగుతూనే ఉంటుంది.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో....
బంగారు బతుకమ్మ ఉయ్యాలో...
శ్రీలక్ష్మి నీ మహిమలు గౌరమ్మ...
చిత్రమై తోచునమ్మ గౌరమ్మ....
చిత్తూ చిత్తూల బొమ్మ శివుడీ ముద్దులగుమ్మ...
బంగారు బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోన...

అంటూ...

ఇలాంటి అనేక పాటలతో తెలంగాణ ప్రాంతమంతా సందడి సందడిగా అత్యంత రమణీయంగా కనిపిస్తుంది. బతుకమ్మ పండుగ తొమ్మిదిరోజులు వీధివీధిలో బతుకమ్మ సంబరాలు జరుపుకునేందుకు మహిళలందరూ సమాయత్తమవుతున్నారు. బతుకమ్మ పండుగ అంటే ఆడపడుచుల పండుగ అనీ, అది మహిళలకే పరిమితమని అందరూ భావిస్తారు. అయితే హుస్నాబాద్ మండలం, అక్కనపేట, తోటపల్లి, గాంధీనగర్ గ్రామాల్లో మహిళలతోపాటు పురుషులు కూడ బతుకమ్మ ఆట ఆడుతుంటారు. ఇది ఆయా గ్రామాలలో తాతల కాలంనుంచి వస్తున్న సంప్రదాయమని చెబుతారు. పుణ్యక్షేత్రంగా విలసిల్లుతున్న వేములవాడ పట్టణంలో ఏడురోజులు, కరీంనగర్ జిల్లాలోని మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, చందుర్తి మండలాలతో పాటు, అదిలాబాద్ జిల్లా ఖానాపూర్, నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, మొర్తాడ్ మండలాలలో ఇటువంటి సంప్రదాయం ఉంది. బతుకమ్మ నిమజ్జనోత్సవాన్ని తిలకించడానికి బంధువులతోపాటు ఇంటి ఆడపడుచులను సైతం పిలుచుకుంటారు. తెలంగాణరాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ''రాష్ట్రపండుగ''గా అధికారికంగా గుర్తించడంతో తెలంగాణ ఆడపడుచులకు ఆనాటినుండి అర్హులైన వారందరికీ బతుకమ్మ చీరలు ఇవ్వడం ఆనవాయితీగా, ఈఏడాది బతుకమ్మ చీరలు పంపిణీ మొదలైంది. ఈ పండుగ ఉత్సాహం ప్రపంచవ్యాప్తంగా కూడా బతుకమ్మ పండుగ సంబురాలను జరుపుకోవడం విశేషంగా పేర్కొనవచ్చు.

బతుకమ్మ పండుగ ప్రాశస్త్యం :

బతుకమ్మ పండుగ తెలంగాణా రాష్ట్రములోని ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. ఈ బతుకమ్మ (గౌరి) పండుగ లేదా సద్దుల పండుగ. దసరాకి రెండు రోజుల ముందు వస్తుంది. బతుకమ్మ పండుగ వెనుక అనేక కథలు ఉన్నప్పటికీ, వాటిలో ముఖ్యంగా పేర్కొనే కథ ఇది. ఒక బాలిక భూస్వాముల అకృత్యాలను భరించలేక ఆత్మహత్య చేసుకుందనీ, చిన్న వయస్సులో ఏ కోరికలు తీరక ముందు గతించిన ఆ బాలికను బతుకమ్మగా కీర్తిస్తూ, అప్పటినుంచి గౌరమ్మ గా పూజిస్తూ ఉండటాన స్త్రీలకు సంబంధించిన పండుగగా 'బతుకమ్మ' ప్రాచుర్యం పొందింది. 'బతుకమ్మ' వేడుక సందర్భంగా స్త్రీలందరూ తమకు, భర్తకు, పిల్లలకు ఎలాంటి ఆపద రాకూడదని గౌరమ్మని వేడుకుంటారు. అలాగే బతుకమ్మ పండుగకి సంబంధించి మరోకథ కూడా ప్రచారంలో ఉంది. దక్షిణ భారతదేశాన్ని పాలించిన చోళవంశ చక్రవర్తి ధర్మాంగదుడు, సంతానం కోసం పూజలు చేయగా ఆయన భార్య లక్ష్మీదేవి అనుగ్రహముతో ఒక కూతుర్ని కన్నది. ఆమెకు లక్ష్మి అనే పేరు పెట్టారు. పసిబిడ్డ అయిన లక్ష్మి అనేక గండములను ఎదుర్కొంది. అప్పుడు తల్లితండ్రులు ఆమెకి "బతుకమ్మ" అని పేరు పెట్టారు. శుచి శుభ్రతే "శ్రీ మహాలక్ష్మి" కి అసలు సిసలు పూజగా శ్రీమహాలక్ష్మిని ఆరాధించడం మొదలైనట్లుగాను, శ్రీమహాలక్ష్మిని 12 సత్ గుణములు ప్రసాదించమని కోరుతూ రూపం, శీలం, సత్యం, నిజాయితీ, ధర్మం, మాధుర్యం, బాహ్యాంతర శుద్ధి, సహనం, రతి, పాతివ్రత్యం స్త్రీకి మహా సంపదలు, ఈ పన్నెండు గుణాలు గల స్త్రీ లభించడం ద్వారా పురుషునికి మహా సంపద, అంతకు మించిన సంపద భూమిపై లేదంటారు పెద్దలు. పెండ్లి కాబోయే పురుషునికి నచ్చే విధముగా వరాలివ్వమని కోరుతుంటారనీ ప్రతీతి. బతుకమ్మ పండుగలో పెళ్లికాని యువతులు గౌరమ్మని మంచి భర్తను ప్రసాదించాలనీ పెళ్లి అయిన స్త్రీలు తమ పసుపుకుంకుమలు చల్లగా కాపాడమని, సంతానాన్ని ఇవ్వమని కోరుతూ తల్లి బతుకమ్మ, పిల్ల బతుకమ్మలను అలంకరించి తల్లి పక్కనే పిల్ల ఉంటేనే స్త్రీ మాతృ హృదయం విధితమవుతుందన్న ఆనవాయితీ. సంతానం వల్లనే స్త్రీ జీవితం సార్ధకం అవుతుందని భావిస్తారు. ఇలాంటి వాతావరణంలో తెలంగాణ ఆడపడుచులు "బతుకమ్మ" ప్రకృతి సౌందర్యాన్ని అద్భుతమయిన రంగురంగుల పువ్వులతో కీరిస్తూ బతుకమ్మ పండుగను వైభవంగా జరుపుకుంటారు.

బతుకమ్మ పండుగ సంబురాలు:

మానవుని జీవన గమనంలో శుభారంభానికి, విజయానికి, శౌర్యానికి పండుగలను ఉత్సాహభరిత వాతావరణంలో జరుపుకోవడం ఆనవాయితీ. అందులో హిందూ మతములో అనేకానేక సంస్కృతి, సంప్రదాయాల సమాహారంగా పండుగలకు భూమాత, ప్రకృతిమాత కూడా సహకరించే విధముగా ఉంటుంది. బతుకమ్మ పండుగ వచ్చిందంటే, తెలంగాణ ప్రాంతం అంతా పండుగ కోలాహలం కనిపిస్తూ ఉంటుంది. చిన్నా, పెద్దా, పండు ముసలి వారు సైతం హుడావిడి పడుతూ సందడి చేస్తూ కనపడుతుంటారు. ఆశ్వీయుజ మాసములో వచ్చే దసరా పండుగకూ ఎంత ప్రాధాన్యం ఉందో, బతుకమ్మ పండుగకు కూడా అంతే ప్రాధాన్యం ఉంది. వర్షాకాలం ముగుస్తూ, శీతాకాలం ప్రవేశిస్తున్న సమయంలో తెలంగాణలోని వాతావరణం మొత్తం పచ్చగా వుంటుంది. ప్రకృతి మాత ఆకుపచ్చ చీర కట్టుకున్నట్టుగా, చెరువులన్నీ తాజా నీటితో నిండి ఉంటాయి. అనేక రకాలైన పూలు, రకరకాల రంగుల్లో విరబూసి ఆకట్టుకుంటాయి. వీటిలో గునుగు, తంగేడి పూలు ప్రథమ స్థానంలో నిలుస్తాయి. అడవుల్లో, చేలల్లో ప్రకృతి నయనానందకరంగా ఉంటుంది. పొట్టకొచ్చిన వరి పొలాలు, మొక్కజొన్న పంట కూడా కోతకు సిద్ధమై ఉంటుంది. అలాగే సీతాఫలాలు కూడా విరగకాస్తాయి ప్రకృతి రమణీయతతోపాటు రైతులకు కూడా సంతృప్తికరంగా ఉండే వాతావరణం. ఈ ప్రాంతంలోని పండించని బంజరు మైదానాలలో అడవి పువ్వులు వివిధ శక్తివంతమైన రంగులలో వికసించే సమయం కూడా. వీటిలో చాలా సమృద్ధిగా గుణుక, తంగేడు, బంతి, చెమంతి, నంది-వర్ధనం పువ్వులన్ని కూడ పుష్పించి ప్రకృతికి కూడా శోభనిచ్చేవిధంగా ఉంటుంది. ఈ పండుగకు గ్రామాలలో తెలంగాణ జానపదస్త్రీలు ఆచార సంప్రదాయాలతో, ఆనందోత్సహాలతో వెల్లివిరిసే రంగురంగుల పువ్వులపండుగను ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. సౌభాగ్యప్రదాయినీ అయిన గౌరీదేవియే బతుకమ్మగా ఆరాధిస్తారు. ఎంతో సామజిక ప్రాధాన్యం, శాస్త్రీయ దృక్పథం ఇమిడి ఉన్నట్లుగా ప్రతీతి. దసరా ఆరంభం అయిన దేవినవరాత్రుల సమయంలో, తెలంగాణ అతివలు బతుకమ్మను ప్రకృతి నుండి లభించే అందమైన పూలతో, పసుపు, కుంకుమలతో తొమ్మిదిరోజులు నిష్ఠగా పూజిస్తారు. బతుకమ్మ అలంకరణకు మొదటగా ఇత్తడి పళ్లెంలో గుమ్మడి ఆకులను పరిచి తంగేడు పూలను పేరుస్తారు. గునగు పువ్వును గుత్తులుగా అమర్చి పేరుస్తారు. మధ్యలో ఏర్పడిన ఖాళీ ప్రదేశంలో తంగేడు ఆకులు, మొగ్గలు నింపుతారు. దీన్ని పొట్ట నింపడం అంటారు. తర్వాత గన్నేరు, ఉద్రాక్ష, గోరింట, బీర కాకర, కట్లబంతి, చేమంతి వంటి రకరకాల పూలతో త్రికోణాకారంలో గుండ్రంగా అనేక వరుసలతో పేరుస్తారు. ఎత్తుగా పేర్చిన బతుకమ్మ శిఖర భాగాన పసుపు ముద్దతో చేసిన గౌరమ్మను పెట్టడంతో బతుకమ్మను అలంకరించే కార్యక్రమం ముగుస్తుంది. దీపాలతో అలంకరిస్తారు. ఇలా తయారుచేసిన బతుకమ్మను ఇంట్లోని పూజా గదిలో అమర్చి పూజిస్తారు. ఆ తర్వాత బతుకమ్మని బయటకి తీసుకువచ్చి ఆడపడుచులు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలతో గౌరిదేవిని కీర్తిస్తూ పాటలు పాడుతారు. ఆడపడుచులు కొత్త బట్టలు కట్టుకుని, వారికి ఉన్న అన్ని రకాల ఆభరణాలను ధరిస్తారు. పూలతో బతుకమ్మలను ఒకరిని మించి ఒకరు అలంకరించడంలోనే స్త్రీల కళాత్మకదృష్టి అర్థం అవుతుంది. పూలెక్కువ దొరికితే మనిషెత్తు బతుకమ్మను అలంకరించడానికి కూడా వెనుకాడరు. తల్లిపెద్దబతుకమ్మ అలంకరణ అయిన తరువాత చిన్న పళ్లెంలో చిన్నబతుకమ్మను తల్లిబతకమ్మ పక్కనే పెట్టడంలో స్త్రీ సంతాన ప్రదాయిని కనుక తల్లి ప్రక్కనే పిల్ల ఉండాలన్నది సాంప్రదాయం, తల్లిపిల్ల బతుకమ్మలను దేవుడి దగ్గర పెట్టి నువ్వులు, శనగపప్పు, పెసరపప్పు నైవేద్యంగా అర్పిస్తారు. బతుకమ్మ పండుగ కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ ఆడపడుచులు పండగకు వారంరోజుల ముందే పుట్టింటికి చేరుకుని ఆనందోత్సాహాలతో పండుగ సన్నాహాలు చేసుకుంటారు. ప్రతిరోజూ సాయంత్రం ఆ బతుకమ్మ చుట్టూ తిరుగుతూ, బతుకమ్మ పాటలు పాడతారు. బతుకమ్మ పండుగ చివరిరోజు జరిగే వేడుకలను, ఆ వైభవాన్ని చూడటానికి రెండు కళ్ళూ చాలవు. నయన మనోహరకరంగా ఉంటుంది. ఇలా చాలాసేపు ఆడాక మగవారు వాటిని చెరువులో నిమజ్జనం చేస్తారు. ఆపై ఆడవారు వాయినమమ్మా వాయినం అంటూ వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటారు. తరువాత ఇంటి నుండి తీసుకువచ్చిన పెరుగన్నం, మొక్కజొన్నలు లేదా వేరుశెనగ లేదా పెసర విత్తనాలను దోరగా వేయించి పిండి చేసి బెల్లం లేదా పంచదార కలిపిన సత్తుపిండి ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకుని ప్రసాదంలా స్వీకరిస్తారు.

తొమ్మిది రోజుల బతుకమ్మ నైవేద్యాలు :

9 రోజులపాటు ప్రతిరోజూ ఒక్కొక్క రకమైన నైవేద్యం సమర్పిస్తారు. మొదటి ఎనిమిది రోజులు ఈ నైవేద్యం తయారీలో యువకులు, యువతులు పాల్గొంటారు. చివరిరోజు సద్దుల బతుకమ్మ అంటారు. ఈరోజు మాత్రం నైవేద్యాన్ని మహిళలు తయారు చేస్తారు.

1.ఎంగిలి పూల బతుకమ్మ : మహాఅమవాస్యరోజు బతుకమ్మ మొదటిరోజు వేడుక మొదలవుతుంది. తెలంగాణలో దీన్ని పెత్రామస అని కూడా అంటారు. నువ్వులు, బియ్యంపిండి, నూకలు కలిపి నైవేద్యం తయారు చేస్తారు.

2.అటుకుల బతుకమ్మ : ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు చేస్తారు. సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు.

3.ముద్దపప్పు బతుకమ్మ : ముద్దపప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం తయారు చేసి సమర్పిస్తారు.

4.నానే బియ్యం బతుకమ్మ : నానేసిన బియ్యం, పాలు, బెల్లం కలిపి నైవేద్యం చేస్తారు.

5.అట్ల బతుకమ్మ : అట్లు లేదా దోశ నైవేద్యంగా సమర్పిస్తారు..

6.అలిగిన బతుకమ్మ : ఈరోజు ఆశ్వయుజ పంచమి. నైవేద్యమేమి సమర్పించరు.

7.వేపకాయల బతుకమ్మ : బియ్యంపిండిని బాగా వేయించి వేపపండ్లుగా తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు.

8.వెన్నముద్దల బతుకమ్మ : నువ్వులు, వెన్న లేదా నెయ్యి బెల్లం కలిపి నైవేద్యం తయారు చేస్తారు.

9.సద్దుల బతుకమ్మ : ఆశ్వయుజ అష్టమి నాడు ఆదేరోజు దుర్గాష్టమిని జరుపుకుంటారు. ఐదురకాల నైవేద్యాలు తయారు చేస్తారు. పెరుగన్నం, చింతపండుపులిహోర, నిమ్మకాయపులిహోర, కొబ్బరన్నం, నువ్వులన్నం.

బతుకమ్మ నిమజ్జనం చూడచక్కని దృశ్యం :

చీకటి పడుతుంది అనగా, స్త్రీలందరూ ఈ బతుకమ్మలను తలపై పెట్టుకుని ఊరిలో ఉన్న పెద్ద చెరువు గానీ, తటాకంవైపు గానీ ఊరేగింపుగా బయలుదేరుతారు. ఈ ఊరేగింపు అందంగా అలం కరించుకున్న స్త్రీలు, బతుకమ్మలతో అత్యంత సుందరంగా కనబడుతుంటారు. ఈ ఊరేగింపు కొనసాగినంత సేపూ, జానపద గీతాలతో వీధులు మారుమోగుతాయి. జలాశయం చేరుకున్న తరువాత, మెల్లగా బతుకమ్మలను పాటలు పాడుతూ, ఆడుతూ నీటిలో జారవిడుస్తారు. ఆ తరువాత "మలీద" (చక్కెర, రొట్టెతో చేసినది) అనే పిండి వంటకాన్ని బంధు మిత్రులకు పంచిపెడతారు. ఆ తర్వాత ఖాళీ పళ్లెం (తాంబళం)తో బతుకమ్మను కీర్తిస్తూ ఇంటికి చేరుతారు. గతఏడాది అన్ని పండుగలకు కరోనా (కోవిడ్19) ఆటంకం కలిగించి, ఇప్పుడు విరామం ఉన్నప్పటికీ, భౌతిక దూరం పాటిస్తూ, రాష్ట్రప్రభుత్వం సూచించిన జాగ్రత్తలు తీసుకుంటూ బతుకమ్మ పండుగ సంబురాలు, ఉత్సవాలు జరుపుకోవడం శ్రేయస్కరం.

శుభం భూయాత్! సర్వేజనాః సుఖినో భవంతు!

బతుకమ్మ దీవెన!

బతుకమ్మ పర్వోత్సవం
తెలంగాణ సాంస్కృతిక వైభవ
ప్రతీక ప్రాణ చిహ్నం! .

మహాలయ అమావాస్య తిథి
తొలి రోజు వేడుకకు నాంది!
'పెత్తరమాస' నామధేయం
సాంప్రదాయ వ్యవహార ప్రసిద్ధం!

వెడల్పైన పళ్లెంలో
గుమ్మడి, జిల్లేడాకులు పరిచి
తంగేడు పూలు,గునుగు పూలు
బంతి, చేమంతులను
తెల్లవార జామునే కోసుకొచ్చి
త్రికోణాకార రూపంలో అమర్చడంతో
బతుకమ్మ రూపం సాక్షాత్కరిస్తుంది!

తొలి రోజు -
ఎంగిలి పూల బతుకమ్మను
రంగురంగుల పూలతో
అలంకరించడం ప్రథమ ఘట్టం!

గౌరీదేవి ప్రతిరూపంగా
నట్టింట కొలువు తీరిన
బతుకమ్మ తల్లికి
నువ్వులు, బియ్యం పిండి, నూకలతో
నైవేద్యం నివేదించడం ఆచారం!

రెండురోజుల ముందు
కన్నె పిల్లలు - చెక్కపీటపై
పుట్ట మన్నుతో చతురస్రాకార దొంతరలు చేసి
త్రిభుజాకార పద్ధతిలో పేర్చి చేసే
బొడ్డెమ్మ పండుగ
ఆడ బిడ్డల రమణీయ పూజోత్సవం!

చోళరాజు ధర్మాంగధుని ఇంట
పుత్రికగా జన్మించిన బాలిక
ఆరోగ్య సమస్యలతో
మరణ శయ్యమీద ఉన్నపుడు
"బతుకు.. బతుకమ్మా...! " అంటూ
తల్లిదండ్రుల ఆర్తితప్త పిలుపుతో
మరణాన్ని జయించి బతికిందని
ఆ చారిత్రక ఘటన నుండి
బతుకమ్మ పండుగ
పురుడు పోసుకుందని
జన హృదయ కథా విశేషం!

ఈ తొమ్మిది రోజులు
మహిళామణులందరూ గుమిగూడి
సాంప్రదాయ వస్త్రాలంకరణ శోభతో
పల్లె పల్లెనా... వాడ వాడలో
సాయంత్రం వేళల్లో బతుకమ్మను ఆడడం
నేత్ర పర్వ అపురూప దృశ్య పర్వం!

చేతి గాజుల గలగలల
హృద్య శబ్ద విన్యాసాలతో
చప్పట్లు, చరుస్తూ...కుడి నుండి ఎడమ వైపుకు
వలయాకార భంగిమలో...
లయబద్ధంగా అడుగులు వేస్తూ
రాగ భావ యుక్తంగా...
ఉయ్యాల పాటలను ఆలపించడం
అంబరాన్ని తాకే ఆందోళ్సవ హేల!

పండుగ నవ దినాలు
ప్రతి ఇంట ముంగిట ప్రతిధ్వనించే
ఉయ్యాల పాటలు
వీనుల విందామృత
రస రమ్య గీతికా ఝురులే!

చివరి రోజు
'సద్దుల బతుకమ్మ'ను పూజించి
పైన పిండితో చేసిన ప్రమిదలలో
నూనె నింపి చేసే జ్యోతి ప్రజ్వలనం
కమనీయ కాంతుల దీపోత్సవ సమాహారం!

సకల శుభాలను కాంక్షిస్తూ
పవిత్ర చెరువు నీటిలో
సద్దుల బతుకమ్మను నిమజ్జనం చేయడం
అంతిమ వీడ్కోలు సంరంభ దృశ్యం!

బతుకమ్మపై పసుపు ముద్ద రూపంలో
కొలువు తీరిన గౌరీదేవిని
స్త్రీ మూర్తులందరూ వాయనాలుగా
పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడం
నిత్య సుమంగళి సౌభాగ్య వాంఛిత ఫల సంకేతం!

నిండైన బతుకును ప్రసాదించే
'బతుకమ్మ దేవత'
సకల శుభ విద్యా ప్రదాయిని!

-వంగర. పరమేశ్వరరావు
9491400534

పూల జాతర

పుడమి పువ్వుల పులకింతలు
ప్రకృతి ఒల్లంతా సప్తవర్ణ శోభలు
కొమ్మల సిగలో పుష్పాల నవ్వులు
బతుకమ్మ పర్వదిన సౌభాగ్య సిరులు !

బతుకునిచ్చే పూలతల్లి కల్పవల్లి
పూల సింగిడి పండగేగా బతుకమ్మ
అమ్మోరి దీవెనలకే అతివల ఆరాటాలు
నిత్య నైవేద్యాలతో తన్మయత్వ పూజలు !

పల్లెలన్నీ పరిమళ పూల వనాలు
ఆడబిడ్డల ఆటపాటల కోలాటాలు
పడతుల పసందైన బృంద నృత్యాలు
అడవి పూల బతుకమ్మ ఘన వేడుకలు !

తంగేడు, గునుగు, గుమ్మడి, బంతులు
తీరొక్క పూలతో పళ్ళెంలో పసుపు గౌరమ్మలు
ఎంగిలిపూల మె?దలు సద్దుల నవమి దాకా..
నవదిన వైవిధ్య భరిత నిత్య సందడులు !

తెలంగాణమంత పూలదేవత కాంతులు
ఊరు వాడ పట్టుచీరల ప్రదర్శనలు
శక్తిస్వరూపిణినే బతుకమ్మైన వైనాలు..
ఉయ్యాల, కోలాట పాటల కోలాహలాలు !

నిండిన చెరువులు, ఇంట్లో గాబులు
మగువల ముఖాల్లో పూసిన నవ్వులు
వీధి వీధిన పూలజాతర సంబురాలు
పుట్టింట ఆడపడుచుల పట్టు పరికిణీలు !

అటుకులు, ముద్దపప్పు, నానబియ్యాలు..
అట్లు, వేపకాయలు, వెన్నముద్దలు, సద్దులు
బతుకమ్మ తల్లికే వైవిధ్యభరిత నివేదనలు
చల్లగా దీవించమంటూ పవిత్ర నిమజ్జనాలు !

బతుకమ్మ తీర్చాలి బడుగుల వెతలు
ఇంటింట వెలవాలి అక్షయపాత్రలు
వైరస్ వైరిని ముట్టు పెట్టాలి దుర్గమ్మలు
ఆకలిని తరుమాలి గౌరమ్మ
ఆశీర్వాద బలాలు !

-మధుపాళీ
9949700037

క"న్నీటి"చెలిమె..!

బతుకమ్మ అంటే..
బతుకును నేర్పిన ఉద్యమం
దొరల పెత్తనాన్ని
దునిమాడిన జానపదం.

నీళ్లులేని తెలంగాణలో
క 'న్నీటి ' చెలిమె బతుకమ్మ
కాయ కష్టంలో
ఆత్మీయ చెలిమి బతుకమ్మ
పని పాటల జమిలి
బ్రతుకు పాటల బలిమి
చైతన్యపు కలిమి బతుకమ్మ.

బతుకమ్మ అంటే..
తనను తాను తవ్వి పోసుకున్న పాట
తనకు తానై ఉవ్విళ్ళూరిన పాట
ఒక తలపోత..ఒక వల పోత
విజయ గాథల పూల పోత
పరిపరి విధాల
పరివ్యాప్తమైన పల్లె పాట
బ్రతుకు పోరును పరిచిన
సామూహిక జీవన బాట

చిమ్మని చీకట్లలో
పూల వెలుగు బతుకమ్మ
కమ్మని ఆటల్లలో
స్వేచ్ఛా పులుగు బతుకమ్మ

ప్రకృతి పులకింతలతో
పురివిప్పుకునే
విజయగాథల ఆస్తీ
సంస్కృతికి తొలి కిస్తీ
ఆడపడుచుల దోస్తీ
ఉద్యమాల ఊపిరి
ఊయల పాటల ఝరి బతుకమ్మ

కోలాటాల సవ్వడిలో
సమైక్య సాధనా గీతిక
సమిష్టి భావనా పతాక
ప్రకృతి ఒడిలో పూదోట
వేల పాటల ఊట
ఆడపడుచుల సయ్యాట
కోటి గొంతుల బావుట బతుకమ్మ..!

- డా.కటుకోర్ఝుల రమేష్,
సెల్:9949083327

అమ్మా! బతుకమ్మా!!

అమ్మా!బతుకమ్మా
తెలంగాణ చరితకు ఘనకీర్తి నీవమ్మా
నీ రాకతో తెలంగాణ
తీరొక్క పూలవనమై శోభిల్లు నమమ్మా.

నీ రాక కోసం...
తెలంగాణ మట్టిన పుట్టిన పువ్వులు
నీ సన్నిధిలో తరించాలని తహతహలాడుతాయి
తెలంగాణలోని పూల తరువులు
తనువంతా పూలకళ్లతో ఎదురుచూస్తాయి.

పసిడి వన్నెల తంగేడుపూలు
వెండి జిలుగుల గునుగుపూలు
నీ కోసమే జనించాయి
నీ సేవలోనే తరిస్తాయి
అందుకేనేమో...
తంగేడు గునుగుపూలను
మా అమ్మలు అక్కలు చెల్లెల్లు
తల దాల్చరు
అవి బతుకమ్మ పూలంటు
కళ్ల కద్దుకొని మొక్కుతారు.

తంగేడు గునుగుపూల సంబరం చూసి
కట్లపూలు కమలాలు కలువపూలు
బంతిపూలు చామంతులు గడ్డిపూలు
గన్నేరు మందార గోరింట రుద్రాక్షలు
గుమ్మడి నీలికట్ల పోకబంతి పట్టుకుచ్చులు
తంగేడు గునుగుపూలతో చెలిమి చేస్తాయి
నీ చెంతకుచేరి ధన్యత పొందుతాయి.

అమ్మా!బతుకమ్మా
మా అమ్మలు నీ ప్రతిరూపాన్ని
తీరొక్కపూలతో రూపొందించి
తొమ్మిది రోజులు నిన్నుకొలిచి
ఆనందంతో ఆడుతారు
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
బంగారు గౌరమ్మ ఉయ్యాలో
అంటూ పాడుతారు
సద్దుల బతుకమ్మ రోజు
మా అమ్మలు అక్కలు చెల్లెలు
తీరొక్కపువ్వోలే తోచేరు
నీ రూపులాగే కనిపించేరు
మా అమ్మలందరూ...
పూలతో రూపుదాల్చిన నీ రూపాన్ని
తలదాల్చి కదులుతూవుంటే
పూలవాగే పారుతున్నట్టు వుంటది.

తొమ్మిదోరోజు చూడచక్కనిరూపు నీదమ్మా
ఆ రోజు నీవు పెద్ద బతుకమ్మా
ఆ రోజు నీవైభవం చూడ రెండుకళ్లు చాలవమ్మా
అంబరాన్ని అంటే సంబరాలు మావమ్మా
గంగమ్మ చెంతకు నీవు చేరితే
చెరువులు కుంటలు వాగులు వంకలు
నీ స్పర్శతో పరవశించేను
ప్రకృతికాంత నిను చూసి
పచ్చ పచ్చగా మురిసేను

-బూర దేవానందం
9494996143

ప్రకృతి తల్లి..బతుకమ్మ

ఇంటింటా ఆనందం నింపి
తెలంగాణ సంస్కృతి
ప్రతిబింబింపచేసే తల్లి బతుకమ్మ...!
నీళ్ల పూలతో చెరువులను
పరిశుద్ధం చేసే తల్లి బతుకమ్మ ...!
ఔషధ గుణాలు గల ఆకులతో పుష్పాలతో
చల్లంగా చూసే తల్లి బతుకమ్మ...!
తంగేడు ,గుమ్మడాకు,గునుగు,
తామరలతో తొమ్మిది రోజులు ఇంతులను,
యువతులను ఉత్సాహపరిచి బొడ్డెమ్మలను
వేయించుకునే తల్లి బతుకమ్మ ...!
పురాణాలు ప్రయాణ వర్ణన అంశాలతో
పాటలు కూర్చి వాటితో జీవిత పాఠాలు
నేర్పించే తల్లి బతుకమ్మ ...!
పర్యావరణహితము తెలియజేసి అందరిని
జాగృతం చేసే తల్లి బతుకమ్మ...!
ప్రకృతి నుంచి వచ్చి...
ప్రకృతిలోనే కలిసే తల్లి..బతుకమ్మ..!!

- సునీత బండారు
9440671530

నేడు యువత డబ్బు, ఆస్థి, సంపాదన, తాగడం కట్టుబాట్లు లేకపోవడం ఇష్టమొచ్చిన రీతిలో అడ్డు అదుపులేని జల్సాలు, వ్యసనాలు, జూదాలు, ఎవరికీ జవాబుదారిగా లేకపోవడం, తమ స్వంతంకాని పెద్దపెద్ద కార్లలో ఎరగని వారితో తిరగడం, అదీఒక స్టెప్నీ లాగ అటాచ్ అయి కంపనీ ఇస్తున్నామనే సాకుతో షికార్లతో గడపడం, పార్టీలకెళ్ళడం,

యువత పయనం - అభివృద్ధి పథానికా? అధ:పాతాలానికా ?

ఏంచేసినా సరే డబ్బు మాత్రమే కావాలనే వ్యామోహ తీవ్రత, అతితొందరగాధనికులై పోవాలనే స్వార్థ పూరిత కలలు కంటున్నారు. ఇలాంటి వారికి తెలియనివెన్నో మన చుట్టూరాఉన్నాయి. ఇవేకాక సమాజంలో ప్రతీ పౌరునితో పాటు యువత ప్రతీవిషయం తమవిధ్యుక్త ధర్మంగా భావిస్తూ, విధులను, బాధ్యతలను నేర్చుకోవాల్సిన అవసరం నేడు ఉంది.

యువత ఎంజాయ్ మెంట్

నేడు యువత డబ్బు, ఆస్థి, సంపాదన, తాగడం కట్టుబాట్లు లేకపోవడం ఇష్టమొచ్చిన రీతిలో అడ్డు అదుపులేని జల్సాలు, వ్యసనాలు, జూదాలు, ఎవరికీ జవాబుదారిగా లేకపోవడం, తమ స్వంతంకాని పెద్దపెద్ద కార్లలో ఎరగని వారితో తిరగడం, అదీఒక స్టెప్నీ లాగ అటాచ్ అయి కంపనీ ఇస్తున్నామనే సాకుతో షికార్లతో గడపడం, పార్టీలకెళ్ళడం, ఇదేకదా ఎక్కువశాతం అనుకునే ఎంజాయ్ మెంట్ అంటే ...?

రంగులలోకంలో ఊహావిహారం, ఖరీదైన సెల్ ఫోన్ పట్టుకొని, కళ్ళజోళ్ళు పెట్టుకొనిఆపరేట్ చేసే మిడిమిడి జ్ఞానపు పోకడలతో, వచ్చీరాని ఇంగ్లీష్ పరిజ్ఞానంతో, మిక్సింగ్భాష మాట్లాడుతూ, బ్రాండెడ్ బట్టలు వేసుకుంటే, విలువైన వస్తువులు వాడితేనే గొప్పతనమని భావిస్తున్నారా? క్యారెక్టర్ పోగొట్టుకున్నాసరే, బాధ్యతా రాహిత్యంతో కుటుంబాన్ని ఎదిరించినా సరే ....ఇదే రిచ్ లివింగ్ అని అనుకుంటున్నారా? ఇదేకదా అందరనుకునే ఎంజాయ్మెంట్ అంటే ... ??

అధికసంఖ్యలో యువత వ్యసనాలకు బానిసలవడం, మత్తులో మునిగి పోవడం, సిగరెట్ త్రాగడమనేది ఒక ఫ్యాషన్ ట్రెండ్ అనుకోవడం , సమయానికి పనులు వాయిదావేయడం, మరికొందరు సినిమాల పిచ్చితో సినిమా నటుల అభిమానులమని, అభిమాన నట సంఘాలంటూ జీవితాలను తమకుతామే పాతాలంలోకి నెట్టుకోవడం చేస్తున్నారు .ఆధునిక పోకడలతో, టీవీలకు అతుక్కుపోయి ఆలోచనలు రాకుండాగడపడం, ఆర్థిక బాధలతో మోసాలకు, అప్పులకు, అబద్దాలకు పాల్పడడం, సంఘవ్యతిరేక శక్తులతో కలిసి నేరాలు చేయడానికిసైతం వెనకాడక పోవడమే ఎంజాయ్ మెంట్ అనుకుంటున్నారు అత్యధిక శాతం యువత . కాని ... ముమ్మాటికి అది కానేకాదు.

యువత ఆలోచన విధానమెలాఉంది?

ఏంచేసినా సరే డబ్బు మాత్రమే కావాలనే వ్యామోహ తీవ్రత, అతితొందరగాధనికులై పోవాలనే స్వార్థ పూరిత కలలు కంటున్నారు. ఇలాంటి వారికి తెలియనివెన్నో మన చుట్టూరాఉన్నాయి. ఇవేకాక సమాజంలో ప్రతీ పౌరునితో పాటు యువత ప్రతీవిషయం తమవిధ్యుక్త ధర్మంగా భావిస్తూ, విధులను, బాధ్యతలను నేర్చుకోవాల్సిన అవశ్యకత నేడు ఉంది. దూరపు కొండలు నునుపు అనే వాస్తవరూపాలను, పరిస్థితులను, పరిసరాలను బట్టి గ్రహించాల్సిన తీరు, విషయ పరిజ్ఞాన అవగాహన, వ్యక్తిఎదుగుదలకు చాలా అవసరమని ప్రముఖ మనోవిజ్ఞాన విశ్లేషణ నిపుణులఅభిప్రాయాలకు మనం మొదటి ప్రాధాన్యత నివ్వాలి. కొన్ని మెదడుతో, మరికొన్నిమనసుతో ఆలోచిస్తూ నిరంతరం ఒక సమయసారిణిలా, ముందుకు సాగాల్సిన తరుణమే యుక్తవయసు. జ్ఞాన సముపార్జనే అన్ని ప్రాధాన్యతల కన్నా అత్యవసరమని గుర్తించాలి. విద్యావిధాంలో, బోధనా పద్దతుల్లో అవసరమైన మార్పులు వివరణాత్మకమైన, నిర్మాణాత్మకమైన వాస్తవికతతో నిర్మితమై స్వయం ఉపాధికి వెన్నుతట్టేవిధంగా ఉండాలి. అనాధారిత వ్యక్తిత్వం నిర్మించే విద్యా విధానంతో విద్యాబోధనజరగాలి .

వ్యక్తిత్వ లోపమా? అవగాహన రాహిత్యమా?

ఈ లోకంలో ఉద్యోగం విలువ, చదువు విలువ, సమయం విలువ, వయసు విలువ అనంతమైనది , అమూల్యమైనది విజ్ఞానం, శాస్త్రీయత, వ్యక్తిత్వం, మనోచింతన, భవిష్యత్ పునాదులు, నీతి, నిజాయితీ, న్యాయమైన స్వంత సంపాదన, స్వంత అభిప్రాయం, స్పందించేతత్వం, సంగీతం, స్నేహం, సహాయం, వ్యవసాయం, మానవత్వం, చరిత్ర, స్వాతంత్ర్యం, దేశభక్తి, త్యాగం, దేశం, అధికారం, ప్రభుత్వ యంత్రాంగం నడివేతీరు, ప్రయోజనాలు, టెక్నాలజి, ఆరోగ్యం, భౌగోళికసంపద, గొప్పకట్టడాలు, భారతీయరాజులు, సామాజిక కవులు , రచనలు, పాటలు, గాయకులు, జానపదాలు, గొప్పవ్యక్తులు , సాహసాలు సాంస్కృతిక అంశాలు, శిల్పసంపద, గుళ్ళు , నదులు , ప్రాజెక్టులు , సముద్రాలు, పరిశోధనలు , అంతరిక్షం, సాటిలైట్స్, IT రంగం అంతర్జాతీయ విషయాలు, రవాణారంగం, నిర్మాణరంగం, వైద్యరంగాల్లో ప్రగతి, ఇంజనీరింగ్, వైద్యశాస్త్ర అద్భుతాలు గూగుల్, వికీపీడియా, తెజారస్ లాంటివి అపారంగా ఉన్నాయి .

వీటితోపాటు స్వంతంగా ఉద్యోగం సంపాదించాలంటే పడేకష్టం, దాన్ని నిలుపుకోవాలంటే పడేబాధ, యుద్దంలో మరణించిన ఒక సైనికుని భార్యవ్యధ, చిన్నపిల్లలు ఉన్నప్పుడే భర్త చనిపోయిన ఇల్లాలు పడే నరక యాతన, టెర్రరిస్టుల కాల్పుల్లో అంగవికలురైన వీరుల ఆక్రందన, కనీస అవసరాల గురించి తెలుసుకునే ఇంగితజ్ఞానం, అస్థిత్వం, ప్రపంచంలో నివసిస్తున్న గిరిజనజాతుల గోసలు, వెతలు, అనాధలు, బిక్షాటన , బీదరికం గురించి ఎప్పుడైనా ఆలోచించావా?

సాధారణ విద్య , గురువులు చెప్పిన మంచి బోధనలు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, మనసు, ఆత్మ, ఆధ్యాత్మికత, పూజ, ప్రాణాలు నిలబెట్టడం ఇలాంటివెన్నో ఈ లోకంలో ఉన్నవి మనలో ఉన్నాయా ? వీటిపై మనకెంత వరకు అవగాహనుందనేది మనమే నిర్ణయించుకోవాలి. ఇవేమన్నా మన ఆచరణలో వచ్చాయాఎపుడన్నా ? అనేది మనగురించి మనం తెలుసుకోవాల్సిన అవసరమెంతైనా ఉంది మన పెద్దలు పూర్వికులెవరో నియమనిష్ఠలతో, కష్టపడి, జీవితంలో సర్వం త్యాగంచేసి సంపాధించిన లేదా తల్లిదండ్రుల కష్టార్జితమైన సంపాదనతో వచ్చిన పాత ఆస్థులుమనజీవితంలో మనం విలాసాలుగా ఆస్వాధించామా? అనుభవిస్తున్నామా? వారిని గౌరవిస్తున్నామా? వారినెంతవరకు అభిమానిస్తూ అవగాహన చేసుకున్నామనేది ఎవరి అంతరాత్మకు వారికే వారేమిటో బాగా తెలుసు .

మైండ్ సెట్ , గతచరిత్ర మార్చుకుంటేనే మనుగడ

నేటి సమాజంలో యువతరం దేన్నైనా చూసిగాని, పరిశీలనతో గాని నేర్చుకొంటూ తమంతట తాము తమ మైండ్ సెట్ తక్షణమే మార్చుకోవాల్సిన అవసరముంది. క్రీడానైపుణ్యాలను , త్యాగాల స్ఫూర్తిని పెడచెవిన పెడుతూ అవహేళన చేస్తున్నారు. యువజనోత్సవాలను ఒకరోజు పండగలా అనుకుంటున్నారు. సత్ప్రవర్తనమైన, సశ్శీలమైన, నిష్పక్షపాతమైన మాటలకు పరిశుద్ధమైన పదాలకు సంపూర్ణార్థం ఎప్పుడైనావిని కనీసం చెవులన్నా సంతోషించాయా? బాధలను , ఆక్రందనలను, విషాదాలనుచూసి కళ్ళు ఎప్పుడైనా స్పందించాయా?

ఆ స్పందించిన మనసుతో ఒక్క చుక్క కన్నీటిబొట్టు ఎప్పుడైనా రాల్చాయా? కడుపేదరికంలో కనీసం ఒక్కపూట తిండికి నోచుకోని అభాగ్యుల గురించి, కాందీశీకుల బాధల గురించి ఎప్పుడైనా విన్నాయా?

ఆకాశంలో విపరీతమైన రేడియేషన్ తో పక్షిజాతి ఎంతగా అంతరించి పోతుందో గుర్తించావా?

మూగజీవుల వేదన అర్థం చేసుకోగలవా? ప్రకృతి సమతుల్యంలేక క్రిమికీటక జాతి కొన్ని వందల సంవత్సరాల తర్వాత మనపై మిడతలరూపంలో గాలితెగల్లా దండెత్తివస్తే, పంటలు ఊడ్చుకుపోయి కనీసం తిండిగింజలకు కరువైతేఎంతటి తీవ్రపరిణామాలు ఎదుర్కొంటామో ఆలోచించామా? పారిశ్రామిక ప్రగతి, జలవనరుల ఉత్పత్తి , ఎన్ని వైమానిక సాంకేతిక రూపాలు తమ స్వరూపాన్ని మార్చుకున్నాయో ఎన్నడైనా గమనించావా? ఎన్ని విషయ విజ్ఞాన సంగ్రాహ సర్వస్వాలుప్రాథమిక ద్వితీయ తృతీయ రూపాలుగా ఆవిష్కరించ బడ్డాయో తెలుసుకొన్నావా?

లోతైన అధ్యయనం అవసరం

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఎన్నివేల మంది చనిపోయారు ? తెలంగాణాలో రజాకర్లచే, ముష్కర మూకలచే, అరాచక శక్తులచే ఎంత మంది మహిళలు, తల్లులు, అక్కాచెల్లెల్లు చెరపబడ్డారు? కశ్మీర్‌లో ఎందరు అమాయకులు చంపబడ్డారు? ఎందరు క్షతగాత్రులయ్యారు? ఎందరు నిర్వాసితుల య్యారు? ఎందరు నిర్భాగ్యులయ్యారు?

ఇవే కాకుండ ఒక్కసారి అంతర్జాతీయ విషయాల్లో , వివాదాల్లో కొంత విశాలంగాతొంగిచూస్తే ... కాంగో బేసిన్లో , హైతీలో సోమాలియాలో , బూరుండిలో, రువాండాలో, దక్షిణాఫ్రికాలో, అమెజాన్ నదీపరివాహక ప్రాంతాల్లో, ఎడారి ప్రాంతాల్లోని, అండమాన్దీవుల్లోని అటవీ మనుషుల గురించి, వారిపై జరిగిన దారుణాల గురించి ఎప్పుడైనా ఆలోచించావా? మనలా కనీసావసరాలు వారికున్నాయా? వాళ్ళూ మానవ హక్కులపరిధి కిందికే గదా వచ్చేది. బలం, ధనం , అధికారమున్న వారి ఆధిపత్యాల పోరు, సహజ సంపదల దోపిడి, అధికారం,ధనార్జన కోసం కాక , మరేమిటి? ఇప్పుడింత స్వేచ్ఛాజీవులమై బ్రతుకుతున్నామంటేమన పూర్వికుల త్యాగాల రక్తపు మరకల చరిత్ర ఎప్పుడైనా చదివావా ? కేవలంకొంతమందిపై , కొన్ని వ్యవస్థలపై, కొన్ని సిద్ధాంతాలపై , వివిధ పార్టీలపై పనికట్టుకొనిపైశాచిక ఆనందాన్ని పొంది, తమ అభివృద్ధికి తమంతట తామే అడ్డకట్టవేసుకుంటున్నట్లే కదా ?

ప్రపంచంలో నియంతల నిరంకుశ దౌర్జన్యాలు, దోపిడీలు ,రాజుల మధ్యయుద్దాల లో చనిపోయిన కొన్ని లక్షలమంది గురించి చదివావా? మొగలుల నుండిఅసఫ్ జాహీల వరకు చేసిన అరాచకాలు ,కూల్చివేతలు మరెందరో రాజులు చేసినఅకృత్యాలు కనీసం విన్నావా? చరిత్ర క్షుణ్ణంగా తెలుసుకున్నావా? ప్రపంచ యుద్దాల్లోచనిపోయిన క్షతగాత్రులైన వారిగురించి, చనిపోతే ఆగమై చెదిరిపోయిన కుటుంబాలగురించి, ప్రభుత్వ పెద్దల అవాంచిత విధానాల తప్పులకు, మెప్పులకు, వివక్షలకు గురైనమన పౌరులే రాజ్యాంగ వ్యతిరేక శక్తులుగా మారుతున్న తీరు గమనించావా? ఎవరి తప్పిదాలనైనా అధ్యయనం చేశావా? విషాలమైన భారతదేశాన్ని ధన, మాన, ప్రాణాలకు తెగించి, త్యాగం చేస్తూ, నెలలతరబడి కుటుంబాలకు దూరంగా ఉంటూ కంటికి రెప్పలాకాపలా శత్రువులనుండి కాపాడుతున్న భారత సైనికుల గురించి, వారి కుటుంబాల సమస్యల గురించి ఎప్పుడన్నా ఒక్క నిమిషమైనా ఆలోచించావా? శ్రీలంకలో చనిపోయినవేలాది భారత IPKF సైనికుల కుటుంబాల చరిత్రలు ఎప్పుడన్నా విన్నావా? మాట్లాడినవా? నక్సలైట్స్ చంపిన పోలీసు, రాజకీయ , సాధారణ పౌరుల వందలాదికుటుంబాల బాధలు చూశావా? కనీసం ధీనగాధలను తొంగిచూశావా ? పేపర్ వార్తల్లోకూడా చదివే సమయం లేకుండా, ఎవరికీ ఉపయోగపడని, కనీసం నీక్కూడా ఉపయోగపడని దినచర్యతో ఏరోజుకారోజును ముగిస్తున్నావు కదా ?

> క్రమశిక్షణతో గూడిన విద్యయే మనల విగతజీవులుగా చేయకుండా ప్రపంచంలో ఎక్క డైనా నిలిపి, గుర్తింపునిచ్చే సర్వరోగ నివారిణి. క్రమశిక్షణే యువత భవితకు దివ్యమైన పరమౌషదం . విద్యయే అమృత సంజీవని!

బిజీ అనేదొక నాటకం మనమే కపట సూత్రధారి

నీకునీవే గొప్ప అనుకనే "బిజీ" అనే నాటకంలో ప్రధాన హీరో పాత్రధారివై నిలువెళ్ళా స్వార్థంతో లేని అవసరాన్ని సృష్టించుకొని నటిస్తూ ఈ భూమిమీద ఇలానే30-35 యేళ్ళు వచ్చేదాకా బ్రతుకుతున్నావు కాని, జీవించడం లేదు. కేవలం కొనసాగుతున్నావు. సత్ఫలితాలను దరిదాపుల్లో కూడా చేరుకునేందుకు, నీ ధన, మాన, ప్రాణాలు రక్షించే వాళ్ళ గురించి ఆలోచించేందుకు నీకు సమయంలేదు. కష్టపడి సాధించిన మిడిమిడి జ్ఞానపు 45% మార్కుల నాలెడ్జ్ దేనికీ సరిపోదు. ఫోన్ లో గేమ్ ఆడడం, రిజర్వేషన్స్ చేయడం, అడ్వరైజ్ మెంట్స్ బోర్డ్స్ చదవడం, ఇంట్లోవాళ్ళను డ్రాప్చేయడం, ఇంట్లోవాళ్ళకు బయటివాళ్ళకు ఒక క్యారియర్‌గా తప్ప, నేటి కనీసార్హతైన డిగ్రీచదువులలో క్రియేటివిటి లేకపోవడం, అవి స్వంతంగా జీవితాన్ని నిలబెట్టలేకపోవడం అనేవి కళ్లకు కట్టినట్లు కనబడుతున్నవి. పనులు కల్పించలేక, ఆధారం చూపించలేక రోడ్లపై నిత్యం తిరగాడిపిస్తున్నాయి .

వ్యక్తిత్వ పరిశీలన- పరిధి విస్తరణ

రాజ్యాంగ నిర్మాణం ద్వారా ప్రతీ పౌరునికి వర్తించే రాజ్యాంగ హక్కులు తెలియవు, విధులు తెలియవు. బాధ్యతలు అసలే తెలియవు . ప్రభుత్వ సంక్షేమం తెలియదు . ప్రకృతి క్షామం తెలియదు . అతివృష్టి , అనావృష్టులపై అవగాహనలేదు . చల్లనగింజలకు అలవాటుపడ్డ పక్షులు సహజ గుణాన్ని, అస్థిత్వాన్ని, లక్షణాలను మరిచి ఎగరడమెలా మరిచిపోతున్నాయో అలానే అన్ని ప్రభుత్వాలు ప్రజలకు తమంతట తాముగా స్వంతంగా కష్టపడి సంపాధించుకునే మార్గాలను చూపించకుండా సోమరులను చేసే తాయిలాలను ప్రజలకు, యువతకు తాత్కాలిక ప్రయోజనాన్ని అందజేస్తున్నారు . నేటి యువతకు తెలిసిందల్లా సూపర్మార్కెట్ లో దొరికిన వస్తువులను కొనుక్కోవడమే గాని, పండించడం తెలియదు. ప్రకృతిసహజవనరుల గురించి అసలే తెలియదు. తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. రంగుల వెలుతురులో మెరిసే అద్దాల మాల్స్, పెద్దపెద్ద బిల్డింగులు, హంగామాలతో ఊగిఊగే మత్తులోముంచే క్లబ్బులు, పబ్బులు, గొప్పలకుపోయి తాహతుకు మించిన ఖర్చులు, అనారోగ్యాన్ని కొనితెచ్చే హోటల్ ఫుడ్, గ్రీసరీ పార్కులు, షికారులు, ... ఇలాకళ్ళకు ఆనందింప జేయడం తప్ప అందులో మనది అంగులం జాగా ఉండదు. అయిదు పైసల కాంట్రిబూషన్ ఉండదు. అన్నీ పోగొట్టుకోవడమేగాని చిల్లిగవ్వ మనకొచ్చేదీ ఉండదు.

కష్టపడి చదివి, ఫలితాన్ని చవి చూసిన వ్యక్తులను మావాళ్ళని , అధికారంలోగాని, ఆస్థుల్లోగాని పైస్థాయిలో ఫలానావాళ్ళు దూరంనుండి భంధువులని , దగ్గరినుండి భంధువులని చెప్పుకోవడమే నేటి ఫ్యాషన్‌గా మారింది . ఇతరుల రెఫరెన్స్ ఇవ్వడమేగాని, సమయానికి ఒక్కరు కూడా ఆపదలో తమకు సాయంచేసే మనుషులు ఆ లిస్ట్ లోఉండరు. సహాయమందించడంలో మనం వాళ్ళకెంత దూరమో వాళ్ళూ మనకంతే దూరమేనని గుర్తుపెట్టుకోవాలి . బాధ్యతలేని ప్రతీఒక్కరు వ్యకులను, వ్యవస్థను, ముఖ్యులను, చట్టాలను, చరిత్రను ప్రభుత్వాలను, పేదరికాన్ని, కులాన్ని, ఏ ప్రజా ప్రయోజనంలేని వాటిని ,ఏ విషయ పరిజ్ఞానం లేకుండా ప్రతీదాన్ని తప్పించుకోవడంలో, విమర్శించడంలో మాత్రం ఆరితేరిపోయారు. కాని, సహాయం అందించడంలో స్వయం పోషణలో, ఆపదలో స్పందించడంలో దారుణంగా వెనుకబడిపోయారు .

స్వార్థపరత్వం, విమర్శనే అతిముఖ్యమైన వనరుగా నిలిచి వీరి జీవితాల్లో, పనుల్లో, మెదళ్ళలో అతిముఖ్య భూమికగా తిష్టవేసింది. మనిషికి వయసుతో పాటు స్థితిగతులు , అభిప్రాయాలు , ఆలోచనలు, ఆర్థిక పరిస్థితులు , ఆరోగ్యపరిస్థితులు , ఆధారపడే స్వభావాలు, ఆశలు, ఆకాంక్షలు, అనుభవాలు, కోపతాపాలు ఒక్కటే మిటి అన్నీ తగ్గుతాయి. అలానే పెరుగుతాయి కూడ. ఇలా నిర్వచించుకునే దానికన్నా ప్రకృతి నియమానుసారం మనిషి పరిణతిలో అతిముఖ్యమైన పర్యావసానం మార్పు. ఇదే మెచ్యూరిటికి అర్థం. వ్యక్తులమధ్యనుండే పరస్పర అవినాభావ సంబంధాల్లో కమ్యునికేషన్ విషయంలో విజయం సాధించినవారితో పోలిస్తే యువత చాలా వెనుకబడి ఉంది.

శాస్త్రీయతతో పాటు దేశభక్తిని, మానవత్వాన్ని అలవరచుకోవాలి

ప్రస్తుత విద్యా విధానంతో మానసిక నైపుణ్యతలను వెలికితీసే, ధృడమైన వ్యక్తిత్వాలను నిర్మించే స్థాయిలో లేకపోవడం, విద్యకు ఆర్థిక ప్రణాళికల్లో ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వకపోవడం, వ్యవసాయం, సాంకేతిక , ఇంజనీరింగ్ , వైద్యరంగాలకు, స్వయం ఉపాధి రంగాలకునిధుల కేటాయింపులు అరకొరగా ఉండడమనేది సహేతుకమైనది కాదు. ఈ పరిస్థితులేఇంకా 20-30 సంవత్సరాలు కొనసాగితే జనరేషన్లలో భారీమార్పులు జరిగి అశాస్త్రీయమైనవిధానాలతో వేళ్ళూనుకొనిఉన్న వ్యవస్థలన్నీ మరుగున పడిపోయి అధో:గతికి, అచేతనస్థితికి చేరిపోతాయి . తద్వారా యువశక్తి నిర్వీర్యతతో అభివృద్ధి గ్రాఫ్ అమాంతంపడిపోతూ, ప్రపంచానికి విజ్ఞానంతో ముందు వరుసలో మార్గదర్శనం చేసిన పవిత్రమైన భారత దేశంలో విజ్ఞానం క్రమక్రమంగా కనుమరుగవుతుండడం కళ్ళముందు ప్రపంచదేశాలు మనదేశాన్ని ఒక ఎగ్జిబిషన్ లా నిస్పందేహంగా చూస్తాయి. ఆ పరిస్థితుల ఊహ కూడా సుధీ ర్హంగా ఆలోచించేవారి గుండెను బద్దలుకొట్టే విధంగా ఉన్నాయి .

నేటి విద్యా విధానంలో శాస్త్రీయత , విశ్లేషణ , విపుళీకరణ , సరళీకరణలతో వైజ్ఞానికశాస్త్ర, కంప్యూటర్ రంగాలలో జెట్ స్పీడ్ తో ముందుకెళుతున్నా, వీటన్నిటిలోవ్యక్తిగత స్వప్రయోజనాలే కనబడుతున్నాయి. వీటిలో దేశభక్తి, పరోపకారం, మానవీయత, సామాజికీకరణ, సంస్కృతీకరణ విలువలు అంతమౌతున్నాయి . ఈప్రగతి అంతా దేశ సంపదకు, ముందుతరాలకు దోహదమౌతుందనే ధ్యాస కరువైతుంది. తదనుగుణంగా ఫలితాలు తాత్కాలికంగా తోస్తున్నాయి.ఇదేగనుక మన ముందుతరం , ఇదే స్వార్థపరత్వాన్నీ చూపిస్తే మన దేశానికి కనీసం స్వాతంత్ర్యం కూడా రాక బానిస బ్రతుకు ఈడ్చుకుంటూ బ్రతికేవాళ్లమనేది అక్షర సత్యం.

స్విట్జర్లాండ్ దేశానికి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఆర్థిక శాస్త్రవేత్తల్ఫ్రెడ్ ఫెడరికోపెరాటో (1848- 1923) ప్రతిపాదించిన 80-30 సిద్ధాంతం ప్రకారం. 80% ప్రపంచ సంపదకేవలం 20% వ్యక్తుల దగ్గర ఉన్నదన్నట్లు, "వారే ప్రపంచాన్ని ఆడుకోవచ్చని ... ఆడుకోవచ్చని " (They can rule -They can play) "అన్న మాటలు నిజమవుతాయి. రానున్న రోజుల్లో విద్యకూడా ఇదే అధోగతి అయితే ఎలా? విద్యాసంస్థలు, వివిధ శాఖలు, శిక్షణాసంస్థలు, పరిశోధనా సంస్థలు, యూని వర్సిటీలు, విధాన నిర్ణయాధికార వ్యవస్థలు భవిష్యత్తరాలకు ఏం సమాధానం చెప్పగలవో? ఏ దారి చూపించి ప్రజ్ఞావంతులుగా , నిష్ణాతులను ఉత్పత్తి చేస్తాయో? తెలియని సంకటస్థితిలో ఉన్నాం .

సరైన దిశానిర్దేశం చేయకపోవడం, వీటికి తోడు రిక్రూట్ మెంట్స్ వార్షిక క్రమపద్ధతుల్లో రాకపోవడంతో వయసు బార్ అవడంతో ఉద్యోగాలకు అనర్హత వేటుతో యువత దృష్టి అస్పష్టంగా, అగమ్యగోచరంగా కనిపిస్తుంది. వీటి పర్యవసానమే చెడుదారి నెన్నుకోవడం లేదా తమకే తెలియకుండా నిరాశ నిస్సత్తువలో కూరుకుపోవడం. ఇది వ్యక్తిగతంగా అయినా, దేశానికైనా అత్యంత ప్రమాదకరం.

నాగరికత - చరిత్ర కచ్చితంగా తెలుసుకో వాలి

చారిత్రక ఘట్టాలను, శౌర్య పరాక్రమాలను పట్టుదలతో క్రమశిక్షణతో సాధించిన ధర్మవిజయాలను విద్యార్థులకు తెలియజెప్పాలి. ప్రపంచ చరిత్రలను , విప్లవాలను, ఎన్నోమానవ నాగరికతలకు ఆదినుండి ఆతిథ్య మిచ్చిన సింధూ, హరప్పా, ఈజిప్ట్, సుమేరియన్,మెసపటోమియా, రోమన్ తదితర నాగరికతల వైశిష్ట్యాన్ని , గొప్పగొప్ప అత్యున్నత కట్టడాలు, వాటి పటిష్టతలు, అప్పటి లక్షలాది మంది కార్మికుల , శ్రామికుల కష్టాలు, జీవన విధానాలు, రాజుల చరిత్ర, కళలు, కవులు, రచనలు పవిత్ర గ్రంధాలు, మత విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు, కుటుంబ వ్యవస్థ, సామాజిక, సాంస్కృతిక విధివిధానాలు తెలుసుకోవాల్సిన అవసరం, తెలియ జెప్పాల్సిన అవసరం సంబంధిత ప్రభుత్వశాఖలపై ఎంతైనా ఉంది.

నేటికీ మనలా కాకుండా, ఎలాంటి సౌకర్యాలు లేకుండా అనాగరికంగా అడవుల్లోనివసిస్తున్న గిరిజనులు, లంబాడాలు, కోయలు గోండులు, కొలాములు, చెంచులు, యానాదులే కాక, కనుమరుగయ్యే జాతుల జీవన విధానం తెలుసుకోవాలి. ఈఅధ్యయనాలే వచ్చేతరాలకు కొనసాగింపు అవుతుంది. లేనిపక్షంలో ఒక తరంమారే వరకు చరిత్రతో పాటు అన్నీ కనుమరుగయ్యే అవకాశం ఉంది.

గతాన్ని స్మరించుకోవాలి గాని విస్మరించవద్దు

దేశమాత ముద్దుబిడ్డ, అపరమేధావి, నిస్వార్థపరుడు, పరాక్రమవంతుడు, అకుం ఠిత, నిష్కలంక దేశభక్తుడైన సుభాష్ చంద్రబోస్ స్వాతంత్ర్యానికి ముందు యువతనుద్దేశించి అన్నమాటలను గుర్తుతెచ్చుకుంటే ఆహార పానీయాలను సైతం ముట్టుకోము. రోమాలు నిక్కబొడుచుకుంటాయి, రక్తం సలసలా మరిగిపోయే ఆపవిత్రమైన మాటలు గుర్తుతెచ్చుకుందాం ...

"నాకు వందమంది యువకుల రక్తానివ్వండి - నేను మీకు స్వాతంత్ర్యాన్నిస్తాను" (Give me blood - I will give you FREEDOM) మన శక్తిని పదే పదే స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది .... అంటే ఒక దేశానికి యువత ప్రాధాన్యత ఎంత ఉందో తెలిజెప్పే అమృతవాక్కులవి .

అదే విధంగా భారతీయ ఆధ్యాత్మికతకు, నేటితరానికి అనంతమైన శక్తి, శౌర్యాలను నింపి, అనుసంధానకర్తగా కొనియాడబడే స్వామి వివేకానంద యువతకిచ్చిన సందేశాన్ని స్మరించు కున్నట్లైతే ...

"ఒక ఆలోచన తీసుకోండి. ఆ ఒక్క ఆలోచనను మీ జీవితంగా చేసుకోండి - ఆలోచించండి, కలలు కండి, ఆ ఆలోచనపై జీవించండి. మెదడు, కండరాలు, నరాలు, మీ శరీరంలోని ప్రతి భాగం, ఆ ఆలోచనతో నిండి ఉండనివ్వండి మరియు ప్రతి ఇతర ఆలోచనను ఒంటరిగా వదిలేయండి. ఇది విజయానికి మార్గం"

ఈ మధ్య జరిగిన మరో గొప్ప ఉదాహరణ అటల్ బిహారీ

వాజ్ పాయ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో 1999 డిసెంబర్ 24న ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఐసీ 814 నేపాల్ రాజధాని కాట్మాండ్ నుంచి లక్నోకు 176 మంది ప్రయాణికులు, మరో 15 మంది సిబ్బందితో వస్తుండగా టెర్రరిస్టులు , భారత్ జైల్లో ఉన్న ఉగ్రవాద ఖైదీల విడుదల డిమాండ్‌తో విమానాన్ని హైజాక్ చేసినప్పుడు నేటి జాతీయభద్రతా సలహాదారైన అజిత్ డోవల్ IPS కూడా అప్పటి ప్రధాని వాజ్ పాయ్ , విదేశీ వ్యవహారల మంత్రి జస్వంత్ సింగ్ లతో ... "కేవలం పదిమంది యువ బ్లాక్ క్యాట్కమెండోలనివ్వండి. ఒక చుక్క రక్తపు బొట్టు పడకుండా భంధవిముక్తి చేస్తానన్నాడు." ..... ప్రయాణికుల నిండు ప్రాణాలతో ఆడుకోవడం రిస్క్ ఎందుకని వద్దనుకున్నారు. కాని , ఇక్కడ గమనించాల్సింది "సుశిక్షితులైన పది మంది యువ కమెండోలు" అన్నారు. అందుకే యువతనే దేశనిర్మాణానికి వెన్నెముక అని తెలుస్తుంది.

మహా కవి శ్రీశ్రీ యువత నుద్దేశించి " కొంతమంది యువకులు ముందుయుగం ధూతలు, పావన నవజీవన, బృంధావన నిర్మాతలన్నాడు. స్వార్థానికి లొంగని, ఆశయాలు అమ్మని వారికే మా ఆహ్వానం ! వారికి మా సలాం! అన్నాడు . ఎంత గొప్ప భావన.

విద్యావిధాన ప్రక్షాళన ఆవశ్యకత

స్వాతంత్ర్యానంతరం పంచవర్ష ప్రణాళికల్లో అత్యధిక ప్రాధాన్యత ఇతర శాఖలకుఇచ్చిన ప్రాముఖ్యత అంతగా విద్యకు ఇవ్వలేక పోవడం కొంత లోటే అయినా, ఇప్పుడున్న సమకాలీన పరిస్థితుల్లో ప్రపంచ సాంకేతిక ప్రగతిని తట్టుకొని సమఉజ్జీలుగా నిలవాలన్న లక్ష్యంతో ముందడుగులు వేయాలి . గతంలోని విద్యాభివృద్ధిపై వేసిన కమిటీలరిపోర్టులు ,NCERT , SCERT ,UGC లు క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఫలితాలను వాడుకలోకి తెచ్చి చవిచూడాలి. పారిశ్రామిక విప్లవంలా విద్యావిప్లవాన్ని నేటి యువతకు అందుబాటులో ఉంచి, ఉచితాలు మాని ఉన్నత ఆశయాలను మనిషిలో పెంపొందించాలి. మానసిక శాస్త్రం , హ్యూమానిటీస్, నీతిశాస్త్ర బోధనలపై, విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలపై ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించాలి. అంతర్జాతీయ విద్యావిధాన అవగాహనలకు, అంతర్జాతీయ సదస్సులకు, సెమినార్లకు తరచుగా స్టడీ టూర్లకు సౌలభ్యం కల్పిస్తూ MOU లు అమలు చేయాలి .

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పరీక్షల క్యాలెండర్ ను క్రమం తప్పకుండా వెలువరించాలి . అన్ని రిక్రూట్మెంట్ బోర్డులు ఖచ్చితంగా అమలు చేస్తూ , అనుకున్న సమయంలోనే పూర్తి చేయాలి . దీనితో అర్హతలున్న వారు ప్రణాళికబద్ధంగా చదివి వారిలక్ష్యాలను చేరగలరు. వ్యక్తిగత అభివృద్ధే కుటుంబ అభివృద్ధిగా , తద్వారా రాష్ట్రదేశాభివృద్ధిగా పరిగణించ బడుతుంది .

నేడు ప్రపంచంలో అత్యధికంగా యువకులున్నది కేవలం భారతదేశం లోనే. అందుకేయువశక్తిని ఆధరించి, అవకాశాలు కల్పించి, తమకాళ్ళపై తాము భవిష్యత్నిర్మించుకునేలా, విద్యుత్ వలె, యంత్రాలవలె, అనుసంధానకర్తల వలెఉపయోగించుకునే విధంగా రూపకల్పన చేయాలి. మానవ వనరులను, సహజ వనరులను, అవకాశాలను అభివృద్ధి చేస్తూవినియోగం లోకి తీసుకురావాలి . సామాజిక, ఆర్థిక, ఉపాధి శాఖల మధ్య అవగాహనాపూర్వక ప్రణాళికలతో మేధావులంతా ప్రభుత్వాల ముందు ప్రతిపాదనలతో రావాలి. అప్పుడే దేశం ఆదర్శవంతమై, సౌభాగ్యవంతమై ప్రపంచానికి మరోసారిమార్గద

ఆహ్వానము

శ్రీ సర్వభవ్యనామ సంవత్సర శుభప్రదము

శ్రీరస్తు శుభమస్తు

శ్రీ శృంగేరి జగద్గురు మహాసంస్థానము

శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయము

గాంధీ ఆసుపత్రి ఎదురుగా, ముషీరాబాద్, సికింద్రాబాద్ - 500 080.

Ph: 8282822508 www.srignanasaraswathidevalayam.com

శ్రీ ప్లవనామ సంవత్సర దసరా శరన్నవరాత్రోత్సవ ఆహ్వానము

శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య దక్షిణామ్నాయ శ్రీ శృంగేరీ శారదా పీఠాధీశ్వర శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్య సర్వజ్ఞాది సకలజగదుపాసీ విరాజమానులు అనంతశ్రీ విభూషిత శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీస్వామి వార్ల అనుగ్రహ ఆశీస్సులతో, ముషీరాబాద్ శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయము నందు సుప్రసిద్ధ శ్రీ ప్లవనామ సంవత్సర భాద్రపద అమావాస్య తేది : 07-10-2021 గురువారం నుండి ఆశ్వీయుజ శుద్ధ దశమి తేది 15-10-2021 శుక్రవారం వరకు ఆలయములో దసరా శరన్నవరాత్రి ఉత్సవములు నిర్వహించబడును. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షములతో సకలశ్రేయస్సులు పొందగలరు.

తేది : 12-10-2021 మంగళవారం మూల నక్షత్రము రోజున

బి. 07-10-2021 గురువారం సా. 7.00 గం.ల నుండి 8.00 వరకు	శ్రీమతి సంధ్యారాణి ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన
బి. 08-10-2021 శుక్రవారం సా. 7.00 గం.ల నుండి 8.00 వరకు	నృత్య ప్రదర్శన శ్రీమతి శివపార్వతి బృందంచే
బి. 09-10-2021 శనివారం సా. 7.00 గం.ల నుండి 8.00 వరకు	కథక్ నృత్యప్రదర్శన పండిట్ అంజా బాబు (కథక్ కళా క్షేత్ర) ఆధ్వర్యంలో భక్తి సంగీతం శ్రీ చింతలపాటి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో
బి. 10-10-2021 ఆదివారం సా. 7.00 గం.ల నుండి 8.00 వరకు	కూచిపూడి నృత్యప్రదర్శన శ్రీమతి రాధిక బృందంచే (కురుగంటి కళా క్షేత్రం)ఆధ్వర్యంలో
బి. 11-10-2021 సోమవారం సా. 7.00 గం.ల నుండి 8.00 వరకు	సంగీత కార్యక్రమాలు శ్రీమతి మల్లాది ఉష బృందంచే
బి. 13-10-2021 బుధవారం సా. 6.30 గం.ల నుండి 7.30 వరకు సా. 7.30 గం.ల నుండి 8.30 వరకు	దేవి స్తుతి సంగీత నృత్య కార్యక్రమాలు శ్రీమతి దేవసేన నిర్వహణలో సంగీత కార్యక్రమం అయ్యగారి శ్రీదేవి బృందంచే
బి. 14-10-2021 గురువారం సా. 7.00 గం.ల నుండి 8.00 వరకు	కాళి మహత్యం నాట్య ప్రదర్శన శ్రీమతి వసుమతి వరకాల (వేదం ఆర్ట్స్) నిర్వహణలో
బి. 15-10-2021 శుక్రవారం సా. 7.00 గం.ల నుండి 8.00 వరకు	కూచిపూడి నాట్యకదంబం డా॥ అర్ధనారీశ్వరం వెంకట్ నిర్వహణలో

ప్రత్యేక పూజ వివరములు

బి. 06-10-2021 బుధవారం అమావాస్య ఉ. 7 నుండి 8.30 వరకు	మూలవిరాట్ అభిషేకం
ఉ. 8.30 గం.ల నుండి 10 గం.ల వరకు	హరిద్రా దర్శనము మరియు జగత్ ప్రసూతిక అలంకారము
బి. 07-10-2021 గురువారం శు॥ పాడ్యమి	బ్రహ్మీ అలంకారము
ఉ. 08-10-2021 శుక్రవారం విదియ	మహేశ్వరి అలంకారము
ఉ. 09-10-2021 శనివారం తదియ	కౌమారి అలంకారము
ఉ. 10-10-2021 ఆదివారం చవితి	వైష్ణవి అలంకారము
ఉ.11-10-2021 సోమవారం పంచమి ఉపరి షష్ఠి	ఉ॥ ఇంద్రాణి అలంకారము సా॥ శ్రీ మహాలక్ష్మీ హోమం గజలక్ష్మీ అలంకారము
ఉ. 12-10-2021 మంగళవారం సప్తమి (మూలా నక్షత్రం)	శ్రీ సరస్వతి అలంకారము ఉ. 6.00 గం.లకు అభిషేకం ఉ. 9.00 గం॥ల నుండి 12.00 వరకు శ్రీ సరస్వతి హోమం



అక్షరాభ్యాసములు :

ఉ. 8.00 గంటల నుండి 9.00 వరకు - ఉ. 9.00 గంటల నుండి 10.00 వరకు

ఉ. 10.00 గంటల నుండి 11.00 వరకు - ఉ. 11.00 గంటల నుండి 12.00 వరకు

సా. 4.30 గంటల నుండి 6.00 వరకు - రాత్రి 8.30 గం.లకు హంసవాహన సేవ

ఉ. 13-10-2021 బుధవారం అష్టమి	దుర్గా అలంకారము
బి. 14-10-2021 గురువారం మహార్నవమి	శ్రీ రాజరాజేశ్వరి అలంకారము ఉ. 9.00 గం.లకు సపగ్రహ రుద్రసహిత చండిహోమం)
బి. 15-10-2021 శుక్రవారం దశమి	కామధేనువు అలంకారము
బి. 06-10-2021 బుధవారం నుండి బి. 15-10-2021 శుక్రవారం నుండి ఉ. 7.00 గం.లకు	శ్రీ చక్రాభిషేకము అర్చన

ప్రతి రోజు రాత్రి 8.00 గంటలకు పల్లకీసేవ జరుగును.

ప్రత్యేక అర్చన రుసుము వివరములు

శ్రీ సరస్వతి అమ్మవారికి మహాభిషేకం	రూ॥ 300-00
అష్టోత్తర కుంకుమార్చన 9 రోజులకు	రూ॥ 300-00
సహస్రనామ కుంకుమార్చన 9 రోజులకు	రూ॥ 501-00
మహాలక్ష్మి హోమం శుద్ధ పంచమి బి. 11-10-2021 సోమవారం ఉ. 9.00 గం.లకు	రూ॥ 501-00
ప్రతి రోజు శ్రీ చక్రాభిషేకం ఉ. 7.00 లకు	రూ॥ 200-00
అమ్మవారి మూలా నక్షత్రం రోజున బి. 12-10-2021 అభిషేకం	రూ॥ 300-00
మంగళవారం సప్తమి ఉ. 9.00 గం.లకు శ్రీ సరస్వతి హోమం	రూ॥ 500-00
శ్రీ చండీ పారాయణము ఉ. 9.00 గం.లకు 9 రోజులకు	రూ॥ 501-00
చండీహోమం గురువారం బి. 14-10-2021	రూ॥ 1000-00
పై కార్యక్రమములన్నింటికి సర్వపూజ 9 రోజులకు	రూ॥ 4000-00
ఒక రోజు సర్వపూజ (గోత్రానామాలతో నిత్యాభిషేకాలు)	రూ॥ 300-00
అక్షరాభ్యాసం	రూ॥ 1000-00

1. ప్రసాదములు ఉదయము 9.00 గంటల నుండి మ॥ 12.00 గం॥లలోపు గాని, సా॥ గం॥ 6.30 ని॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు గాని స్వీకరించ వచ్చును.
2. అమ్మవారికి సమర్పించే ఆభరణములు, పసుపులు, బిరలు, విరాళములు మొదలగునవి ఇచ్చి రశీదు పొందగలరు.
3. సేవాకర్తలు, భక్తులు తమ ఆభరణములు వగైరా విలువైన వస్తువులు జాగ్రత్తగా చూసుకోనవలెను. ఏమి పోయినా దేవాలయమునకు సంబంధం లేదు.
4. తేది : 07-10-2021 గురువారం నుండి 15-10-2021 శుక్రవారం వరకు దేవాలయమునందు జరుగు దసరా ఉత్సవముల సందర్భంగా మ॥ సమయమందు జరుపబడు ప్రసాదమునకు మరియు భక్తులు ధన, వస్తురూపేణ విరాళములు ఇవ్వగలరు.
   మూల నక్షత్రం రోజున అక్షరాభ్యాసం చేయించుకునే భక్తులు ముందుగా పేరునమోదు చేసుకొనగలరు.
5. ఈ దసరా శరన్నవరాత్రులలో భక్తులు విశేషముగా పాల్గొని అమ్మవారి అనుగ్రహమునకు జగద్గురు శంకరాచార్య దక్షిణామ్నాయ పీఠాధీశ్వర శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి మరియు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామి వార్ల అనుగ్రహ ఆశీస్సులతో సకలశ్రేయస్సులు పొందగలరు.

BANK DETAILS
A/c Name : Sringeri Sarada Peetam
A/c No : 62229075410, IFSC Code : SBIN0020256
MICR : 500002341, SBI, New Bhoiguda, Musheerabad, Sec'bad.

పద్మశ్రీ డా॥ గౌరీశంకర్ CEO & Administrator

శ్రీ కళా వి.యస్. జనార్ధన మూర్తి ధర్మాధికారి

కథ

శీనుగాడు-అవార్డులు

-వేంపల్లి అబ్దుల్ ఖాదర్
9440756131

శీను అంటే నాకెంతో అభిమానం! బంధువైనందుకు కాదు. కపటం ఎరగని అమాయకుడైనందుకు!

ఏదో న్యూస్ పేపర్ చేత బట్టుకుని ఓ రోజు ఉదయమే వాడు ప్రత్యక్షమైయ్యాడు. వాడి ఉత్సాహము అది చూడబోతే విశేషమేదో ఉందనుకున్నాను. ఆ మూడ్‌లోవాణ్ణి కదిలిస్తేగాని అసలు విషయం బయటకు రాదు.

"బామ్మర్దీ! ఏమిటి సంగతి?"అన్నాను.

ఉహు. వాడు పలకలేదు ఉలకలేదు.

'లలలు...లలలు...'అంటూ వగలు బోతూ తాను తెచ్చిన న్యూస్ పేపర్‌ని చేతిలో పెట్టాడు.

ఎల్లో మార్కర్ తో అండర్ లైన్ చేసిన చోట నా చూపులు నిలిచాయి.

'సంగీత సాహిత్య సామాజిక సాంస్కృతిక చిత్రలేఖనం వంటి వివిధ కళారంగాల్లో విశేష కృషి చేసిన ప్రతిభావంతులకు గుర్తింపుగా కంఠీరవ ఫౌండేషన్ సంస్థ ప్రతిష్టాత్మకమైన అవార్డులకు ఎంట్రీలను అహ్వానిస్తోంది. వివరాలకు క్రింద చిరునామా, సెల్ నంబర్లతో సంప్రదించవచ్చు'

ఏదైనా విశేషం ఉన్నపుడే మా శీనుగాడు (ఉత్సాహం పొంగినపుడు అలానే పలకరిస్తాన్లెండి!) సంతోషం పట్టలేక ఊతపదం అందుకోటం వాడి అలవాటు.

అన్నట్టు వాడీ మధ్య కాకర కాయలు కాదుగానీ - ఏవో కథలు కవితలు అవీ కెలికేస్తున్నాడు. అదేదో పత్రికలో కూడా అచ్చయి కూచున్నాయి.

ఆ ఉత్సాహంతో నేమో

" నేషనల్ ఫెస్టివల్స్ సందర్భంగా ఏవో కవి సమ్మేళనాలు అవీ జరుగుతాయి కదా! కాస్త రెకమెండ్ చేయకూడదా మావా"అన్నాడు - నా విలేకరి గిరిని గుర్తు చేస్తూ.

ఆ మధ్య నన్నొకసారి కెలికి చూశాడు. వాడి రచనల్లో రావాల్సిన మెచూరిటీ కోసం నవ్వి ఊరకుండి పోయాను. పోనీ..ఏదో సవరణలు చేద్దామా అంటే అంతగా ఇష్టపడడు. ఏం చేయాలో మరి....

ఉగాదికి ముందు రోజు -

వాళ్ళక్కయ్యకు చాలా ప్రియమైన ఊరగాయ మామిడి కాయలు తెచ్చాడు. రాధ ఎంతో సంతోషించింది.

వాడు అంతటితో ఆగలేదు -

"మావా! అక్కయ్యకు నీకు కొత్త బట్టలు కూడా తెచ్చాను. రేపు పండక్కి కట్టుకు తీరాల్సిందే!"

అలా పిచ్చాపాటి సాగుతోంటే - లోకల్ పత్రికలో ఫోటోతో పాటు కవితను కూడా వేస్తానంటే ఐదు వేలు తగలెట్టాడట!

శీను అమాయకుడు అవునో కాదోగానీ - అబద్ధాలు చెప్పడని నాకో గట్టి నమ్మకం. ఇప్పుడు వాణ్ణి కదిలిస్తే ఇంకెన్ని విషయాలు తెలుస్తాయో!

కదిలించానూ

ఏదో రచయితల సంఘం ప్రధాన కార్యదర్శుట.కవిత్వం గజ్జి తగుల్కొన్న శీనులాంటి వర్ధమాన రచయితలందరికీ ఆర్భాటంగాఏర్పాటు చేసిన ఓ సమావేశంలో- అవార్డులు, ఘన సన్మానాలు, పుస్తకా విష్కరణ సభలు జరిపిస్తానని ప్రలోభ పెట్టి వేనకు వేలు గుంజి చివరకు సదరుతంతు మొక్కుబడిగా జరిపించార్ట! ఇతర అహ్వానితులెవ్వరు లేని, వందల్లో హాజరైన మరో సాంస్కృతిక వేదిక కార్యక్రమంలో అందరూ అవార్డీలేనట. వందల్లో ఇస్తే అలాంటి అవార్డులకు విలువేముంటుందని చాలా మంది బుగ్గలు నొక్కుకున్నారట.

మరో సాహితీ మిత్ర మండలి నిర్వాక వేమిటంటే - 'సరసరసకవీంద్ర' అనో, 'సాహితీ వజ్ర కిరీటి' అనో, 'అక్షరదుర్నిరీక్ష హర్యక్ష' అనో బిరుదులు ప్రదానం చేస్తామని అందుకు రాతగాళ్ళందరు 'సపోర్ట్' (ఆర్థిక సహాయానికి మరో పేరు) చేయాలని బంపర్ ఆఫర్ ప్రకటించిందట.

ఇంకో ఘనత వహించిన సంఘమైతే - ఏకంగా ఓ మహాకవి పేరు మీద పీఠానొకటి పుట్టించి, పుట్టించిన వాళ్ళే అవార్డులు ప్రకటించుకోవటం కొసమెరుపు !

ఇవన్నీ శీనునే చెప్పాడు.

"సరే. శీనూ!....ఐతే ఇప్పుడేమంటావ్?"అన్నా అంతా విని.

"నేనూ గొప్ప రచయిత కావాలని ఉంది మావా...."అన్నాడు.

"తథాస్తు...."అన్నా, వాడి ఆరాటాన్ని నిరుత్సాహపర్చటం ఇష్టంలేక.

పాపం....శీను పరిస్థితి తలచుకుంటే జాలేస్తోంది.

అన్నట్టీమధ్య కరోనా అంటూ ఒహటి దాపరించింది కదా, దాని మీద కవితల పోటీ నిర్వహిస్తున్న సందర్భంగా మళ్ళీ కలిశాడు.

ఇంటి ముందున్న పార్కులో బెంచీ మీద ఒంటరిగా కూచోవడం నా తప్పైపోయింది. ఇంతకంటే మంచి సమయము సందర్భము దొరకదని హాస్యం జోడించిన కవిత అని అందుకున్నాడు.

'పోగాలం దాపరించి
కాలం చేసింది మాయాజాలం
పాజిటివ్ వచ్చిన
గ్రీష్మంగాని పెత్తనం ఏంటని
ముందుగానే
చెట్లన్నీ ఆకులు రాల్చేశాయి

కుక్కమూతి పిందెల
పిదప రోజులు ఎదురొచ్చి
పదునెక్కిన వైరస్ గొడ్డెస్లతో
క్వారెంటైయిన్ వృక్షాల్ని కూల్చేశాయీ
ఎడం పాటించని
వంచనా శిల్పం అగ్ని శిఖలు
అడ్డొచ్చిన
బులెటెన్ అక్షరాల్ని కాల్చేశాయి

అంతే....
ఎక్కడ గాలి అక్కడే
లాక్ డౌన్ ఐపోయింది
నీలాకాశంలో
అటవిడుపుగా ఎగురుతున్న
ఊహాగానం పక్షులన్నీ
మిడతల్లా ఉడతల్లా
భూమ్మీద రాలి పడ్డాయి -

తిరుగుతున్న గ్లోబు మీద
శవాలు కాలుతున్న కమురు వాసన్ని
కట్టడికి లొంగకుండా
పీల్చుకున్న కునేగా పర్‌ఫ్యూమ్
నాకిక అద్దేంటని
మింగిన ప్రాణాల్ని
తీరిగ్గా నెమరేసుకుంటోంది -

వస్తూ వస్తూ
కమ్మని బిర్యాని తిని
భుజాన వేసుకుని వచ్చిన శార్వరీ రాకతో
మాస్కు తీసేసి పారి పోయింది బిరాన
బుజ్జిముండ కరోనా -'

వాడి వింత క్రియేటివిటికి నాకు నవ్వాగింది కాదు.

వారమైన తిరగలేదూ

పెరట్లో మామిడి చెట్టు నీడన 'టిఎస్సే' రాసిన మీరు కథ రాయాలనుకుంటున్నారా? పుస్తకాన్ని తిరగేస్తున్నపుడు - 'పత్రికా రచయితగారూ!' అంటూ వచ్చాడు.

చూడబోతే శీనుపొట్ట కాస్త ఉబ్బినట్టనిపించింది.

ఈమారేదో బోల్డె కబుర్లు మోసుకొచ్చినట్టు ఉన్నాడనుకున్నాను. నా ఊహే నిజమైంది.

"ఆ మధ్య పత్రికలో ప్రకటన చూచిన తరువాత కంఠీరవ ఫౌండేషన్‌కు నా బయోడేటా, పాల్గొన్న కవి సమ్మేళనం ఫుటోలు, అచ్చైన రచనలు పంపించా మావా. ఓమని నన్ను ఎన్నిక చేసుకున్నారు. ఫంక్షన్ జరిగేది రేపు వారం విజయవాడలోనట!"

"కంగ్రాట్స్ శీనూ!"అన్నా.

ఉహు!...వాడు అంతటితో ఆగలేదు. ఆయా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వాళ్లంతా ఆ వేడుకలో పాల్గొంటారని, ఆ సందర్భంగా ప్రచురించే 'అభినందన సంచికలో తన ఫుటో వేస్తారని, ఫుటో క్రింద 'సాహితీ వీర విధేయ' అని బిరుదు ప్రదానం చేసిన వార్తా కథనం కూడా ఉంటుందని చకచక చెప్పుకుపోతున్నాడు.

అంతేకాదూ ఫోనులో కూడా నిర్వాహకులు...

'మీరు మాకు గౌరవ అతిథులు. మీ ప్రతిభను రాష్ట్ర వ్యాప్తం చేయాలన్నదే మా కోరిక. కానైతే... మీ సహాయ సహకారాలను స్వాగతిస్తున్నాం!' అని మాట్లాడినట్టు చెప్పాడు.

తిరగేస్తున్న పుస్తకాన్ని కాసేపు ఆపేసి -

"మరి....నీవేమనుకుంటున్నావ్?" అని అడిగాను.

మాంచి కాపు మీదున్న మా పెరటి అంటి మామిడి చెట్టులా వాడి ముఖం వెలిగి పోతోంది. చూడబోతే

ఏదో రచయితల సంఘం ప్రధాన కార్యదర్శుట.కవిత్వం గజ్జి తగుల్కొన్న శీనులాంటి వర్ధమాన రచయితలందరికీ ఆర్భాటంగాఏర్పాటు చేసిన ఓ సమావేశంలో- అవార్డులు, ఘన సన్మానాలు, పుస్తకా విష్కరణ సభలు జరిపిస్తానని ప్రలోభ పెట్టి వేనకు వేలు గుంజి చివరకు సదరుతంతు మొక్కుబడిగా జరిపించార్ట!

ఊహాలోకాల్నుండి ఇప్పుడప్పుడే దిగొచ్చేట్టు లేదు. కళ్ళ ముందు విజయవాడ, ప్రకాశం బారేజి, కనక దుర్గమ్మ గుడి, అదేదో కన్‌వెన్షన్ హాలు, అథితులు, మేధావులు, కవులు, పండితులు, రచయితలు, కళాకారులు, యాంకర్లు కనిపిస్తున్నారేమో!

ఇంతలో హఠాత్తుగా ఏదో గుర్తొచ్చినట్టు జేబు నుండి మరో కాగితం తీసి నా చేతిలో పెట్టాడు. అదేంటో గాదు, వివిధ అవార్డుల లిస్టు. దాంతో పాటు నిర్వాహకుల వినయ పూర్వక అభ్యర్థన కూడ ఉంది.

'డియర్ అవార్డీ!....

మిమ్మల్ని ఎక్స్‌పోజ్ చేయటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అందులోభాగమే అభినందన సంచిక. దాలో విఐపీస్ సరసన మిమ్మల్ని చూడాలన్న మా అభిలాషను నిజం చేయండి. అందుకు పది నుండి పాతిక వేల దాకా టారీఫ్ వివరాలున్నాయి. అవి పరిశీలిస్తేనే మీకు అవార్డు కన్‌ఫర్మ్ అవుతుంది.'

యాంకర్లలా వంకర్లు పోతున్న శీనును ఆపి -

"ఇప్పుడేం చేయాలనుకుంటున్నావో చెప్పు" అని అడిగాను.

''ఏముందీ? పాతిక వేలు పంపించాలనుకుంటున్నాను" అన్నాడు సింపుల్‌గా.

"నువ్వు విజయవాడ వెళ్ళడానికి రవాణా ఖర్చులు, బస అవీ నిర్వాహకులే ఏర్పాటు చేస్తారా?"

"లేదు, నాకు అవార్డు ఇవ్వడమే గొప్ప, అవన్నీ వాల్లెందుకు భరిస్తారు?"

"బాగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నావా?"

"ఔను!"

"ఐతే మంచిది శీనూ!....వెళ్ళిరా "

"మరి....నన్ను ఆశీర్వదించు మావా"అని కాళ్ళను తాకబోయాడు.

"నేనుకాదు, రాఘవ రావుగారి ఆశీస్సులందుకుంటే నీకెంతో మంచిది"

"ఆయనెవరు?"

వస్తే నీకే తెలుస్తుంది. మా దినపత్రిక ఆయన్ను ఇంటర్వ్యూ చేయమని నన్ను పురమాయించింది.అలాంటి గొప్ప వ్యక్తుల ఆశీస్సులు పొందటం నీలాంటి వాళ్ళకెంతో అవసరం. ఆయనను కలవక పోతే మాత్రం తర్వాత నువ్వే విచారిస్తావ్. ఆ కవిగారికొచ్చిన అవార్డులు ఇన్ని అన్ని కావు మరి!....

"ఐతే నీతో పాటే నేనూ వస్తా మావా"

"రా...." అన్నా సాలోచనగా.

×××

ఆ మర్రోజు సాయంకాలం

మేము వెళ్ళేటప్పటికే రాఘవ రావు గారు సెల్లో తన 'వందేళ్ల తెలుగు కథకు వందనాలు' ప్రోగ్రాం చూస్తు న్నారు. ఆయన వెనకనే ఉన్న విశాలమైన గదిలో షోకేస్ నిండా బోల్డన్ని అవార్డులు, జ్ఞాపికలు, సన్మాన పత్రాలు పిలవకనే పలకరిస్తున్నాయి. తక్కినవి గోడకు వేలాడుతు న్నాయి.

"నమస్తే రాఘవ రావు గారూ!" అన్నా డాబా మీదికి అడుగుపెడుతునే. శీను కూడా చేతులు జోడించాడు వినంమ్రంగా.

''రండి రండి ! మీకోసమే ఎదురు చూస్తున్నా!"అన్నారు.

ఆయన కుడి వేపున గోడకు పది పదిహేనడుగుల సైజులో 'బాపు' వేసిన సాంప్రదాయ చిత్రం ముచ్చటే స్తోంది. ఎడం వేపున అదే సైజులో నీలి పర్వతాల మధ్య దూకుతున్న అందమైన జలపాతం! పొడుగు చేతుల చొక్కా, ఖద్దరు పంచ కట్టు. తెలుగుదనం ఉట్టి పడే వేషధారణ - వెరశి ఆయన అభిరుచిని చెప్పకనే చెబుతున్నాయి.

టీ పాయ్ ముందున్న కుర్చీల్లో శీను నేను కూచున్నాం.

"ముందుగా వేడి వేడి టీ తాగండి. తర్వాత మాట్లాడుకుందాం"అన్నారు.

టీ వచ్చింది.

తాగాము.

అదిగో అప్పుడు రాఘవరావు గారి చూపు శీను మీద పడింది.

''శీను. నా బామ్మర్దే. మీలాంటి పెద్దల్ని కలవాలని, ఆశీస్సులు పొందాలని వచ్చాడు. వర్ధమాన రచయిత కూడాను!" అన్నాను.

'వర్ధమాన' అన్నందుకు శీను నన్నదోలా చూశాడు. నేను అదేమీ పట్టించుకోలేదు.

"ఇవ్వాల నాకో కొత్త రచయిత పరిచయమైనందుకు సంతోషంగా ఉంది!''అని ఆయన కాసేపాగి "ఏదీ...మిష్టర్ శీనూ! మీ రచనల్లోని నాలుగు చరణాల్ని వదలండి" అన్నారు నేరక.

హఠాత్తుగా ఇలాంటి సీనొకటి ఎదురౌతుందని పాపం శీను ఊహించి ఉండడు. ఐనా 'కింద పడ్డా గెలుపు నాదే' అన్నట్టు గొంతు సవరించుకున్నాడు -

'బండ చాకిరీ చేసినా
పట్టెడు మెతుకులు విదిల్చలేదని
పనిపిల్ల గోల చేసింది -

అదే అదను చూచి
కాచుక్కూచున్న పోకిరీ గాలి
ఈల వేసింది -
అది గాలైనా ధూలైన సరే
కట్టు తప్పితే
చిరుతలా వేటాడుతా
వైరస్‌లా చెలరేగుతా -

ఆధిపత్య గర్వంతో
విర్రవీగే అగ్రదేశాధీశులే
కరోనాకు గులాములు ఐనప్పుడు
నాకెందుకు
కవితాక్షరం సలాములు కొట్టకూడదు'-

అక్కడికి ఆగమన్నట్టు రావు గారు సైగ చేశారు.

ఇంతలో మేడంగారు ముగ్గురికి వేడివేడి బజ్జీలు తీసుకువచ్చారు. మళ్లీ ఏ కవిత వినిపించ బోతాడో ఏమోనని జాగ్రత్త పడి బజ్జీల ప్లేటును శీనుకు అందించారు రావు గారు.

అందరం వేడి వేడి బజ్జీలు కానిచ్చాకా -

"మరి....వచ్చిన పని కానిద్దామా సార్" అన్నాను.

"అలాగే..." అన్నారాయన.

ప్రాథమిక విషయాల అనంతరం మా సాహిత్య సమాలోచన ముందుకు సాగింది.

"మీరు....ఎన్ని రచనలు చేసి ఉంటారు?"

"యాభై దాకా"

"ఏఏ సాహిత్య ప్రక్రియల్లో?"

"దాదాపు అన్నీ"

"ఇన్ని రచనలు చేసి ఎన్నో విశిష్ట అవార్డులు అందుకున్న మీరు గొప్ప రచయితగా కవిగా గర్వపడ్డం లేదా?"

"లేదు"

"ఎందుకని?"

" నేను చేసిన కృషి ఎంత? నేర్చుకున్నదెంత? నేర్చుకోవాల్సిందెంత? అణువులో పరమాణువంతే గదా?"

"మరి సాహిత్య రంగంలో ఆర్ధ శతాబ్దంగా మీ కృషి అద్వితీయమంటున్నారే?"

"ఇంత చేసినా నేనొక సాహితీ వేత్తగా ఎదిగానా అన్నది ఇప్పటికీ నన్ను వెంటాడుతున్న ప్రశ్న"

"మరి...ఇన్ని ఘన సన్మానాలు, పురస్కారాలు ఎలా దక్కాయంటారు?"

"ఒక విధంగా నిర్వాహకుల ఐడెంటిటి కోసం"

"అదేంటి?....ఐతే మీ కృషి మీకు ఐడెంటిటిని తెచ్చిపెట్టలేదా?"

"కొంత మేరకు మాత్రమే"

'డియర్ అవార్డీ!.... మిమ్మల్ని ఎక్స్‌పోజ్ చేయటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అందులోభాగమే అభినందన సంచిక. దాలో విఐపీస్ సరసన మిమ్మల్ని చూడాలన్న మా అభిలాషను నిజం చేయండి. అందుకు పది నుండి పాతిక వేల దాకా టారీఫ్ వివరాలున్నాయి. అవి పరిశీలిస్తేనే మీకు అవార్డు కన్‌ఫర్మ్ అవుతుంది.'

"ఇంతకీ ఈ మొత్తం వ్యవస్థ మీద మీ అభిప్రాయం?"

".... .... "

"ఏం మాట్లాడరు?"

"నిర్మొహమాటంగా చెప్పలేక"

"చెప్పాలి. ఆ కాన్సెప్ట్ మీదనే ఈ ఇంటర్వ్యూ కదా!"

"ఐతే వినండి. ఎన్నాళ్ళగానో నాలో నలుగుతున్న అంశాన్ని పత్రికా ముఖంగా చెప్పే అవకాశం కలిగినందుకు సంతోషం గా ఉంది! ఇవ్వాల 'కొన్ని' సాహితీ సంస్థలు, సంఘాలు, వేదికలు వాటి సొంత వ్యక్తిత్వాన్ని మరిచిపోతున్నాయి. వర్గాలుగా చీలిపోతున్నాయి. పట్టుకోసం స్వార్థము, అవకాశవాదమే అజండాగా సాగుతున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే వివిధ రుగ్మతలతో నివురు గప్పిన నిప్పులా ఉన్నాయి-"

''ఇలాంటి పరిణామం వల్ల వేలు జరుగుతుందంటారా?"

"ఎలా జరుగుతుంది?....అదలా ఉంచి ఎంతో కొంత నిజాయితిని గురించి వేదన పడేవారు ఇది ప్రస్తావిస్తే- ప్రస్తావించిన వారి నిబద్ధతను ప్రశ్నిస్తున్న సందర్భాలు ఉన్నాయి"

"ఐతే అక్షరం వ్యాపార వస్తువైపోయిందని మీ అభిప్రాయమా?"

"కావచ్చు. ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఈ వ్యవస్థలో కొన్ని ఆర్థిక సంబంధాలకు కట్టుబడి పోతున్న మాట నిజమే"

" ఇది మీ వ్యక్తిగత అభిప్రాయమా?"

" ఎలా అనుకున్నా పరవాలేదు. ఎటొచ్చీ నిజాయితిగ నడవాల్సిన వ్యవస్థ ఎప్పుడైతే వ్యాపార సరళిలోకి మారిపోతుందో- అప్పుడు విలువలు కూడా తారుమారవుతా యన్నదే నా ఉద్దేశం"

"అందుకు నిదర్శనం?"

"తామర తుంపరగా పుట్టుకొస్తున్న డొల్ల సంస్థలే"

''ఐతే అక్షరాన్ని నమ్ముకోవాల్సిన వాళ్ళే అమ్ముకుంటున్నారని మీ అభిప్రాయమా?"

"కావచ్చు. ఐతే అన్నీకాదు, కొన్నే. నిజాయితిగ సామాజిక బాధ్యతతో నడుస్తున్నవి ఎన్నో ఉన్నాయి. వాటిని తప్పక అభినందించా లి"

"ప్రస్తుతం అవార్డుల ప్రహసనాలు నడుస్తున్నాయి కదా! ఏ అవార్డులు విలువైనవని మీ అభిప్రాయం?"

"నాకు తెలిసినంతలో.... రెకమెండేషన్ లకు, డబ్బులకు అమ్ముడుపోయే అవార్డుల కంటే నిజమైన ప్రతిభను గుర్తించి ఇచ్చేవే విలువైనవి"

"అవార్డులు ప్రతిభకు కొలమానమా?"

"కాదు. కేవలం గుర్తింపు మాత్రమే. ఒక విధంగా అవి మాయలేడి లాంటివి. వాటి వెంట మనం పరిగెత్తటం కాదు, అవే మనల్ని వెదక్కుంటూరావాలి"

రావుగారి మాటల్ని శ్రద్ధగా వింటున్న శీను వేపు చూశాన్నేను. వాడు విధేయుడైన విద్యార్థిలా చేతులు కట్టుకుని బుద్ధిగా వింటున్నాడు.

కాస్త నిశ్శబ్దం తర్వాత -

"చాలా విలువైన విషయాలను ప్రస్తావిం చారు. ఇక చివరగా మిమ్మల్ని ఇంకొన్ని ప్రశ్నలడగాలని ఉంది"

"అడగండి"

"రచనా వ్యాసంగంలోకి అడుగుపెడుతున్న వారికి మీరిచ్చే సలహా ఏవిటి?"

''వర్ధిష్ణులు కొన్ని ముఖ్యమైన విషయాలు గ్రహించాల్సి వుంది. అందులో విస్తృత గ్రంథ పఠనము,లోకానుశీలన కీలకమైనవి. సృజనాత్మకత, వ్యక్తీకరణ రచనకు ప్రాణవాయు వులాంటివి"

"యువ రచయితలకు మీరిచ్చే దిశానిర్దేశం?"

"ఏవో కొన్ని రచనలు అచ్చయి, నాలుగు కవి సమ్మేళనాల్లో పాల్గొన్నంత మాత్రాన తానొక గొప్పరచయిత అయిపోయినట్టు గర్వపడకూడదు. అలా భావిస్తే అభివృద్ధి అంతటితో ఆగిపోతుంది. రాగద్వేషాలకు దూరంగా ఉండాలి. ప్రతిభ శత్రువులో ఉన్నా స్వాగతించాలి. ఏతావాతా ఈ రంగంలో ఒంటి మడక సేద్యం చెసినా ఫలితం దక్కించుకు తీరాల్సిందే"

"దీర్ఘకాలిక రచయితగా నిలబడాలంటే ఏం చేయాలి?"

"వెరీ సింపుల్. ఇందాకటి మాటలు వీరూ గమనించవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే - లక్ష్య సాధనకు అక్షరంతో నిరంతరం శ్రమించడం ఒకటే మార్గం"

"మంచిది రావుగారూ! ఇవ్వాల మీ నుండి చాలా విషయాలు తెలుసుకున్నాం! 'సాహితీ విలువల విధ్వంసాన్ని' ఇంత నిర్మొహమా టంగా ప్రస్తావించినందుకు మా పత్రిక తరఫున మీకు హార్దిక ధన్యవాదాలు!"

×××

ఎప్పుడొచ్చిందో - చిరుజల్లుపడి వెలిసింది -

రాఘవ రావుగారి నుండి సెలవు తీసుకున్న తర్వాత రోడ్డు మీది కొచ్చాం.

మా ఇద్దరి మధ్య మాటల్లేవ్. అంతా మౌనమే. మాట్లాడబోతే వాడు పట్ట

నువ్వే రాజంటకదనే...!

అన్నా ఓ రైతన్నా...
నువ్వే రాజంటకదనే
తలపాగా చుట్టుకున్నందుకా
కిరీటమల్లే...
లేక మాసిన గుడ్డలు కట్టుకున్నందుకా హరాలల్లే...

రత్నాల రాశులు పండించి
మూడు దుడ్లకు బేరమాడుతుంటే
ముడుచుకోను జాగలేకుండా
మూలన పోసుకున్నందుకా...
నిత్యం అప్పుల తక్కెడ్లో జోగుతున్నందుకా..!

కన్నీటిసాల్లు కుమ్మేలుబారినా
కమతాన్ని తడిపి, మేడి పట్టి
వొల్లు పులిసిపోతున్నా వొడుపుగా సాగుచేసి
ఓర్పు సింహాసనం మీద కుర్చున్నందుకా..!

ఆకలికేకలకు పేగు వెన్నుకట్టుకున్నా...
అన్నమై ఉడకడానికి అహోరాత్రులు శ్రమించి
స్వేదం చిందించి లోకంగొంతులో
తెన్పగా బయటికి వస్తావు...
తెగిన రెక్కలు ముక్కలవుతున్నా
వ్యవ"సాయం" చేసే అన్నదాతవైనందుకా..!

కల్తీ నృత్యం చేస్తుంటే
ఆశల విత్తులు ఒట్టి పోయి, ఎరువులు కరిగిపోయి
గుండెలు అవిసిపోతుంటే
పురుగుల మందు తాగి,
తల్లి భూగర్భంలో నిద్రపోతున్నందుకా..!

-శ్రీతరం బింగి శ్రీకాంత్
7893613015

కుబుసం విడిచిన పాము

ఓ మానవా
మారాలి నీకు నీవు....!
కావాలి నవ చైతన్యపు
వెలుగు దివిటివి
పంచాలి నువ్వు లోకానికి
మంచితనాన్ని
నిలబెట్టాలి మనిషి మహాత్మ్యం లోకానికి!

బద్దకాన్ని నిద్ర లేపాలి
సోమరితనం దరిచేరనీకు
నిద్ర ముఖం పక్కన బెట్టు
నిన్ను నీవు వజ్రంలా సాన
బట్టుకో
నిన్ను నీవు ఆత్మ పరిశీలన చేసుకో
నీ అంతరంగం లోని
అద్దంలో చూసుకో
నిత్య విద్యార్థిలా మును
ముందుకు సాగిపో!

ఆపదలొచ్చిన,సంపదలు వచ్చిన
ధనము కలిగిన, దాస్యం చేసిన
బాధలు భయపెట్టిన
బహుమతులు ఆనందం
కలిగించిన
అంతరంగంలో జాగృత మైన
గుండె గూటిని ప్రశ్నించుకో
మనసు చెప్పిన మార్గాన్ని
ఎంచుకో
సత్యం వెంట సవారి చెయ్యి!

స్తంభం మనిషి మనుగడకే చేటు
సోమరితనం నిన్నుసమాజ
చీడగ తయారు చేయును
అలసత్వం నీకు అసలే వద్దు
నిలకడ లేని మనసు
నిన్ను నిలువునా దహించి వేస్తుంది!

కుబుసం విడిచిన ఫణివై
ఉషారుగా ఉషారెత్తుతూ
నీలో ఉన్న నిజాయితి
నిస్తేజంగా లోకానికి పంచేయ్
కణ కణ మండే కత్తుల
కొలిమై
భగ భగ మండే ఎర్రని
భాస్కురుడవై
మిల మిల మెరిసే మిణుగురు పురుగై
ధగ ధగ మెరిసే స్వర్ణ కంకణమై
అడవి తల్లి ఆక్రోశం నీదై
వెండి వెలుగు విరజిమ్ము
బంగారు భవిష్యత్తుకు
బాటలు వేయాల్సిందే!

-కోణం పర్శరాములు
9959524585

ఆయనొక కథల నందనవనం...

కొన్ని కొండలు అంతే!
తమకు తామే సాహిత్యపు
ఋతుపవనాలను ఆవహించుకుని
కథల నందనవనాలుగా
రూపాంతరం చెందుతాయి.
కాలం గడిచేకొద్దీ కథలను సృజియించే
పక్షులన్నీ ఒకే చెట్టుమీదకి చేర్చబడతాయి
అప్పుడది ఒక కథానిలయమైన
కథపారిజాతమవుతుంది.
ఒక్క చిన్న కథ అలవోకగా ఒలికినా
అది వృక్షపు కొమ్మపై గూడవుతుంది.
ఆరుద్రలో అద్దేడు చల్లితే పుట్టెడు పండినట్లు
నేడు వనమంతా సృజనాంకిత
పక్షుల కీలకిలారావాల మంగళస్వరాలే
ఒక్క విత్తు వేదవృక్షపుశాఖలై విస్తరించినట్లు
కథా సాహిత్యపు సుగంధమంతా
తెలుగునేలన వ్యాపిస్తూ
ఎల్లలఅంచులనన్వేషిస్తూ....
కాలప్రవాహంలో కొండ
ప్రశాంత శబరిగా ప్రవహిస్తూ సాగిపోతూ
అందించిన చైతన్యపు ఉద్దీపనతో
సాహితీకెరటాలు కదం తొక్కుతూ
శాంతిగీతాన్ని ఆలపిస్తూ కదులుతున్నాయి.
ఒక నిరంతర సాహితీ ప్రయాణం
భావితరాల మజిలీలు చేరుకునే దిశగా
ప్రవహిస్తూ...ప్రవహిస్తూ...!!!

-కొత్తపల్లి ఉదయబాబు.
9441860161,
9533756075

జాషువా ఆటవెలది పద్యాలు

విశ్వ కవిగ మారి వివిధ ప్రక్రియ లలో
రచన లెన్నొ చేసె రమ్యముగను
జాతి రత్నముగను జాషువ నిలిచెగా
తెలుగు జాతి కంత వెలుగు తెచ్చె..!

మహిన ఖ్యాతి పొందె మధుర శ్రీనాథుడు
ఘనత చెందె నిలన ఘనము గాను
భావ విప్ల వమును బాగుగా జరిపించి
సంచలనము చేసి చరిత కెక్కె !

తిరుగు లేని నరుడు తెలుగు భాష కతడు
గౌరవమ్ము కొరకు గట్టి గాను
పట్టుపట్టి యెదురు పండితులకు నిల్చి
కులము యన్న వారి కుళ్ళు కడిగె..!

కులము కుళ్ళు తోడ కుటిల సమాజము
ముందుకెళ్ళు తీరు ముప్పు తెచ్చు
ప్రశ్న లెన్ని వేయ పరిహాసమును చేయు
మనుజ జాతి లోన మార్పు కోరె..!

పేద ధనిక యనుచు బేధాలు తగవని
కవుల కులము యంటె కవన మనియె
ఖండకావ్యములతొ ఖ్యాతిని గడించె
తేడా మానమనుచు తెలిపె మనకు ..!

-సునీత బందారు
9440671530

భూతల స్వర్గం అమెరికాలో ఆచార్య చెన్నప్ప

ఆచార్య చెన్నప్ప అమెరికా ముచ్చట్లు, యాత్ర అనుభవాలను పుస్తక రూపంలో తీసుకురావటం ఎంతైనా అభినందనీయం. 'అమెరికా! ఓ అమెరికా!' కవితా సంపుటి, 'నయాగరా' ఖండకావ్య రచయిత ఆచార్య చెన్నప్ప, కవితా హృదయంతో అమెరికా నగరాల సౌందర్యం వీక్షించారు. వెనిన్ నగరంలో

'పగటి పూటనే చంద్రకాంతులు
వగలు రేపెడి శ్వేతకాంతలు!
మనసు పొంగక ఉండుటెట్లు?
మాయలోకపు జాడలుండగ!'

అంటారు. ప్రపంచ నగరాలలో చాటు మాటుగా సాగే విషయాలు వేగస్ నగరంలో బహిరంగంగా కనిపించినంత మాత్రాన దాన్ని సిన్ సిటీగా (పాపనగరం) భావించటం భావ్యం కాదంటారు. జూదం, త్రాగుడు, వ్యభిచారం యిక్కడి వాతావరణంలో తప్పుకాదని, చూపు మంచిదైతే అంతా మంచి కనిపిస్తుందని అమెరికా సంస్కృతిని ఆ విధంగా, అభిమానించాలంటారు. సహజంగా ఎవ్వరైనా,అమెరికా వంటి సంపన్నదేశాలు చూసేటప్పుడు మన జీవన వ్యవహారాలను పోల్చుకోక తప్పదు. ఏదీ శాశ్వతం కాదని ఉన్నదాంతో సుఖంగా బతకాలనుకోవటమే అమెరికన్‌ల జీవన విధానాల అతి రహస్యమని డా॥చెన్నప్ప విశ్లేషించారు. ఆచార్య చెన్నప్ప తాను చూసిన అపురూప అద్భుత విషయాలు, దృశ్యాలకు తన స్పందనలను వ్యక్తీకరించటానికి మొహమాటం పడలేదు. మసిపూసి మారేడుకాయ సృష్టించే ప్రయత్నం అసలులేదు. చూసిన దానికి, నిష్కర్షగా స్పందించారు. స్వర్గంలో సురాపానం చేసేవారికి రాత్రింబవళ్లు ఉండవేమో! ఇక్కడా అంతే. విలాస గృహాలు, మదవతులు, అన్ని వస్తువులు లభ్యం అదొక ఆనందనిలయం- స్వర్గతుల్యమా అని ప్రశ్నిస్తూ కాదు, స్వర్గమే శాంటా బార్బరా.

అందమె అంతట విరిసెనులే
వెన్నెల పగలే కురిసెనులే
శాంటా బార్బర చిన్నదిలే
స్వర్గము నేలకు దింపెనులే"

సుందరాంగులైన శ్వేతకన్యలు, సిగ్గులనేవి భారతీయులకు అప్పజెప్పినారొ ఏమో! అంటూ అద్భుతంగా స్పందిస్తారు.

లాస్‌ఏంజిల్స్‌లో పరాయి దేశపు గడ్డమీద కాలుమోపిన ఆచార్య చెన్నప్ప, షికాగో నుంచి డౌన్‌టౌన్, తానా సభాపర్వం, దక్షిణ కాలిఫోర్నియా తెలుగు సంఘ లాస్ ఏంజెల్స్ కార్యక్రమం, బీచ్, గ్రంథాలయాలు, శాంటా బార్బరా, స్వర్గసీమ అందచందాలు, షానోజె, శాంతా క్రుజ్‌వంటి సాగర తీరప్రాంతాలు, హాలీవుడ్ అందాలు, లాస్ వేగస్, డెత్ వెలీ, స్టాట్యు ఆఫ్ లిబ్టీ, వెనిన్ హూవర్ డ్యాం, న్యూజెర్సీ, వాషింగ్‌టన్ డిసి, న్యూయార్క్ నయాగర రమణీయ ప్రకృతి సముద్రతీరాలు, ఎడారులు, గుట్టలు, కొండలు, లోయలు ఎన్నో అద్భుత ప్రాంతాలు చూసారు. అమెరికాలో ఈ యాత్రలో 15వేల మైళ్లదాకా విమానంలో, 6వేల మైళ్లదాకా కారులో ప్రయాణం చేసారు. అర్ధాంగి శ్రీమతిప్రమీల, అమ్మాయి శ్రీమతి శ్రావణి, చిన్న కొడుకు ప్రణవ్, అల్లుడు నాగరాజు, మనుమరాండ్రు శ్రేష్ఠ, శ్రద్ధ, సన్నిహిత బంధువు శైలాకాశ్, ప్రవీణ్ కార్తీక్ ఎందరో ప్రవాసాంధ్ర కుటుంబాల ప్రస్తావన ఈ పుస్తకంలో చోటు చేసుకొంది.

ఫసిఫిక్ మహా సముద్ర తీరంలో బీచ్‌లోని నల్లమద్ది చెట్లలాగా భారీకాయంగల అక్కడక్కడ వున్న నల్లవాళ్ల మధ్య శ్వేతకాంతలు దట్టమైన మేఘాల మధ్య మెరుపు తీగల్లా మెరిసిపోతూ కనపడటం ఆచ్యార్య చెన్నప్పగారి కవితా హృదయానికి పరవశం కలిగిస్తుంది. వరూధినిని తలదన్నే సొగసుకత్తెల్ని శాంటాబార్బరాలో చూసినా ఎలాంటి వికారానికి, అసహ్యానికి లోనుకాలేదు. ఈ ముచ్చట్లలో ప్రొ॥ చెన్నప్పగార్కి కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, రాయప్రోలు వంటి భావకవి వరేణ్యులు, ప్రస్తుత కవిమిత్రులు గుర్తుకు రావటం వారి సహృదయత, కవిత్వ భావోద్వేగ జీవన ఔన్నత్య దృష్టిని సాక్షాత్కరింపచేస్తోంది.

30వ పుస్తకంగా ప్రచురింపబడిన ఆచార్య చెన్నప్ప అమెరికా ముచ్చట్లు సాహితీ అభిమానులను, సామాన్య చదువరులను అలరింపచేసే అద్భుత అనుభూతుల సమ్మేళనం.

ప్రతులకు:
ప్రొ॥ మసన చెన్నప్ప,
ప్రమీలా ప్రచురణలు,9-76/2,
ఉదయ్‌నగర్ కాలనీ, బోడుప్పల్,
హైదరాబాద్-500 092.
సెల్: 98856 54381

-జయసూర్య
సెల్: 9440664610

ప్రాణం లేని "రూపాయి"

సుఖాల ప్రేమలో
కష్టాలపై యుద్ధానికి
సంధించిన మారణాయుధం
విషమిస్తే అతివృష్టి.
వికటిస్తే అనావృష్టి.

అనుభావాలకు ప్రేమించే
అజ్ఞానం హద్దు దాటితే
అగుపించని అగాధానికి
సహజత్వం సూన్యం.
సరళత్వం దైన్యం.

వ్యామోహాయుద్ధంలో
రక్తరహిత దాహానికి
విలువలన్ని తల్లడిల్లి
మనిషంటే అలజడే.
మనసంటే జల్లెడే.

మృగమనసులో
పొంగిపొర్లి విపరీతానికి
విషం చిమ్మే మనసు
రుచి మరిగితే వ్యర్థం
రుచి తరిగితే అనర్థం.

పొట్టచెక్కలేయ్యాలా నవ్వుతూ
మెదడంతా మొద్దుబారెలా
ఆలోచనను తరిమేసి
ఆవేశాలకు ఊపిరిపోసి

చిల్లరడప్పులతో ...
నోట్లచప్పుడుతో...
మనిషిని కోతిని చేసి
ప్రాణం పోయేదాక ఆడించిందే
ప్రాణం లేని "రూపాయి"

-చందలూరి నారాయణరావు
9704437247

ముందడుగేద్దాం...!

అడుగేద్దాం
ముందడగేద్దాం
అన్యాయాలను దునుమాడగ
అక్రమాలను నిగ్గుదీయగ
అరాచక శక్తులణచి వేయగ
భూకబ్జా హిరణ్యక్షుల
తుదముట్టించగ..
అడుగేద్దాం..!ముందడుగేద్దాం!!
నీతులుచెప్పి గోతులుతీసె
రాతలు రాసి కోతలు కోసె
దానవ మానవ గుండెలపై
అబలలపై అఘాయిత్యాలను
అలవోకగా చేసె కామందులను
మగసిరిని నరికేద్దాం...!
అడుగేద్దాం..ముందడుగేద్దాం!!
లంచాలకు మరిగి,
బీదబిక్కనిచూడక,
జ్ఞానమున్నట్టి
ధన దాహార్తులైన
అజ్ఞానాధికారుల కళ్ళను
ముందుగ పెరికేద్దాం!
కులాలమతాలకూల్చేద్దాం
ఒకే మతం,ఒకేకులం,
ఒకేజాతిని నిలిపెద్దాం!
ప్రపంచం,దేశాలను
పరిరక్షిద్దాం!అందుకే
అడుగేద్దాంముందడుగేద్దాం!
దోపిడి దొంగలులేని,
మోసాలను చేయని,
నవ ప్రపంచం కొరకు
చేతనతోడిఎత్తులు వేసి
సమర్థనాయకులకు
ఓటు వజ్రాయుధం తోగెలిపిద్దాం!
ప్రజల కోసం అనునిత్యం
పోరాడే వారికి బాసటగా నిలబడదాం!
వ్యాపారంలో దోపిడిచేసె
అథములను మార్చేదాం!
కల్తీవస్తువుల నమ్మేవారిని
కడదాకపరిగెత్తిద్దాం...
రైతుల పంటల ధరలను పెంచే వరకు
దళారీ వ్యవస్థను కూల్చేద్దాం..
కూలీనాలీ జనాలకు కూడు గుడ్డకై
కూలీధరలను పెంచిద్దాం
సమ సమాజాన్ని సాకారంచేద్దాం...!

-డాక్టర్ గన్నోజు
శ్రీనివాసాచారి
8555899493,

అందమంటే ... ఇది

ముత్యాల్లాంటి వాన చినుకులు
పుడమిని ముద్దు ముద్దుగా
ముద్దాడితేనే అందం...

సదా సాంతం నిగనిగలాడే
హరితహారమే ప్రకృతికి అందం...

జగతికి జలాభిషేకం చేసే
జలసంపదే సర్వప్రాణి
కోటికి అందం...

పరిమళాలు వెదజల్లితేనే
పుష్ప జాతికి అందం...

కోళ్లు కొక్కొరొక్కోని కూస్తేనే
పల్లెలకు అందం...

రంగు రంగుల రంగవల్లులు
వాలితేనే వాకిళ్ళకు అందం...

కర్షకులు నాగళ్లతో నాట్యం
చేయిస్తేనే పంటలకు అందం...

సైనికుల హస్తాల్లోని తుపాకీ
గుండ్లు శత్రు గుండెల్లో
దిగితేనే దేశానికి అందం...

అతివలు నడయాడితేనే
అవనికి అందం...

బిడ్డకు ప్రాణం పోస్తేనే
తల్లికి జన్మజన్మల అందం...

మానవత్వమనే పింఛం పురి
విప్పితేనే మనిషికి అందం...

నవ్వుల పువ్వులు వికసిస్తేనే
ఆరోగ్యానికి అందం...

దాన , ధర్మాలనే ఆభరణాలు
ధరిస్తేనే మానవ జాతికి అందం...

శ్రమజీవులు స్వేదం
చిందిస్తేనే దేశ అభివృద్ధి
వికాసానికి అందం...

కుల మతాలు అంతరిస్తేనే
మానవ సమాజానికి అందం...

మన దేశ సంస్కృతీ,
సంప్రదాయాలే లోకానికి అందం...

పసుపు కుంకుమలుంటేనే
పూజాది కార్యక్రమాలకు అందం...

మొక్కలు నాటే యజ్ఞం చేస్తేనే
మానవ మనుగడకు అందం...

కాలుష్యమనే విషవృక్షాన్ని
కూకటి వేర్లతో పీకేస్తేనే
పర్యావరణానికి అందం...

పుడమి , ప్రకృతిలు సదా
అలరారుతుంటేనే ...
సర్వతోముఖాభివృద్ధికి అందం...

అందమనేది ఎక్కడో లేదు...
ఈ సృష్టిలో ప్రతీ అణువు
అణువులో అందమనేది కనిపిస్తుంది.

-బోనగిరి. పాండు రంగ
8341212132

శాంతి మెరుపులు

కోపతాపాలు వీడు
నేడు శాంతిదినోత్సవం
భగవంతున్ని వేడు
జరుపుకోవాలి ఉత్సవం !!

ప్రగతి ఆగిపోతది
మనలో కోపముండిన
విలువ తరగిపోతది
కోపాన్ని కలిగివున్న !!

కోపముంటే మనలో
మంచికి సమాధికట్టినట్లే
ద్వేషముంటే మనలో
చరమగీతం పాడినట్లే !!

కోపంతో దేన్నైనా
అసలే కొనలేము
శాంతితో దేన్నైనా
తప్పకుండ చేయగలము !!

శాంతియే సర్వమానవాళికి
శ్రేయస్సు ఇస్తది
శాంతియే అందరికి
బంధువై నిలుస్తది !!

-తాండ్ర చిరంజీవి
9959180762

లక్ష్మణరేఖ

కొన్ని రకాల భ్రమలు
మరికొన్ని వాస్తవాలు
వెరసి వెలసిపోయిన రంగులు
మాసిపోయిన హంగులు
ఇప్పుడు పలకరింపులే
కరువైపోయాయి
కరచలనాలు కానరావటం లేదు
కరిగిపోతున్నది జీవితం
హారతి కర్పూరమై
ప్రేమా ఆప్యాయతలు లేని
ఈ జగత్తు కూడా ఒక విపత్తే
తాత్కాలికంగా
లాక్‌డౌన్ ఆరోగ్యకవచమై
లక్ష్మణరేఖగా నిలిచింది.

- కొండూరి కాశీవిశ్వేశ్వరరావు
సెల్:

శ్రీ శ్రీ అక్షరాలు ఆయుధాలు



శ్రీ శ్రీ లు
అక్షరాలు కాదు
అనంతం
మహా ప్రస్థానం
ప్రశ్నలు
చంద్ర నిప్పులు
నిప్పు కణికలు
పీడనను
దోపిడిని
అణిచివేతను
ఆంక్షలను
నిలదీయటం
నిలబడటం
కలబడటం
ఎదిరించడం
సాధించడం
చేతనలు
యోచనలు
జ్వాలలు
ఉప్పెనలు
ఉద్యమాలు
రణ నినాదాలు
జన పోరాటాలు
స్వేచ్ఛ కోసం
సమానత్వం కోసం
సమసమాజం కోసం
విరిసిన శ్రీ శ్రీ లు
పరిచిన శ్రీ శ్రీ లు
విడదీయలేని శ్రీ శ్రీ లు
వడ పోయలేని శ్రీ శ్రీ లు
విముక్తి మార్గాలు
విమోచన రహదారులు
విప్లవ పూతోటలు
శ్రీ శ్రీ లు అక్షరాలు కాదు
జనం చేతి ఆయుధాలు.

-ఉప్పెన
8106073662

పుస్తక సమీక్షలు

బెల్లంకొండ సంపత్‌కుమార్ అద్భుత కవిత్వం

ఒక వేకువ కోసం

'దుఃఖం లేకుండా జీవితమే లేదు అనడానికేమో.. ప్రతి మనిషి ఏడుస్తూ పుడతాడు. ఎవరి నేపథ్యం ఏదైనా.. ప్రతి ఒక్కరూ విషాదాన్ని మోయాల్సిందే".

కవి సంపత్‌కుమార్ చిన్నతనం లోనే కన్నతల్లి కన్నుమూసి.. అతన్ని దుఃఖానికి సంసిద్ధున్ని చేస్తూ అందని ఆకాశంలో నిత్యం కన్పించే చంద మామ అయ్యింది. "చందమామ రావే.. జాబిల్లి రావే.." అని అతన్ని ఎవరూ బుజ్జగించలేదు. ఆ పాట తానే పాడుకొని, తనను తానే ఓదార్చుకున్నాడు.

ఆ క్రమంలో తనను తాను నిలబెట్టుకోవడం కోసం.. ఒంటరి తనాన్ని తరిమి కొట్టటం కోసం 'తొమ్మిదో' తరగతిలోనే కవిత్వం రాయటం మొదలు పెట్టాడు. 'మనల్ని మనం తెల్సుకుంటే కాలం మనతోనే నడుస్తుంది' అని గ్రహించినవాడు కాబట్టే

"కర్కశత్వం గొయ్యితీసి
నిలువునా పూడ్చాలని
చూసినపుడు
అశాంతి కొండచిలువ చుట్టేసి
ఎముకల్ని పిండి చేసినపుడు
ప్రతి ఘటనేరా జీవికి ప్రాణం
ప్రతి స్పందనేరా జీవిత ధ్యేయం"

అంటాడు.

చిన్నతనంలోనే అతనికి ఎదురైన అనుభవాలు అతనికి జీవితమంటే ఏంటో.. బతకటమంటే ఏంటో తెలియచేసాయనడానికి..

'ఒకే నయనం కొన్ని దృశ్యాలు' అనే కవితలో-

"భూమి తెగందే
భవనం నిల్వనట్టు
అనుభవం కొట్లాడందే
బతుకు వెలగదు..
...
ఒక చక్రం ముందుకు
ఒక చక్రం వెననకులాగే
విచిత్ర కాలచక్రం
జీవితం ఒక పోరాటం"

అని సూత్రీకరిస్తూ..

"మైళ్ళు నడిచినా దూరం తెగలేదు
ఒయాసిస్సు రాలేదు
స్వప్నించాల్సిన మధుర స్వప్నాలు
చెదిరిపోయా యంటాడు".
"దిక్కుకు దిక్కుకు నడుమ
నేనే కదా ఒంటరిగా
చితికిన తొక్కనై
నలుగుతున్నాను.
ఉరిమె కళ్ళ బరువుకు
నిరంతరం
గూని గూనిగా వంగిపోతున్నాను.."

అని బాధపడు తూనే

"వొద్దు రాలిపోయిన పోచలమైపో యినం
అరుణ కిరణాల వేడిమిలో చిగురించి
వెదురు కొయ్యలమై మొలకెత్తక తప్పదు మనం"

అంటూ తనను తానే కాదు మనల్ని కూడా

కర్తవ్యోన్ముఖుల్ని చేస్తాడు.

వృత్తిరీత్యా ఉపాధ్యాయ వృత్తికి ఎంత అంకితమై

విద్యార్థుల్ని తీర్చిదిద్దుతున్నాడో..

ప్రవృత్తిరీత్యా కవిగా సమాజం పట్ల అంతే అంకితమై అన్యాయాల్ని, అక్రమాల్ని చీల్చి చెండాడుతున్నాడు సంపత్.

'గాయమూ ఒక సందేశమే'
'గాయం కర్తవ్యమైన వేళ'
'భయం గుప్పిట్లో నే ధైర్యం.. వికసించిన పుష్పం"
'తెగిన మంజా దారం'
'పరిమళ స్వప్నం..' ఇవన్ని అతని కవితా శీర్షికలు..

శీర్షికల్ని ఏకవాక్య కవితలుగా తీర్చిదిద్దిన ఘనత సంపత్‌లో ఉందనడానికి ఇంతకన్నా ఋజువేం కావాలి?

'నన్ను నువ్వు పలకరించవు
నిన్ను నేను పలకరించను
నిత్యం కనిపించని వ్యూహ చక్రంలో బందీలమై
..కసరత్తు చేస్తుంటాము' అంటూ

అద్భుతమైన ఎత్తుగడలో మొదలుపెట్టిన 'పండించబోతున్నం' కవిత.

'రాత్రి ఉండొద్దనే అనుకుందాం
ఉదయం రావాలి కదా' అనే ఆలోచన

పూర్వక వాక్యంతో కొనసాగిన 'ప్రపంచమే ఒక ప్రశ్న' కవిత-

'రుధిరాక్షరాలు ఏరి
మేను మీద ఆరబెట్టాను
కన్నీటి ఊటల గుండెసెగలు
గాయపడ్డ ఊటల గుండెసెగలు
గాయపడ్డ రాగాల కర్తవ్యమై
రానున్న రోజుల విజయకేతనమైనాయి
ఇక- పువ్వై పరిమళించే లక్ష్యాన్ని
పదిలంగా అందుకుందాం'

అంటూ అద్భుతంగా ముగించిన 'గాయం కర్తవ్యమైన వేళ' కవిత-

బెల్లంకొండ సంపత్‌కుమార్ 'గొప్ప కవి' అనడానికి సాక్ష్యాలు.

ముగింపు:

'కవి పుష్పం కావాలి. కవిత్వం పరిమళమై వ్యాపించాలి.'

అంటూ మనసును హత్తుకునేలా ముందుమాట రాసిన డా॥నాళేశ్వరం శంకరం..

డా॥బెల్లంకొండ సంపత్‌కుమార్ కవిత్వాన్నే కాదు జీవితాన్ని కూడా పాఠకులకు పరిచయం చేయడం ఆత్మీయంగా ఉంది.

ఉద్యమ నేపథ్యంలో.. విషాద సాంగత్వంలో బెల్లంకొండ రాసిన కవితలు అల్లంకొండలా ఘాటెక్కిస్తా యి. అభినందనలు.

ప్రతులకు:
బి. మాధవి సంపత్‌కుమార్
303- శివగంగా అపార్ట్‌మెంట్స్
మంజీరానగర్- ఓల్డ్ అల్వాల్
సికింద్రాబాద్-10.
సెల్: 99085 19151



- కాంచనపల్లి
రాజేందర్ రాజు
సెల్: 9849226423

కవికి తల్లిప్రేమ "కవిత్వం"

ప్రతి ఏడాదికి ఒక్కసారే చచ్చి
పలకరించిపోయే
సంక్రాంతో.. ఉగాదో.. దీపావళో కాదు
కవిత్వం
కవి హృదయం స్పందిస్తే
రసజ్ఞతని చిందిస్తే
అక్షరరూపం దిద్దుకున్న ప్రతిరోజూ
కవికి పండుగే
శ్వాసించే ప్రతి శ్వాస
కవిగుండెల్లో నిండుగా కురిసే వెన్నెలే!
ఒక కవుల సమ్మేళనమో
ఒక పుస్తకావిష్కరణ సభలో
ఒక పుస్తక ప్రదర్శనో
ఏదైతేనేం..?!
కవిత్వం, ప్రాణం ఒకటే అయిన వారికి
అక్షరం అమ్మని తలచి
నిత్యం కొలిచేవారికి
వలస పక్షుల్లా వాలే కవులు
సభలో అక్షర స్వరాల పాదాలకి పరవశిస్తూ
శ్రోతల చప్పట్లు-
కవుల స్పందనలకు ఊదే
నవచైతన్య ఊపరులు
దినవార మాస పత్రికల్లో
శ్వాసించిన కవిత.

- మాధవీ సనారా
సెల్: 8639491246

చెరువులు

తొలకరి జల్లుకై తొంగిచూసు..
తల్లిరో మా ఊరి చెరువమ్మ..
టపటప చినుకులకు తడిసిపోతు..
తనువంత గంగై మురుసునమ్మ..

వాగులు వంకలు పొంగిపొర్లుతు..
చెరువమ్మ చెంతకు చేరుకొనును..
నిండుకుండలా అలలాడితే.
రైతన్నలు పనులు మొదలెట్టును..

నాగండ్లతో దుక్కిదున్ని..
నారుమళ్లు అలుకుతుండును..
అవని తల్లియు పునాసబట్టి..
పురుడుబోసుటకు సిద్ధమవును..

పశు పక్ష్యాదుల దూప తీర్చే
చల్లని తల్లిరా చెరువమ్మ..
కరువు కాటకాలు తీర్చేటి..
అక్షయ పాత్రరా చెరువమ్మ..

పల్లెల్లోని బీద రైతులకు..
ఆయువుపట్టురా చెరువమ్మ..
పూడికతీతతోటి అయ్యెను..
కలకాలంగా అన్నపూర్ణమ్మ..

-పసుల.శంకర్
9542181301

కరోనా! (గజల్)

ఇంటికి ఒక విషాదాన్ని రాస్తున్నది కరోనా
ఒంటిమీద విలాపాలు పూస్తున్నది కరోనా
మనిషిమీద కరోనాది యుగయుగాల పగ నేమో
కంటిని ఘన సంద్రాలను చేస్తున్నది కరోనా

నిర్లక్ష్యం దీనియొక్క నిజమైన చిరునామ
మంటలను బతుకున ఎగదోస్తున్నది కరోనా

అలసత్వం దీనికి అందమైన మిత్రుడేమొ
అదునుచూసి కరినకాటు వేస్తున్నది కరోనా

మొండితనం తోనె తనకు మెండైన స్నేహమేమొ
వండిన కూడున మన్నులువోస్తున్నది కరోనా
కల్లోలమై మిగలకు కాసర్లా జాగ్రత్తా
ముందుచూపు మందు తొ జడుస్తుంది కరోనా!

-డా.కాసర్ల నరేశ్ రావు
9441406252

బంధాలు

కడుపు పేగు కోతతో
ఆయుష్షును అడ్డుపెట్టి
ఆయువు పోసి ప్రేమ పంచి
అనురాగంతో పెంచేది
అమ్మతో అను బంధం.

కనిపెంచి పోషించి ఆప్యాయత,
అనుబంధం పంచే విడదీయలేని
అనురాగ బంధం. నాన్నతో బంధం.

ప్రేమ, ఆప్యాయత
కలబోసి అనురాగం పంచే
అన్నదమ్ముల, అక్కచెల్లెల్ల
మమతానురాగాల అపూర్వ బంధం.
కష్టంలో సుఖంలో తోడుగా ఉండేది,
జీవితపు దిశ-నిర్దేశం చూపేది..
గొప్పనైన స్నేహ బంధం.

ఆరాధన, ఆప్యాయత, కలబోసి
ఒకరంటే ఒకరికి నమ్మకం కలిగించి
అనురాగంపంచే అపురూపం ప్రేమబంధం

ఒకరికోసమొకరుగా,తోడు నీడ జతగా
తీయని రాగబంధం, ప్రేమను పంచే
ఆత్మీయ పెంపొందించే
భార్యభర్తలఅనుబంధం.

సృష్టిలో ఎన్నో బంధాలు
అనురాగ ఆత్మీయ బంధాలు
ఈ బంధాలతోనే జీవితాలు
కొనసాగింపు...!
జీవన గమనంలో
ఈ బంధాలే కొలమానాలు..!!

-ఎన్.. రాజేష్
9849335757

రైతు -మొగ్గలు

వారి స్వేద బిందువులు మన ఆత్మబంధువులై
మన జానెడు పొట్టకు అక్షయ పాత్ర అవుతుంది
అన్నార్తులకు ఆపన్న హస్తం మన రైతు.

వాన నీళ్ళుకోసం ఎదురుచూడక కష్టపడుతూనే
పాడి పంటల కోసం కన్నీళ్ళను దిగమింగుతాడు
ఆకలి,దప్పులు తీర్చే అపర బ్రహ్మ మన రైతు

కరువు కాటేస్తున్నా తన వెన్ను చూపకుండానే
మన్నును నమ్ముకుని మనల్ని బ్రతికిస్తుంటాడు
అన్నపూర్ణమ్మకు దత్తపుత్రుడు మన రైతు

మన కడుపు కోసం తన ఏడుపు ఆపుకుంటూనే
మన మెతుకు కోసం తను బ్రతుకుతుంటాడు
ఎన్ని కష్టాలొచ్చినా ఎదుర్కునే సవ్యసాచి మన రైతు

తన కుటుంబాన్ని ఒకవైపు పోషించు కుంటూనే
మన కుటుంబాలకి పెద్దన్న పాత్ర పోషిస్తుంటాడు
అలుపెరగని మహా యోధుడు మన రైతు

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 324వ రోజు 'గుర్రం జాషువా' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'గుర్రం జాషువా' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.- సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:
డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

విశ్వ నరుడు

వినుకొండలో పుట్టి
విశ్వనరునిగా ఎదిగిన
నవయుగ కవి చక్రవర్తి!!.
ఆకలి సహనం నేర్పిస్తే
కుల వివక్ష ఎదిరించి ని
లిచే పట్టుదలను నేర్పించ
ఇద్దరు గురువులు నాకు అని
గొప్పగా చెప్పుకొన్న మహాకవి జాషువా!!
కులం కుళ్లు అంటగట్టి
కులమతాల గజ్జిని గీకినా
దీపాల పిచ్చయ్య తోడు
జానుమద్ది హనుమత్ శాస్త్రి వద్ద శిష్యరికం
అపార పాండిత్యం పొందిన
ఘనుడు తాను!!
అవమానించిన సమాజమే
గౌరవించే స్థాయికి ఎదిగి
కవితా వధూటి నుదుట
కావ్య తిలకాన్ని దిద్దిన మహాకవి!!.
రాజు మరణించె ఒక తార రాలిపోయె
కవియు మరణించె నొకతార గగనమెక్కె
రాజు జీవించు రాతి విగ్రహములందు
సుకవి జీవించు ప్రజల నాలుకల యందు
వాగ్దేవిని గగన విహారం
చేయించిన కళాప్రపూర్ణ!!.
ప్రతీకాత్మకతతో రాసిన గబ్బిలం
కవి ఆవేదనకు పరాకాష్ట ఫిరదౌసి
బాపూజీ నేతాజీ క్రీస్తు బుద్ధుడు
ఎన్నెన్నో కావ్యకుసుమాలను గుచ్చి
సరస్వతీ కంఠహారంలో అలరింపచేసిన
పద్మభూషణుడు కవితా విశారద!!.
పెళ్లిళ్లకు లక్షలు ఖర్చు చేసే జనం
పేదవాని పాత్రలో
ఒక్క మెతుకు విదిల్చరని
కలతచెందిన కవిమనసు
సామాజిక రుగ్మతను రూపుమాప
కలంపట్టి
మూఢాచారాలపై
కవిత్వాయుధాన్ని
ఎక్కుపెట్టిన విశ్వకవి!!

- డా. చీదెళ్ళ సీతాలక్ష్మి

విద్వత్కవి

అసమానత్వ బురదనుండి
పూసిన కవితా పుష్పం
ఈనాటికీ ప్రజల నాలుకలపై
చిరంజీవిగా నిలిచిన సుకవి.
గబ్బిలంలో అరుంధతి సుతుని సృష్టి కర్త
అందమైన కవితాశిల్పి
ఫిరదౌసినీ కాందిశీకుడినీ
ముంతాజ్ మహల్నూ
మలిచిన విద్వత్కవి
కవితాధారకు కులమతాలు
అడ్డు కాదని నిరూపించిన పద్మభూషణుడు
అణగారిన వర్గాలకు
కవితా పట్టం కట్టిన కవి సామ్రాట్
క్రీస్తు చరిత్ర అంటూ
నా చరిత్ర నేనంటానన్న
పద్మ విభూషణుడు...
గాంధీ జీ గురించి తెలిపిన
అసమానతలను రూపు మాపి
కవితా శిల్పాలను
నిలిపిన కవిరాజు..

-పుష్పలత బండారు

సాహిత్య విజయం

కులం ఆచారం
మత ఛాందసం
సంఘ ఆధిపత్యం
రాజ్యాంగ జననం
స్ఫురణం లేని జనం
రాజ్యమేలుతున్న
బందీ భారతంలో
జనించిన సాహితీ
వజ్రపు తునక
సృజనాత్మకత
పర్యాయ పదమైన
జాషువా
వెలువేసిన సంఘం
ఆదరణ చూపని మతం
ఆకలి తీర్చని ఆచారం
అన్నింటినీ వెక్కిరిస్తూ
ముక్కున వేలేసుకునేట్లు
చేసింది మిషనరీ స్కూల్
అవపోసన పట్టింది
తెలుగు నైపుణ్యం
వెలివేయని జ్ఞానం
అందలం ఎక్కించి
గ్రంథాలు రచింపచేసి
దూరం అన్న జ్ఞానులు
సాహిత్యాన్ని గెలిపించిన
మహా కవి మన జాషువా.

-జె.నరసింహారావు

నవయుగ వైతాళికుడు

కండబలం గుండెబలం దండిగా
వినుకొండలో జన్మించిన
ఆంధ్ర సాహిత్య సామ్రాజ్య
మకుటం లేని మహారాజు
విశ్వనాథ సమకాలీకుడు!!.
అంటరానితనం వెంటాడినా
ఛీత్కారాలు ఎదురయిన చోటే
సత్కారాలు పొందాడు
సరస్వతీ దేవి పాదాల చెంత పెరిగి
కళామతల్లి ముద్దుబిడ్డగా ఎదిగి
అగ్రకులాల అవధాన దిగ్గజం చేతే
గండపెండేరం తొడిగించుకున్నాడు!!.
పలుకుల రాణి పదములకు
దక్కింది ఈ గౌరవం అని
ప్రతిభకు పట్టం కట్టించుకున్నాడు
కళాప్రపూర్ణుడు పద్మభూషణుడు
కులంతో దూరమయినా
కలంతో జయించాడు!!
జాషువా అంటే వారెవ్వా అనిపించుకున్నాడు

పసిడి పోగు శాలువా !

కుల వివక్షకు
కుదేలై పోలేదు !
మసి బారిన వ్యవస్థపై
కసిగా ఎగసి పడ్డాడు !
ఛీత్కారాలను చిదిమేస్తూ
తిరస్కారాలు విరిచేస్తూ
సాహితీ వనంలో అడుగేసి
అందని ఎత్తుకి ఎదిగాడు !.
కలంలో మాటై
గళంలో పాటై
గురిపెట్టిన అక్షర బాణాలు
లక్ష్యం దిశగా వదిలాడు !.
అతిరథ మహారథుల సమక్షంలో
ఆత్మగౌరవ ధ్వజం ఎగరేసాడు !
ఆవిష్కరించిన అక్షర రూపాలకు
పురస్కారాలేన్నో అందుకున్నాడు !
మన ఎదలో నిలచిన
మహాకవి గుర్రం జాషువా
వాగ్దేవి మేనుపై మెరిసిన
పసిడి పోగుల శాలువా !.

- రామకృష్ణ చంద్రమౌళి

విశ్వ మానవుడు

కుల మతాల అతీతుడు
విశ్వ మానవ సమానతే
ఆతని ధ్యేయం
అందుకే చిరకాల పోరాటం.
పుట్టుకతో దళితుడైనా
పట్టుదలతో కవిశేఖరుడు
భావకవిత్వ సంప్రదాయం
తోసి రాజని
సాహిత్య ప్రయోజనం
సామాజిక ఉపకారంగా
రచనా స్రష్ట
నవయుగ కవితా చక్రవర్తి
కవితా ప్రతిభతో
తెలుగు సాహితీ లోకంలో
ప్రజ్వరిల్లిన సాహితీ మూర్తి
కవిత్వమే ఆయుధం
మూఢాచారాలపై తిరుగుబాటు
తెలుగు సాహితీ గగనంలో
ఎగసిన విజయ కేతనం.
ముందు ఛీత్కారాలు
తర్వాత ప్రతిభ సత్కారాలు
ఆధునిక కవుల్లో ప్రథమ పీఠం
చెళ్ళపిళ్ళచే గండపెండేరం
కళా ప్రపూర్ణ బిరుదు
పద్మభూషణం భూషణం
ఆంధ్ర ప్రదేశ్ శాసన మండలి
సభ్యత్వం...
సుకవి జీవించు ప్రజల
నాల్కలయందు అని
తోటి కవుల కిచ్చిన సందేశం
హాస్య ప్రవృత్తి మరో కోణం
బొమ్మలు గీయటం
పద్యాలు పాడటం
ప్రజ్ఞా పాటవాలకి
గీటు రాళ్లు.

-మోటూరి శాంత కుమారి

సుకవి చక్రవర్తి

వినుకొండ జన్మించి విశ్వనరుడై వెలసె
గుర్రం జాషువాగ గుండెలో తానిలచె
వివక్షత కొలిమిలో విపరీత వేదనలు
అసమాన సంఘమున అవమాన బీజాలు
ఓర్పుతో నెదిరించి నేర్పుగా నిరసించి
గబ్బిలము వెళ్లి దివి గడుసు ప్రశ్నలు వేయ.
నిలదీసి రుద్రునే నిజమైన చేతనము
ఫిరదౌసి కావ్యమున నిరసించి రాజులను
చిత్రానీగి పగతోడ చిరవిషాదము చూపె
సారంగధర తెల్పె సరికావ్య కౌశలము
ముంతాజు మహలుతో
వింతైన రచనమది
విజయనగరపు శోభ విఫణి వీధులలోన
పారశీకపు యశ్వ పరుగులివి జాషువా
శిలను చెక్కిన శిల్పి సింగార మద్భుతము
ఆదరించిన పుణ్య ఆత్మీయ కవులెల్ల
కవికోకిలను జూసి కప్పితిరి శాలువలు
గండపెండేరమును గడుసుగా తొడిగించి
పాదమును తాకించి
పరిహారమిచ్చె హరి !.



-ఎం. వి. ఉమాదేవి

కవిచక్రవర్తి

విశ్వ మానవుడి చిరునామా
గుర్రం జాషువా
పుట్టుకతో దళితుడై
పట్టుదలతో కవిశేఖరుడై
సాహితీ లోకంలో ప్రతిభతో
కవిచక్రవర్తిగా ప్రజ్వరిల్లిన తేజోమూర్తి.
సమకాలీన వరవడి
భావకవిత్వ రీతి నుండి
పక్కకు జరిగి
సామాజిక ప్రయోజనాల కోసమే
అనేక రచనలు
కుల వివక్షతో
అనేక అవమానాలు
అసమానతలపై తిరుగుబాటు
ఛీత్కారాలు ఎదురైనచోటే
సత్కారాలు పొందాడు.
తనకు గురువులు ఇద్దరని
ఒకటి పేదరికమైతే
రెండవది కులమత భేదమని
ఒకటి సహనాన్ని పెంచితే
ఇంకొకటి ఎదిరించే శక్తిని పెంచినదన్నారు.
కవితను మెచ్చినవారే
కులము తెలుసుకొని
చివాలున లేచిపోవుటపై
కళకు కులమత భేదాలున్నాయా
అని ప్రశ్నించాడు
అవమానాల గాయాల పచ్చిదనం
వృద్ధాప్యంలోనూ మానని గాయం
ఎంత లోతైనదో!
తెలుసుకోమన్నాడు
"వడగాల్పు నాజీవితమైతే
వెన్నెల నాకవిత్వం"
సగర్వ ప్రకటన జాషువాది

-నాగిరెడ్డి అరుణ జ్యోతి

వహ్వా జాషువా

సంకుచిత భావాల సమాజపు కొలనులో
కవన సూర్య ప్రకాశ కిరణాలలో
కమలమై వికసించి
మెరిసిన కవిశేఖరుడు
సాహితీ జగతి మురవగా
వాసికెక్కి అందరితో వహ్వా
అనిపించుకున్న సహజ కవి.
నామంలోని గుర్రపు వేగం
కలానికబ్బి
కవితలను
కవన మైదానంలో
ఉరకలెత్తించిన రౌతు.
పచ్చని పొలాల మధ్య
హాయిగా గడచిన అమాయక బాల్యం
వయసు పెరిగే కొద్దీ
కులాలూ మతాల గోడల మధ్య
అవమానపు ముళ్ల పొదల్లో చిక్కుకొని
కుచ్చీ చీల్చీ బాధిస్తుంటే
ఆవేదనా భరిత జీవితానికి
భగవత్ప్రసాదిత మేధను జోడించగా
ఉద్భవించిన దివ్యకవితాకుసుమాలెన్నో.
స్వార్థపరులు నిండిన ఈ లోకంలో
తనను ఆదరించిన దైవమూర్తులను చూసి
ఇంకా మానవత్వం మరణించలేదనీ
సమాజాన్ని సంస్కరించాలనీ
ఆ దిశలో కత్తినే ఖడ్గమని తలచి
రచనా యుద్ధం చేసిన యోధుడు.
సాహిత్య సేవలకు
కళా ప్రపూర్ణ, పద్మ భూషణ్
మరెన్నో బిరుదులు
సాహిత్య చంద్రునికి నూలుపోగులు.
వాల్మీకి దుఃఖం నుండి ఉద్భవించిన
మహాకావ్యం రామాయణంలా
జాషువా దుఃఖావేశం నుండి
ఉదయించిన మహాకావ్యం
సమాజ సంస్కరణకు
మహత్తర సందేశం గబ్బిలం.

-సౌదరి మోహన్ గౌడ్

నవయుగకవి

'గెలవాలంటే కష్టాలను ఓర్చుకోవాలని'
తథాగతుడన్నట్లు
కష్టాల కన్నీటి కడలిలో మునిగి తేలి
పుట్టినరోజు చిరుగుల చొక్కా
నోరు తీపి చెయ్యటానికి కొట్లో
తల్లి అడిగి తెచ్చిన బెల్లం ముక్క
చదువుకోవాలన్న కోరిక ఉన్నా
నెరవేర్చుకోలేని కడజాతి బాలుడు.
బాల్య స్నేహితుడు చదువు "దీపాలు"
వెలిగించి చెప్పిన ఉద్గ్రంథాలు
కలానికి లేని కులం కవికి ఎందుకు?
కులం కన్నా గుణం మిన్న
గిజిగాడు, గబ్బిలం, ఫిరదౌసి
సత్య హరిశ్చంద్ర కాటిసీను పద్యాలు
చిత్రాంగి, సారంగధర ,ముంతాజ్ మహల్
కొత్త లోకం, నేతాజి, బాపూజీ, నా కథ
భారత మాత పద్యాలు, శిశువు
ఆనాటికి ఈనాటికి ఏనాటికి
సమాజంలో చెరగని గుర్తులు.
పీడిత తాడిత ప్రజల వేదనే
తంజావూరు లో చెప్పులు
కుట్టేవాని వెతలు
తిరస్కారాలు పొందిన చోటనే
పురస్కారాలు పొంది
కులం రక్కసిని కాలదన్ని
'ఒట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్'అన్నట్లు
కన్న కూతురికి కులమతాంతర
వివాహం చేసిన మహనీయుడు
హేళన చేసిన వారి చేతనే
సత్కారాలు పొందిన మహాకవీ!
గజారోహణ, కనకాభిషేకం, గండపెండేరం
సత్కారాలూ బిరుదులూ పొందినధ్రువతారా!
'సుకవి జీవించు ప్రజల నాల్కలయందు'
జాషువా ఏ యుగానికైనా
నవయుగ కవే!

-మన్నె లలిత

నవయుగ వైతాళికుడు

వడగాల్పు నా జీవితం
అయితే
వెన్నెల నా కవిత్వం అన్నాడు
ఖండ కావ్య రచనలో
అందె వేసినచెయ్యి
గజారోహణం చేయించుకున్న
కవి దిగ్గజం!!.
కవిత్వమేఆయుధంగా
మూఢాచారాలపై తిరుగుబాటు చేశాడు
సంఘ సంస్కరణే కావ్య ధ్యేయమన్నాడు!!.
రాజు మరణిస్తేరాతి విగ్రహాల్లో ఉంటాడని
సుకవి మరణిస్తే
ప్రజల నాలుకపై ఉంటాడని నుడివి
తానే ఒక విశ్వకవి
సామ్రాట్ గా హారతులందుకున్నాడు!!.
జాషువా కవితాభావాలు
చిటికెన వేలేసుకు వచ్చే
లేలేత జవరాళ్లు
ఆంధ్రుల ఘనకీర్తినిదిగంతాలకు చాటాడు
నవయుగ కవి చక్రవర్తి
నవయుగ వైతాళికుడు
జాషువా మహాకవి!!.

- పరిమి వెంకట సత్యమూర్తి

అక్టోబర్ 1న అసోసియేషన్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్ కళానిలయం సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ పెద్దల దినోత్సవ వేడుకలలో విశిష్ట అతిథిగా ప్రసంగిస్తున్న పొత్తూరి సుబ్బారావు. చిత్రంలో డా॥కె.వి.రమణాచారి (ముఖ్యఅతిథి) దంపతులు, డా॥లింగారెడ్డి, ఐనంపూడి శ్రీలక్ష్మి, హైమవతీ భీమన్న, కళా వి.ఎస్. జనార్దనమూర్తి,

భక్తులు కొవిడ్ వ్యాక్సిన్ ధ్రువపత్రంతోనే రావాలి : టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



తిరుమల : శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా కొవిడ్ టీకా తీసుకున్న ధ్రువీకరణపత్రాలతోనే రావాలని తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కోరారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో టీటీడీ చైర్మన్ మీడియా సమావేశం నిర్వహించారు. గురువారం సాయంత్రం బ్రహ్మోత్సవాలు మీనలగ్నంలో ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయని చెప్పారు. కరోనా నేపథ్యంలో ఏకాంతంగానే ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆలయ కల్యాణమండపంలో వాహనసేవలు జరుగుతాయన్నారు. ఆగమోక్తంగా అన్ని వైదిక కార్యక్రమాలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

ఈ నెల 15న చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయని, చక్రస్నానం కూడా ఆలయంలో ఏకాంతంగానే జరుగుతున్నారు. ఈ నెల 11న సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. పర్యటనలో సీఎం పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తారన్నారు. బర్డ్ ఆసుపత్రిలో చిన్నపిల్లల గుండె చికిత్సశాల, అలిపిరి గోశాల, నడక మార్గానికి సీఎం ప్రారంభోత్సవం చేస్తారన్నారు. అలిపిరి నడక మార్గాన్ని రూ. 25కోట్లతో ఆధునికీకరించినట్లు పేర్కొన్నారు. అలాగే తిరుమలలో కొత్త బూందీ పోటును.. ఎస్వీబీసీ కన్నడ, హిందీ చానెళ్ల ప్రసారాలు సీఎం ప్రారంభిస్తారన్నారు.

సుమిత్ర శ్రీ ఓకేషనల్ కళాశాలలో బతుకమ్మ పండుగ సంబరాలు

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 6:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని సుమిత్ర శ్రీ ఓకేషనల్ కళాశాలలో తెలంగాణా రాష్ట్ర పర్వదినం బతుకమ్మని పురస్కరించుకొని బతుకమ్మ సంబురాలు నిర్వహించారు.. తంగేడు ,గునుగు ,గుమ్మడి ,పట్టుకుచ్చులు వంటి రకరకాల పూవులతో విద్యార్థినులు ఉపాధ్యాయినిలు సృజనాత్మకంగా రకరకాల బతుకమ్మలను పేర్చారు.

కళాశాల ఆవరణలో పిన్సిపాల్ మడ్డి స్వప్న ,విద్యార్థినులు ఉపాధ్యాయినిలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలను మధ్యలో ఉంచి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలతో ,దాండీయా కోలాటాలతో ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న మాట్లాడుతూ ప్రకృతికి అందాన్ని చేకూర్చే రకరకాల పూవులతో బతుకమ్మలని అలంకరించి మనందరి బతుకులు బాగుండాలని ఆనందంతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణా సంస్కృతికి నిలువుటద్దమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చంద్రషేఖర్ అధ్యాపకులు గోపి, రాజు, వంశీ, మల్లీశ్వరి, రాం ప్రసాద్, కిరణ్ మై, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు...

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన కాంగ్రెస్ నేతలు

కరీంనగర్ అక్టోబర్ 6:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో మైనార్టీల జీవన స్థితి గతులపై..వారు ఎదుర్కొంటున్న సమస్యలపై శాసన మండలి వేదికగా కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి సుదీర్ఘంగా లేవనెత్తిన పలు అంశాలపై హర్షం వ్యక్తం చేస్తు జిల్లా మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరా చౌక్ లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చిత్ర పటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర శాసన మండలిలో మైనారిటీల సమస్యలపై..వారి స్థితిగతులపై..జీవన ప్రమాణలపై సుదీర్ఘంగా ప్రస్తావించిన విషయాలను కేసీఆర్ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి మైనార్టీ సంక్షేమానికి కృషి చేయాలని అన్నారు,

జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎం డి తాజొద్దిన్ మాట్లాడుతూ మైనార్టీలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు, 12 శాతం బడ్జెట్ లో కేటాయించి మైనార్టీలకు, క్రిస్టియన్లకు జీవనోపాధి కోసం కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు, విద్య, ఉపాధి కోసం ఆర్థిక సాయం వంటి పథకాలు సరిగా అమలు కావడం లేదన్నారు. డ్రైవర్ కం ఓనర్ పథకం పడికేసిందని, మైనార్టీ గురుకులాలకు సైతం అరకొరగా నిధుల కేటాయింపు జరుగుతోందని ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి చేసిన డిమాండ్లను ప్రభుత్వం చిత్తశుద్ధితో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దశల వారీగా మైనార్టీలను చైతన్య వంతం చేసి ప్రభుత్వ వ్యతిరేక నీతిని, ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, ప్రజా ఉద్యమాలు నిర్వహించి, న్యాయ పరమైన తమ డిమాండ్లను..12శాతం రిజర్వేషన్లను సాధించుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డి సి సి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, నాయకులు వైద్యుల అంజన్ కుమార్, సమద్ నవాబ్, ఉప్పరి రవి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కొమ్ము సునీల్, అబ్దుల్ రహమాన్, లాయిక్, ఖమరోద్దిన్, మామిడి సత్యనారాయణ రెడ్డి, కొరివి అరుణ్ కుమార్, దన్నాసింగ్, ఏజ్రా, రామిడి రాజిరెడ్డి, నిహాల్ అహ్మద్, లింగంపల్లి బాబు, కుర్ర పోచయ్య, నదీమ్, సలీమ్ ఉద్దీన్, విక్టర్, మేకల నరసయ్య, జాఫర్, షహేన్షా, లింగమూర్తి, ఫిరోజ్, కలీం ,ఫక్రుద్దీన్ ,జీలకర్ర రమేష్, రాంరెడ్డి, రియాజ్, కరీం, పోరండ్ల రమేష్, శబనామహ్మద్, హమీద్, ఎం డి జాఫర్, జహంగీర్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 27న నజి.వి.ఆర్.ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో డా॥అక్కినేని పురస్కారాలతో పాటు నగదు రూ॥5000/-లు స్వీకరించిన పి.విజయకుమార్, రాము పండా, బొప్పన నరసింహారావు, నిర్మల ప్రభాకర్, కె.లక్ష్మి రవీందర్. చిత్రంలో డా॥రామరాజు శ్రీనివాస్ దంపతులు, జి.వెంకటరెడ్డి, డా॥చిల్లా రాజశేఖర్‌రెడ్డి, లంక లక్ష్మీనారాయణ, హమీదు.

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

అడ్మిన్: రమాదేవి కులకర్ణి

'బుధవారం బాధ్వా'

పోటీ ఫలితాలు

ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.
నిర్వహణ: డా॥ప్రతికంఠం మాలతీలత

బ్రతుకు పయనం

ప్రథమ బహుమతి విజేత

తొలిశ్వాస జననం
తుదిశ్వాస మరణం
ఈమధ్యనే బ్రతుకు పోరాటం
అడుగులువేసిందిమొదలు
అంతిమ వరకు
కాలంతో పోటీపడతాడుమనిషి
బ్రతుకునడిచేందుకుచేస్తాడుకృషి
నడకనేర్చిందాకా తప్పటడుగులపరుగు
పరుగునేర్చిన తర్వాత
బ్రతుకుపయనం వైపు అడుగు
కష్టాలసంద్రాలు
ఆకలితుఫానులు
బాధల సునామీలు
దాటుకుని చేస్తుంటాడు పోరాటం
కడుపునింపుకు నేందుకు పడతాడు ఆరాటం
ఎక్కుతాడు స్వార్థాలనిచ్చెనలు
అన్యాయపుకట్టడాలు
అబద్ధాలసౌధాలు నిర్మించుకుని
పరుగులజీవితం సాగిస్తాడు
బాగాబ్రతకాలన్నతపన
తనవారిని ఉన్నతంగా
ఉంచాలన్న ఆలోచనతో
పెంచుతాడు బ్రతుకువేగం
ఆప్రయాణంలో గుప్పెడుమేతులకులతో
తృప్తిపడదు
కడుపునిండితే చాలుఅనుకున్న
రోజులుమరుస్తాడు
ఆశలబిగికౌగిలిలో చెయ్యని
పాపాలు దొక్కనిదారులుండవు
సంపాదించిన సొమ్ముకడుపునింపదు
భూమినపడిన గింజలుతప్ప

-భరద్వాజ రావినూతల
99866203795

ఆగని పరుగు

ద్వితీయ బహుమతి విజేత

ఇంటిలో ఆమె పాదాలు
మంజీర లయాన్విత ధ్వనులై
పనులలో మమేకమై చలిస్తుంటాయి!
వాకిట్లో ఆమె పాదాలు
కళలను ఆవిష్కరిస్తున్న
కరాలకు ఊతమిస్తుంటాయి...
మట్టిని నమ్ముకున్న ఆ పాదాలు
శివుని విభూతిలా ప్రేమగా పులుముకుని
మహిలోంచి బువ్వను పండించేందుకు
కాలంతో ఆగని పరుగులు తీస్తాయి!
మధ్యాహ్న మార్తాండుని ప్రచండ వేడికి
కందిన పాదాలు
చెప్పుల కవచాన్ని ధరించి
నిర్భయంగా పయనిస్తుంటాయి...
ఆగని పరుగు విద్య తెలిసిన
అలుపెరుగని
మహా రాజశ్రీ పాదాలు
విద్యుక్త ధర్మ నిర్వహణలో
జీవితమంతా ఆగని
పరుగు తీస్తూనే ఉంటాయి!
దేశ రక్షణ కోసం
శత్రువుల గుండెల్లో గుబులు రేపుతూ
ఆగకుండా విజయం వైపు
పయనిస్తుంటాయి...
ఎవరి పాదాలైతేనేం
ఎందరో జీవితాల్లో వెలుగులు నింపేందుకు
ప్రతి క్షణం భూమిలా
ఆగకుండా తీసే పరుగులకు
శిరసా వందనాలు చేద్దాం!

-పురిమళ్ల సునంద
9441815722

అమాయకపు గుట్టన్న కథలు (పిల్లల హాస్య కథలు)

ఊతకర్ర

గుట్టన్న ఒకసారి పొరుగూరికి పయనమయ్యాడు. దారిలో ఒక అరటి తొక్క పై కాలు వేసి జర్రున జారాడు. నేలపై బోర్లా పడిపోయాడు. అదృష్టం కొద్దీ వాడిని ఎవరు చూడలేదు. ఆ బోర్లా పడిపోయేటప్పటికీ వాడి నెక్కరు అంతా చిరిగింది. దాంతో వాడు ఊరికి పోకుండా తిరిగి బట్టలను మార్చుకుందామని ఇంటికి వచ్చాడు.

మళ్లీ పొరుగూరుకు వెళుతూ ఈసారి గేదె పేడలో చూడకుండా పొరపాటుగా తన కాలును వేసాడు .మళ్లీ జారిపడ్డాడు. అదృష్టవశాత్తూ బట్టలు చిరగలేదు. కానీ వాడి బట్టలకు మట్టి అంటుకున్నది. వాడు లేచి ఆ మట్టిని దులిపాడు. ఇక లాభం లేదని వాడు ముసలి వారు పట్టుకునే ఒక ఊతకర్రను సంపాదించి దానితో మెల్లమెల్లగా నడవడం ప్రారంభించాడు.వాడిని చూసి పిల్లలు వాని వెంబడి పడి "ముసలి తాత " అని గేలిచేయ సాగారు. వాడికి ఏం చేయాలో అర్థం కాక ఆ కర్రను పారవేశాడు. దాంతో పిల్లలు వెక్కిరించే బాధ వాడికి తప్పింది.

వాడు కొద్ది దూరం వెళ్ళాక నూనె ఒలికిన ఒక రహదారి కనిపించింది. వాడు "అందరినీ జాగ్రత్తగా నడవండి" అని చెప్పి వాడే క్రింద జారిపడ్డాడు.

ఈసారి వాడిని చూసినవాళ్లు జాలి పడడానికి బదులు నవ్వడం ప్రారంభించారు. " ఎందుకలా నవ్వుతారు? నేను చేతికర్ర పట్టుకుంటాను లే" అని మళ్ళీ మరొక చేతికర్రను సంపాదించి దాని సహాయంతో నడచి పొరుగు గ్రామానికి చేరుకున్నాడు.

-సంగనభట్ల చిన్న రామ కిష్టయ్య
9908554535

అక్షర సేద్యం ఫౌండేషన్

భారత స్వాతంత్ర్య వజ్రోత్సవ బాలల కవితల పోటీ - 2021

(క్రీ॥శే॥ తొరటి హైమావతి-రామారావు, మహబూబాబాద్ గార్ల స్మారకార్థం)

మన దేశానికి స్వాతంత్ర్యాన్ని సంపాదించిన ఎందరో త్యాగధనులను స్మరించుకుని నేటితరం పిల్లలకు వారి గురించి తెలియజేయడం మన బాధ్యత. 75వ స్వాతంత్ర్య వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పాఠశాలల విద్యార్థుల నుండి 'కవితల పోటీ'కి కవితలు ఆహ్వానిస్తున్నాము.

బహుమతుల వివరాలు :
75 ఉత్తమ కవితలు ఎంపిక
ప్రతి విజేతకు 100/- ల విలువైన సాహిత్య పుస్తకాల బహుకరణ

నియమ నిబంధనలు :
- విద్యార్థులు తమకు నచ్చిన అంశంపై కవితలు వ్రాయవచ్చు.
- కవితల నిడివి చేతివ్రాతలో 20 వరుసలు మించరాదు.
- పోటీకి పంపించే కవితలు ఇదివరలో ఏ పత్రికలోనూ ప్రచురణ కానివి. వాట్సప్ / బ్లాగులలో పరిశీలనలో లేనివి. కవిత తమ స్వంతమేనని హామీ పత్రం తప్పనిసరిగా జతపరచాలి. హామీ పత్రంపై ప్రధానోపాధ్యాయులు/ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులు లేదా త